# క్రైస్తవ నీతి ప్రకాశము

## THE GOSPEL TRUMPET

### THE BRIGHTNESS OF THE CHRISTIAN LIFE

రెవ. పురుషోత్తమ చౌధరి, కవికృతము,

కటకపురి.

THE CHRISTIAN LITERATURE SOCIETY FOR INDIA

(UNITED SOCIETY FOR CHRISTIAN LITERATURE)

MADRAS BANGALORE MYSORE TIRUVALLA COLOMBO

1953

G.L.

COPYRIGHT

*First published by the late* REV. T. ANTHRAVEDY *in* 187?
*Subsequent Publication by the* C.L.S. *as follows*:

| | |
|---|---|
| *First Printed* | *1903* |
| *Reprinted* | *1933* |
| *Reprinted* | *1948* |
| *Reprinted* | *1953* |

PRINTED IN INDIA AT THE DIOCESAN PRESS, MADRAS

# విషయసూచిక

## అవతారికా స్తుత్యాదులు


పదముల సంఖ్య

క్రైస్తవుడు స్థిర చిత్తము గలిగి యుండవలయును ... ... 1— 2
క్రైస్తవుడు ఇహలోక చింత చేయవలదు ... ... 3— 4
క్రైస్తవుడు మొదట దేవుని రాజ్యము వెతుకవలయును ... 5— 6
క్రైస్తవుడు పేరుకు క్రైస్తవుడై యుండతగదు ... ... 7—11
క్రైస్తవుడు ఇతరుల తప్పులు మన్నించవలయును ... ... 12—15
క్రైస్తవుడు తన తప్పులు ఇతరులపై మోపవలదు ... ... 16—17
క్రైస్తవుడు చేయవలసిన పోరాటము ... ... 18—21
క్రైస్తవుడు దేనికిని భయపడవలదు ... ... ... 22—27
క్రైస్తవుడు ధరింపగల భూషణములు ... ... 28—29
క్రైస్తవుడు కోరిన వంతు ... ... ... 30—31
క్రైస్తవుడు మానావమానములయెడల సమదృష్టి కలిగి యుండవలయును ... ... ... ... 32—34
క్రైస్తవుడు ప్రార్థన చేయవలసిన విధము ... ... 35—40
క్రైస్తవుడు ఆత్మానుభవమును పరులకు చూపనేరడు ... 41—44
క్రైస్తవుడు తన తప్పు ఒప్పుకొనవలయును ... ... 45—46
క్రైస్తవుడు దుర్జనస్సాక్షిని అణచు విధము ... ... 47—50
క్రైస్తవుడు మనశ్శాంతి పొందు విధము ... ... 51—53
క్రైస్తవుడు శోధనవలన పొందు మేలు ... ... 54—56
క్రైస్తవుడు లేమి గలిగినను వెలితి పడడు ... ... 57—61
క్రైస్తవుడు పొందు దైవోపకారములను నరుడు అడ్డగించలేడు ... ... ... ... ... 62—63

పద్యముల సంఖ్య

క్రైస్తవుడు పొందు సుఖదుఃఖాదులు దేవుని అధీనములు ... 64—6

క్రైస్తవుడు మనుష్యులను నమ్ముకొనుట తగదు ... ... 68—6

క్రైస్తవుడు ఓర్వలేని తనముతో పోరాడవలయును ... 70—7

క్రైస్తవుడు తనవలె పొరుగువాని ప్రేమింపవలయును ... 72—7

క్రైస్తవుడు సద్గుణములనే సౌఖ్యసంపదలుగా నెంచవలయును ... 77—79

క్రైస్తవుడు ఎట్టి యాపత్సమయములోను స్థిరముగా నుండవల యును ... ... ... ... 80—83

క్రైస్తవుడు తన దుష్టస్వభావమను శత్రువును గెలువవలయును 84—87

క్రైస్తవుడు దురహంకార చిత్తునికి దూరముగా నుండవలయును 88—91

క్రైస్తవుడు దేవుని కృపా ప్రేమలు నిత్యము గలిగియుండును 92—96

క్రైస్తవుడు దేవుని వాగ్దత్తములను సదా ప్రేమించవలయును ... 97—99

క్రైస్తవుడు దైవ వాగ్దత్తములు సిద్ధించువరకు ఓపిక గలిగి యుండవలయును ... ... ... 100—104

క్రైస్తవుడు ఇష్టసిద్ధికొరకు శ్రమపొందిన భక్తులవలె నడువవలయును 105—106

క్రైస్తవుడు మత్సరగుణమునకు స్థలమియ్యవలదు ... ... 107

క్రైస్తవుడు తన్నుతాను తగ్గించుకొనవలయును ... ... 108—109

క్రైస్తవుడు దురాశలు విడువవలయును ... ... 110

క్రైస్తవుడు మోక్షాశయను ముఖ్యావసరమైన కోరిక గలిగి యుండవలయును ... ... ... 111—114

క్రైస్తవుడు ఆత్మ జన్మము పొందవలయును ... ... 115—118

అంత్య స్తుతులు

# క్రైస్తవ నీతి ప్రకాశము

## ప ద్య కా వ్య ము

1. క॥ శ్రీ నిత్యుడు సత్యుడు మరి
యానందనుడపరిమిత దయాశాంతగుణాం
భోనిధి మద్గురు రాయం
డౌ నజరేయుడగు యేసు నాత్మందలతుఁన్.

### తాత్పర్యము

సంపదచే నిత్యముండువాడును, సత్యవంతుడును, సంతోషభరితుడును, (లేక మరియా కుమారుఁడును) మితిలేని దయా శాంతగుణములకు సముద్రము వంటివాడునగు, నా గురుశ్రేష్టుడగు నజరేయుడైన యేసును, నా యాత్మయందు తలంచుచున్నాను.

2. ఆ॥ తండ్రి తనయు డాత్మత్రైకుడై విలసిల్లు
దొడ్డ దేవుడాద్యుడ వ్యయుండు
విశ్వవిభుడు నిఖిల వేద్యుండు నా తండ్రి
యనుదినంబు నన్ను మనుచుగాత.

### తాత్పర్యము

తండ్రి, కుమారుడు, పరిశుద్ధాత్మ, యను ముగ్గురు, ఒక్కడై ప్రకాశించు గొప్ప దేవుడును, మొదటివాడును, నాశములేనివాడును, లోకమునకు అధి కారియును, సమస్తమును నెరిగినవాడును, నా తండ్రియగు దేవుడు నన్ను ప్రతి దినమును సంరక్షించుగాక.

3. క॥ పరమాత్మ భావ తత్త్వము
లెరిగింపను హృదయ శుద్ధి నెరిగింపను సు
స్థిరతర శాంతి నొసంగను
పరిశుద్ధాత్మను నుతించి ప్రార్థన జేతున్.

తాత్పర్యము

దేవుని స్వభావముయొక్క నిజ సంగతిని తెలుపుటకును, మనోశుద్ధిని తెలుపుటకును, మిక్కిలి స్థిరమైన శాంతగుణము నిచ్చుటకును, పరిశుద్ధాత్మను స్తుతించి ప్రార్థన చేసెదను.

4. వ॥ అని ప్రియదేవతా ప్రార్థనంబు చేసి తత్కరుణా సహా
యంబున నా యొనరింపంబూనిన క్రైస్తవ నీతి ప్రకాశం
బను గ్రంథంబునందు ప్రారంభం బెట్లనిన.

తాత్పర్యము

ఇవ్విధమున ప్రేమగల దేవుని ప్రార్థన చేసి, ఆ దేవుని కరుణసహాయము వలన నేను రచియింప బూనిన క్రైస్తవ నీతి ప్రకాశంబను గ్రంథముయొక్క ప్రారంభము ఏలాగనిన.

5. సీ॥ యేసునాయక యని యేసుక్రీస్తు ప్రభో
యను రెండు శతకంబు లొనర మొదట
రచియింపబడె వెంకటరత్నం సుచరిత్ర
ప్రకరణత్రయముగా రచితమయ్యె
తదనంతరమున నిస్తారరత్నాకరం బను
గ్రంథ మొకటి సేయంగ బడియె
తరువాత పంచచామరపన్నములు వెంక
పంచరత్నములల్ల బడియె నెలమి

తే॥గీ॥ వెనుకముందట పెక్కు కీర్తనలు పత్రి
కలును రచియింపబడి క్రీస్తుకరుణచేత
కడను క్రైస్తవ నీతి ప్రకాశమనెడు
నీ చరిత్రంబు రచియింప నిష్టమయ్యె.

6. వ॥ మరియును.

తాత్పర్యము

గ్రంథకర్త తాను రచించిన వాటిలో కొన్నిటి పేరులు వివరించుచున్నాడు. యేసునాయక శతకము యేసుక్రీస్తు ప్రభువు శతకమను రెండు శతకములు మొదట రచియింపబడెను. తరువాత రక్షణ చరిత్ర మూడు ప్రకరణములుగా రచియింపబడెను. అటుతరువాత నిస్తార రత్నాకరమను గ్రంథము వ్రాయబడెను. తరువాత పంచచామర పన్నములు పంచరత్నములు గావింపబడెను. మరియును ముందు వెనుకను అనేక కీర్తనలు పత్రికలు రచియింపబడెను. చివరకు క్రీస్తు కృపచేత నీతి ప్రకాశమను ఈ గ్రంథము రచియించుటకు ఇష్టమయ్యెను. మరియును.

7. మ॥ ఇలలో క్రైస్తవు లెట్టివారు →
నడువళ్లే రీతిగానుండు వా
రలకే సౌఖ్యము లబ్బు క్రీస్తు మత
సారం బెట్టిదంచున్ జనుల్
పలుమారాడుట నా చెవుల్విని యి
దత్ప్రత్యుత్తరంబుల్ మనో
జ్వలమైనట్లుగ నీ చరిత్ర నిడి
చెప్పం బూనితిన్ వేడుకన్.

8. వ॥ అదియునుం గాక మరియును.

తాత్పర్యము

క్రైస్తవులనగా ఏలాటివారు? వారి నడతలు ఎవ్విధంబులు? వారికి ఏలాటి సుఖము దొరుకును? క్రీస్తుయొక్క మతసారం బెట్టిది? అని, బహు జనులు

ప్రశ్నలడుగుట వినబడెను గనుక వాటికి ప్రత్యుత్తరములు ఈ గ్రంథములో నిమిడించి చెప్పుచున్నాడను; మరియును.

9. చ॥ అనుభవ వేద్యమైన హృదయ భ్ర →
మరంబులచేత క్రీస్తు యే
సుని చరణారవిందములు చుట్టి
తదీయ మకరంద మాధుకీ
ఘన రస మాని యాని సుఖ
కౌశల గానమెనర్చు క్రైస్తవుల్
మనములలోన సంతసిల్ల
మత్కవితార్థ మెరుంగ జేసెదన్.

10. వ॥ ఎట్లనిన.

## తాత్పర్యము

క్రీస్తు పాదపద్మములను చుట్టుకొని యందున్న మధురమైన మకరంద రసమును తమ హృదయములనే తుమ్మెదల వల్లను, పానించి, ధ్యానించి, అనుభవ సుఖము పొందిన క్రైస్తవులు సంతోషించునట్లు నా కవిత్వమును తెలియజేయుదును. ఏలాగనిన:

11. క॥ అనుభవ సుఖ హృదయుని గుణ
మనుభవు లెరుగుదురు గాని యన్యులెరుగ రె
ట్లన తరణి కిరణ సౌఖ్యము
వనజవనము గాక కుముదవనమే మెరుగున్?

## తాత్పర్యము

సూర్యకిరణముల సుగుణము పద్మములే ఎరుగును గాని, కలువలు ఎరుగవు గదా; ఆలాగుననే భక్తునియొక్క మనోసుఖము అనుభవశాలురైన భక్తులకే తెలుసును గాని, ఇతరులకు తెలియనేరదు.

12. మ॥ కవితా సార మెరుంగ గోరి సుజనుల్
కారుణ్య చిత్తంబుతో
సువిశేషోక్తుల తప్పు పట్టరవి
యే చొప్పున్న మన్నింతు ర
త్యవివేకుల్మదిలోన గర్వమిడి
భావార్థంబులం జూడకన్
ఇవి తప్పుల్ అవి తప్పులందురనినన్
హీనత్వముం గల్గునే.

## తాత్పర్యము

కవిత్వములోని సారాంశమును తెలియగోరు సజ్జనులు సువిశేష వాక్యార్థములయందు కవన దోషములుండినను తప్పులు పట్టక వారు దయతో మన్నించుదురు.

అయితే గర్వముచేత నిండిన మనసుగల అవివేకులు భావార్థములు చూడక ఇవి తప్పులు అవి తప్పులు అని అనినను హీనత్వము కలుగవా? కలుగనేరదు.

13. ఆ॥ ఫల రసా స్వాదనము చేయ దలచువాడు
అల రసాలద్రుమపు వంకరరయ బోడు
సారభావార్థ మెద చూడగోరువాడు
పద్యగద్యాదులెడ తప్పు పట్టబోడు.

## తాత్పర్యము

ఫలరసము యొక్క తీపిని అనుభవింపగోరువాడు, మామిడి చెట్టు యొక్క వంకరలు వెతుకడుగదా; అలాగననే, తాత్పర్యసారము గ్రహింపగోరువాడు, పద్యగద్యాదులయందున్న కవిత్వదోషములు పట్టడు.

14. క॥ తనువు వెలికెంత శుద్ధత
గనుపరచిన లోనిమనసు కావలయును దే
వునికెపుడు కావ్యమెట్లుం
డిన భావము జూచు తండ్రి నిను మన్నించున్.

15. క॥ కావున నా మనసా నీ
భావంబెరిగెడి మహా కృపానిధియగు నీ
దేవునిపై భర మిడి ధై
ర్యావాప్తి జేయబూనునది సేయ మొగిన్.

## ఈ రెండు పద్యముల తాత్పర్యము

వెలపటి శరీరము ఎంత శుద్ధిగా కనపరచినను లోపలి మనస్సేగదా దేవునికి కావలెను; ఆలాగున నే; కవిత్వము ఏలాగున్నను దాని భావము చూచు నీ తండ్రియగు దేవుడు నిన్ను క్షమించును.

కావున నా మనసా నీ భావము తెలిసి కరుణాసంపూర్ణుడగు దేవుని మీద నీ భారము ఉంచి ధైర్యముపొంది యేది చేయుటకు పూనుకొంటివో అది క్రమముగా చేయుము.

16. క॥ అని యిష్ట దేవతా ప్రా
ర్థనమును సద్భక్త హృదయ ప్రమదంబును స
జ్జనకవి మాన్యతయును మ
న్మనసాంతర ధైర్య వర్ధనంబును వరుసన్.

17. వ॥ కావించుకొని యిప్పుడు నా యొనరింపబూనిన యీ గ్రంథంబునందు సర్వలోక ప్రశస్తంబైన క్రీస్తుమార్గంబునం బ్రవర్తింప గోరు క్రైస్తవునకు తెలుపంబడు విశేష ధర్మాచరణంబు లిట్టివని వివరించెద.

## తాత్పర్యము

ఈలాగు క్రమముగా ఇష్టదేవునిగూర్చి ప్రార్థించి, సద్భక్తుల హృదయములకు సంతోషమును కలుగజేసి, సత్కవులకు మర్యాదనొనర్చి, మనసుకు ధైర్యమును తెచ్చుకొని, నేను రచియించు ఈ గ్రంథమునందు, భూలోకమంతటను శ్రేష్ఠంబైన క్రీస్తుమార్గమందు, నడువగోరు క్రైస్తవునకు తెలియజేయగల ముఖ్యమైన సుప్రవర్తనలు ఇట్టివియని వివరించెదను.

1. క॥ ఎటుదిరిగిన నేమియు లే
దటునిటు పరుగిడుట వట్టి యడియాస సుమీ
కటకట క్రైస్తవుడా వే
సట పడక పరేశు వాక్య సరణిం జనుమీ.

తాత్పర్యము

ఏ తట్టుకు తిరిగినను ఏ ప్రయోజనములేదు. అటు ఇటు పరుగులెత్తుట వట్టి కోరికెలు సుమీ; గనుక క్రైస్తవుడా, నీవు విసుకక దేవునివాక్యమను మార్గములో వెళ్లుము.

2. తే॥ స్థిరముగలవానికెందు సిద్ధించు మేలు
త్వరపడినవాని కధిక చింతలు లభించు
చెడు మదిని దాని కోర్కెబోవిడువ రాదు
తెలిసి వర్తింప వలయుక్రీస్తీయు డెపుడు.

తాత్పర్యము

నిలకడగలవానికి మేలు ఎచ్చోటను సిద్ధించును; త్వరపడువానికి ఎక్కువ చింతలు కలుగును; మనసు చెడ్డది గనుక దాని ఇష్టము చొప్పున పోనియ్యకూడదు. క్రైస్తవుడు వీటిని తెలిసికొని ప్రవర్తించవలెను.

3. శా॥ ఆకాశంబున బారు పక్షికిని
దీనత్వంబుతో నేలపై
బ్రాకే చీమకు తిండి నిచ్చి దయతో
పాలించు వాడెవ్వడో
నీకాతండె భుజింప నిచ్చి మనుపన్
నిష్ణాతవై యుండగా
నేకాంతంబగు చింత క్రైస్తవుడ
నీకేలా మదిన్ బొందగన్.

తాత్పర్యము

ఆకాశమందెగురు పక్షికిని, నేలనుఁబ్రాకు చీమకును, ఆహారమునిచ్చి పాలించు ఆయనే నిన్ను పోషించుటకు నిపుణుడైయుండగా, క్రైస్తవుడా, మనసులో నీకు రహస్యమైన చింత యేల?

4. ఆ॥ చిన్న పెద్దగ నేర్పాటుచేసి యవయ
వంబులన్నియు గూర్చి కాయంబు పుట్ట
జేయు నేర్పరి నిన్ను పోషింపలేడె
యెట్లు జీవింతు నను చింత యేల నీకు.

తాత్పర్యము

తలనుంచి పాదముల పర్యంతము చిన్నవి పెద్దవిగానుండు అవయవము లన్ని చక్కఁగా కూర్చి, ఈ శరీరమును రూపింప నేర్పుగల ఆయన నిన్ను పోషించలేడా? కావున నేనెట్లు జీవించుదునని నీవేల చింతించెదవు?

5. క॥ మొదటను దేవుని రాజ్యము
సదమలమగు దైవనీతి సచ్చాంత మతిన్
వెదకుము పిదప శరీరపు
బ్రదుకంతయు నీకు నియ్యబడు క్రైస్తవుడా.

తాత్పర్యము

క్రైస్తవుడా నీవు దేవుని రాజ్యమును ఆయన నీతిని మొదట వెదుకుము, తరువాత నీ శరీర జీవనమంతయు నీకు ఇయ్యబడును.

6. ఉ॥ దేవుని తట్టు నీ మనసు
ద్రిప్పుము నీ వొనరించు పాపముల్
ఏ విధమైనవో దలచి
యేడ్వుము నారకవహ్ని కేగు నీ

జీవము గాచి బ్రోవ తన
జీవ మొసంగిన యేసు పాద రా
జీవము లాత్మ నమ్మి
చిరజీవము గోరుము క్రైస్తవోత్తమా.

తాత్పర్యము

ఉత్తమ క్రైస్తవుడా, నీ మనసు దేవునితట్టు మళ్లించుము; నీవు చేసిన పాపములను తలంచి దుఃఖపడుము; నరకాగ్నికి పాలగు నీ ప్రాణమును రక్షించుటకై తన జీవము నిచ్చిన యేసుయొక్క పాదపద్మములు నీ యాత్మలో నమ్మి నిత్య జీవము కోరుము.

7. మ॥ కులదూరుండయి పెక్కువేలుపుల
మ్రొక్కుల్ రోసి చాలించి మో
హ లతా వేష్టితమైన మాతృపితృ
జాయా భ్రాతృ వర్గంబనే
ఫల వృక్షంబు బెగల్చి క్రైస్తవపు
నామం బూనగా నేమి ని
ర్మల భక్తి క్రియలందు శూన్యుడయినన్
బ్రాప్తించునే సౌఖ్యముల్.

తాత్పర్యము

కులము పోగొట్టుకొని చిల్లర వేల్పుల సేవ చాలించి, ప్రేమయను తీగెలతో చుట్టియున్న తలిదండ్రులు భార్య అన్నదమ్ములు అను ఫలవృక్షమును పెరికివేసి, క్రైస్తవ పేరుమాత్రము పెట్టుకొన్నంత మాత్రమున ఫలము ఏమున్నది? నిర్మల భక్తి క్రియలు లేనివానికి ఆత్మసుఖములు దొరుకునా?

8. తే॥ కులము పెద్దరికంబులు గూలనేల
ప్రియులు విందులు నిందలు పెట్టనేల
తరిమి లోకులు చీకాకు పరచనేల
సత్య మెదలేని పేరు క్రైస్తవుని కవని.

తాత్పర్యము

మనసులో సత్యములేని పేరుమాత్రము గల క్రైస్తవునకు కుల పెద్దరికము ఏల కూలిపోవలెను! స్నేహితులును బంధువులును ఏల అతని నిందించవలెను! లోకులు అల్లరిచేసి ఏల అతని తరమవలెను! (ఫలప్రాప్తి లేదు గదా).

9. క॥ దేవునికంటికి నీ స
ద్భావములో నున్న భక్తి బయలు పరుచు మ
ర్త్యావళికి జూపగోరెడు
పైవేషము గాదు భక్తి పథి క్రైస్తవుడా.

తాత్పర్యము

క్రైస్తవుడా నీ భావమందున్న సద్భక్తిని దేవుని దృష్టికి బయలుపరచుము; మనుష్యులకు చూపింపగోరు పై వేషము భక్తిమార్గము కాదు సుమీ.

10. సీ॥ మనసులోపలి దుఃఖ మణచు దేవుని వాక్య
మనుభవింపక భక్తు డనగ బడునె
తన మనోవాక్ప్రవర్తనలు శోధింప నే
రని వాడు క్రైస్తవుండనగ బడునె
అనుదిన ప్రార్థనాయత్తమౌ చిత్త సా
ధన లేక సద్భక్తు డనగ బడునె
బుద్ధి మార్పడి యాత్మ శుద్ధి గల్గుట యెరుం
గని వాడు క్రైస్తవుం డనగ బడునె,
తే॥గీ॥ పరమగురు భక్తుడగువాని సరణి తరణి
కిరణముల రీతి సంతోషకరము నగును
పేరు క్రైస్తవుడగు వాని దారి భూరి
ఘోర దుఃఖాంధకారంబు కొదువలేదు.

తాత్పర్యము

మనోదుఃఖము పోగొట్టి, ఓదార్పు నిచ్చు దేవుని వాక్యము ధ్యానించనివాడు, మనోవాక్క్రియలను పరీక్షింపనేరనివాడు, ప్రతిదినము ప్రార్థనవలన తన మనస్సును సాధకము చేసికొననివాడు, బుద్ధి మార్పడి ఆత్మశుద్ధి కలుగుట నెరుగనివాడు, ఇట్టి మనుష్యుడు భక్తుడనియు క్రైస్తవుడనియు ఎంచబడడు.

అయితే పరమ గురువగు క్రీస్తుయొక్క నిజభక్తుని మార్గము సూర్యకిరణములవలె సంతోషము నిచ్చును. పేరుక్రైస్తవుని మార్గమందు మిక్కిలి భయంకరమైన గాఢాంధకారమువంటి దుఃఖమునకు తక్కువలేదు.

11. క॥ ఖలగుణములు లోపల దా
గిలిమూతలనాడు వాటి గీటణచుము నీ
వెలపలి మాటలు తేటలు
ఫలమియ్యవు మనసు మారవలె క్రైస్తవుడా.

తాత్పర్యము

క్రైస్తవుడా నీలోపల దాగుడుమూతలాడుచునుండు దుర్గుణములను చంపుము. మనసు మారవలెను, లేనియెడల నీ నోటిమాటల సొగసువలన ఫలమేమియు లేదు సుమీ.

12. తే॥ ప్రియముగలచోట దోషంబు పెద్దదైన
కప్పివేతురు నెయ్యంబుగాని చోట
కొంచెమైనను మరి దాని కొండజేతు
రివి మనుష్యుల నైజంబులెరిగి విడుమి.

తాత్పర్యము

ప్రేమయున్నచోటను పెద్దదోషము కానవచ్చినను, దాని మూసివేయుదురు; అయితే ప్రియము లేనిచోటను చిన్నదోషము చూచినను, దాని కొండంతగా చేయుదురు. ఇవి మనుష్యుల స్వాభావిక గుణములని తెలిసి వీటిని విడిచిపెట్టుము.

13. తే॥ ఒకరి తప్పు లరయ నూహించుటలు మాని
తన మనంబు లోని తప్పులెరిగి
తన్నుబోలె నెనరు మన్నింపు లొరునందు
గాంచు నతడె మంచి క్రైస్తవుండు.

తాత్పర్యము

ఇతరుల తప్పులు వెతకక తన తప్పులను తెలిసికొనుచు, ఇతరులయెడల తనయందువలెనే ప్రేమయును మన్నింపును కలిగిన యతడే మంచి క్రైస్తవుడు.

14. చ॥ మనుజులు నీ సమానులు
సమాన యఘంబుల నిన్నుబోలె వ
ర్తనములు లేకయున్న పెర
తప్పులువారికి గల్గియుండు నీ
వొనరుచు పాపమెట్టిది
మహోన్నతుడైన పరేశునాజ్ఞ గై
కొనమి గదా త్వదాత్మ కతి
ఘోరవిచారము క్రైస్తవోత్తమా.

తాత్పర్యము

ఉత్తమ క్రైస్తవుడా, ఇతర మనుష్యులు నీవంటివారు. ఏలననగా నీవు చేయునవి వారు చేయకపోయినను, ఇతర దోషములు వారియందున్నవి. పాప మనగా నేమి? దేవుని ఆజ్ఞలను మీరుటయే పాపము. అదియే నీ యాత్మకు భయంకరమైన విచారము కలుగజేయునది.

15. ఆ॥ తప్పు నీయందు గలిగిన నొప్పుకొనను
వెనుకదీయక మనుజుల వేడియైన
కోపమునకాత్మ తాలిమి గొనుచు క్రీస్తు
ఘనము వెతుకుచు నుండుము క్రైస్తవుండా.

## తాత్పర్యము

క్రైస్తవుడా నీయందు తప్పులున్నయెడల వాటిని ఒప్పుకొనుటకు వెనుక తీయకుము. మనుష్యుల తీక్ష్ణమగు కోపమును సహించుచు ప్రభువైన యేసు క్రీస్తుయొక్క ఘనము వెతుకుము.

16. క॥ తన తప్పు లొకరిపై మో
పిన దీరునె మీద వచ్చు పెనుబాధలు వ
ద్దను ఫలములు దిని హవ యల
ఫణి నేర్పెనటంచు దెలుప బాసెనె దోసగుల్.

## తాత్పర్యము

తన తప్పులు ఒకరిమీద మోపినయెడల రాబోవు శిక్షలు తప్పునా! సర్పము నేర్పినందున ఫలములు తింటినని ఆది స్త్రీయైన హవ్వ చెప్పినను ఆపదలు దప్పించుకొనలేదు గదా.

17. సీ॥ అల పిశాచికి యెంతబలమున్న బలవంత
మున బట్టి యీడ్చి గొంపోవలేదు
తరమైన బలు మనోహరమైన యెరలు చూ
పునుగాని జగము లోపుగొనలేదు
పొగరుతో వగజూపి దిగులొనర్చునుగాని
కుస్వభావము గెల్చుకొనగలేదు
తుచ్ఛంబు మెచ్చు మాంసేచ్ఛలో మత్సరా
దులు నాత్మతో బోరనిలువలేవు,
తే॥గీ॥ ఆత్మరక్షార్థి ప్రభుకృపన్ అరులకెల్ల
వశముగాకుండ పోరాడవలయు గాని
నెపము గల్పించి యొకరిపై నేరముంచ
దగవు సరియౌనె క్రైస్తవోత్తముని కెపుడు.

## తాత్పర్యము

పిశాచికి ఎంత బలమున్నను, బలవంతముగా శోధనలోకి ఈడ్చుకొనిపోలేదుగదా.

లోకము పలువిధములగు చక్కని ఎరలుమాత్రము చూపించును గాని లోపరచుకొనజాలదుగదా.

దుస్స్వభావము గర్వముతో శృంగారచేష్టలను చూపించి తరువాత దుఃఖముతో దిగులు పుట్టించునుగాని గెలుచుకొనజాలదు గదా.

శరీరేచ్ఛలు అల్పభోగములయందు సంతోషించునుగాని ఆత్మతో యుద్ధము చేయనోపవుగదా.

కాబట్టి ఆత్మరక్షణ కోరువాడు ప్రభువుయొక్క కృపాసహాయములవలన శత్రువులకు లోబడకుండ పోరాడవలెనుగాని, తన నేరము ఒకరిపైని మోపను నెపము కల్పించుట ఉత్తముడైన క్రైస్తవునకు తగదు.

18. ఉ॥ ఐనను ఈ విరోధులు
మహారణ కర్కశు లిందులోన దు
ర్జ్ఞానసమందిరాంతర
నివాసి మహా బలశాలి పాప వి
ద్యానిధి దుస్స్వభావుడను
నాతనితో నెదిరించి బోర నె
వ్వారి తరంబు వాని ఖల
వర్తన మర్త్యుడెరుంగజాలునే.

## తాత్పర్యము

అయినను మిగుల క్రూరుడైన యీ శత్రువులలో నొకడు మహా బలవంతుడు. వాడు పాపవిద్యలకు నిధి. వాడు చెడ్డ హృదయమను ఇంటిలో నివసించుచుండును. వాని పేరు దుస్స్వభావుడు. వాని నెదిరించి పోరాడను ఎవరికిని వశముగాదు. వాని కపటమైన దుష్ప్రవర్తనలు నరుడు తెలుసుకొనలేడు.

19. సీ॥ పాము కోరలతోటి సాము సేయగవచ్చు
గాని దుర్జనుతో గదియరాదు
కడలి భంగముల పొంగడచవచ్చును గాని
దుస్స్వభావపు టుబ్బుత్రోయరాదు
పుడమిక్రింది పునాది నడపవచ్చును గాని
ఖల చిత్తమను వేరు గదపరాదు
పిడుగైన నోడిలోన బెట్టవచ్చును గాని
యుగ్రభావపు కాక కోర్వరాదు,

తే॥గీ॥ కటకటా యెన్నిమార్లు సత్క్రైస్తవుండు
వానితో పోరిపోరి తద్వశతనొంది
విన్నదనమున కన్నీరు విడిచివిడిచి
దైవకృప తట్టు కనిపెట్టు తాల్మితోడ.

## తాత్పర్యము

పాము కోరలతోనైనను సాము చేయవచ్చునుగాని చెడ్డమనసును తగలరాదు.

సముద్రతరంగముల పొంగునైనను అణచవచ్చునుగాని దుస్స్వభావము యొక్క అతిశయమును త్రోసివేయను సాధ్యముకాదు.

భూమిక్రింది పునాదినైనను వేరొకచోటికి జరపవచ్చునుగాని దుశ్చిత్తము యొక్క వేరును కదిలింప సాధ్యముకాదు.

పిడుగునుపట్టి ఒడిలోనైనను పెట్టవచ్చునుగాని ఉగ్రస్వభావముయొక్క వేడిమి సహింప సాధ్యముకాదు.

అయ్యో! మంచి క్రైస్తవుడు పలుమారు ఈ శత్రువులతో యుద్ధము చేసినను, వానికి లోబడి ఖిన్నుడై కన్నీరు విడుచును; మరియు వాని జయించుటకు తన చేతగాక దేవుని కృపాబలముకొరకు ఓర్పుతో కనిపెట్టును.

20. క॥ నిజమగు క్రైస్తవు డొక్కఁడె
వృజినాత్మం గవిసి మీద క్రిందం బడుచున్
విజయము గోరుచు బోరును
నిజరక్షకుడైన యేసుని సహాయమునన్.

తాత్పర్యము

నిజక్రైస్తవుడు ఒక్కఁడే ఆ పాపస్వభావముతో క్రిందమీదపడి పోరాడుచు, తన నిజరక్షకుడైన ప్రభు యేసుక్రీస్తుయొక్క సహాయముచేత విజయము కోరుచుండును.

21. క॥ ఈ యుద్ధము మది కనుభవ
మై యుండిన యోధవీరు డవునవును నిజం
బే యిది యని సాక్ష్యంబిడు
మాయా క్రైస్తవుల కిది యపరిచయము గదా.

తాత్పర్యము

ఈ యుద్ధముచేసి మనసునందు అనుభవశాలియగు యుద్ధవీరుడు మాత్రము అవును ఇది నిజమని సాక్ష్యమియ్యగలడు. అయితే మాయా క్రైస్తవులకు ఇట్టి, పోరాటము పరిచయము లేదుగదా.

22. గీ॥ ఏ నిమిత్తంబుచేనైన నెట్టులయిన
లోన పగగొనియైనను హాని దలచు
మానవుని చెవులకు మదిలోన క్రీస్తు
భక్తుడగువాడు ఎన్నడు భయపడండు.

తాత్పర్యము

మనసునందు పగబట్టి యేవిధముననైనను హానిచేయను ప్రయత్నపడు నరుని కార్యములకు క్రీస్తుభక్తుడు ఎన్నడును భయపడడు.

23. ఉ॥ మంటిని బుట్టి మన్నుకు సమంబగు
వస్తుచయంబు గూర్చి యం
దంటిన లుబ్ధమత్సర గుణా
న్వితుడై మరి యొక్క-వేళ నా
మంటిని లీనమౌ తృణము
వంటి నరుండటువంటి వాని నీ
కంటను భీతిగా గనకు
క్రైస్తవుడా మది మీదుకట్టుమీ.

తాత్పర్యము

నరుడు మంటిలోబుట్టి మన్నుకుబోలిన వస్తువులను సమకూర్చి వాటిని బట్టి పుట్టు లోభమత్సరాది గుణములుగలవాడై మరి కొంతకాలమునకు ఆ మంటిలోనే వాడు కలిసిపోవును గనుక, అట్టి గడ్డిపోచను బోలిన నరునకు క్రైస్తవుడా, నీవు భయపడకుము; నీ మనసు దేవునికి అర్పించుము.

24. ఆ॥ నేను నేనే యెహోవాను నిన్నునాద
రించు వాడను మృతిబొందు తృణము వంటి
మానవుని పుత్రునకు భయంపడగ నీవు
ఎవడవను నీ మహా వాక్యమెదను బెట్టు.

తాత్పర్యము

నేను నేనే యెహోవాను, నిన్ను ఆదరించువాడను, మరణము పొందు గడ్డివంటి మనుష్యపుత్రునికి భయపడుటకు నీవు ఎవడవు? అను ఈ మహా వాక్యమును క్రైస్తవుడా నీ మనస్సులో నుంచుకొనుము.

25. క॥ నీ తండ్రి సెలవు లేనిది
నీ తలవెంట్రుకొకటైన నేలంబడునే
భీతిం బొందకు దేనికి
రాతిరి పగ లతడు నిను మరడు క్రైస్తవుడా.

## తాత్పర్యము

క్రైస్తవుడా నీ తండ్రియైన దేవుని సెలవులేక నీ తలవెంట్రుకలలో ఒకటియైన నేల రాలదు. కాబట్టి నీవు దేనికిని భయపడకుము, రాత్రి అయినను పగలైనను నిన్ను ఆయన మరువడు.

26. క॥ నీ వారు నిన్ను దరమని
యీ వసుమతిలోని వార లేమననీ నీ
భావము క్రీస్తుని దయినను
ఏ వెతలకు భయము బొందవిల క్రైస్తవుడా.

## తాత్పర్యము

క్రైస్తవుడా నీ యింటివారు నిన్ను తరిమినను, లోకులు నిన్ను ఏమనినను, నీ హృదయములో క్రైస్తవుడవయియుంటే ఏలాటి ఆపదలకును నీవు భయపడవు సుమీ.

27. సీ॥ అపహాసకులు గూడి యాడిక ల్వాడ నీ
యాత్మ బోధానంద మణగి పోదు
నిందకుల్ గుమికూడి తొందరల్ పెట్ట నీ
మదిలోని నెమ్మి యెప్పటికి బోదు
తరిమి గద్దించు నిష్ఠుర చిత్తులుండ నీ
చిత్సుఖానుభవంబు చెదిరిపోదు
పడరాని పాట్లు పెట్టెడు వారలుండ నీ
పరమ భాగ్యాసక్తి తరిగిపోదు,
తే॥గీ॥ అతులితానంద మోక్ష రాజ్యాధికార
వైభవోన్నతుడగు యెహోవా కృపాను
భవము మది కబ్బినట్టి క్రైస్తవుని ప్రేమ
భక్తి వెడలింప నెవ్వారి వశముగాదు.

### తాత్పర్యము

అపహాసకులుకూడి దూషణ మాటలతో కూర్చిన పాటను నీ మీద పాడినను, తెలివిగల నీ ఆత్మయొక్క ఆనందము అణగిపోదు.

నిందకులు గుంపుకూడి తొందరలు కలుగజేసినను, నీ మనస్సునందుండు నెమ్మది యెప్పటికిని వదలిపోదు.

కఠినచిత్తులు కొందరు కూడి తరిమి గద్దించినను, నీ హృదయములోని అనుభవ సుఖము చెదరిపోదు.

పడరాని పాట్లను పెట్టువారు ఉన్నను, పరమభాగ్యమందుండు నీ ఆసక్తి తరిగిపోదు.

సాటిలేని మోక్షానందమను భాగ్యమునకు అధికారియు సర్వోన్నతుడును అగు యెహోవా దేవుని కృపను అనుభవించియున్న క్రైస్తవునియొక్క ప్రేమను భక్తిని తీసివేయ నెవరికిని శక్యముకాదు.

28. క॥ క్రీస్తుని వాగ్దత్తంబులు
నిస్తుల మాణిక్య ఖచిత నిర్మల స్వర్ణ
ప్రస్తుత సుభూషణములుగ
వాస్తవ క్రైస్తవుని కెపుడు వదలక యుండున్.

### తాత్పర్యము

నిజక్రైస్తవునకు ప్రభువుయొక్క వాగ్దత్తములు వెలలేని మాణిక్యముల చేత చెక్కిన నిర్మలమైన బంగారు భూషణములవలె వదలక యుండును.

29. సీ॥ అవమానములు భవ్యమగు మంచి బహుమతుల్
దూషణంబులు మణీ భూషణములు
అపహాసములు చంద్రహారముల్ మరి క్రూర
దృష్టిపాతములు ముత్తియపు సరులు
నిందాకటూక్తు లింపొందు చందన సుగం
ధామోద లిప్తశ్రేష్ఠాంబరములు
తాడనంబులు మూర్ధ్నతైలాభిషేకముల్
గద్దింపు లబ్జరాగముల గనులు,

తే॥గీ॥ చిత్త విశ్రాంతి గల క్రైస్తవోత్తమునకు
ధరను జెందు విపత్పరంపరలు ఇంపు
సొంపుగల సంపదల భంగి జూడ నొప్పు
యేసువాక్యార్థ మెదలోన నిముడు వలన.

తాత్పర్యము

మంచి క్రైస్తవునకు అవమానములే బహుమానములు, దూషణములే రత్న భూషణములు, వెక్కిరింపులే చంద్రహారములు, దయలేని చూపులే ముత్యాల పేరులు, నిందలే సుగంధపు పూతలు, మనస్సు నొప్పించు మాటలే శ్రేష్ఠవస్త్రములు, దెబ్బలే అభిషేకతైలము, గద్దింపులే కెంపుల గనులు; ఉత్తమ క్రైస్తవుడు తన ప్రభువుయొక్క ఉపదేశ వాక్యములను తన మనస్సున ఉంచుకొనును గనుక, లోకులవలన అతనికి సంభవించు ఆపదలను ఇంపు సొంపుగల సంపదల వలెను ఎంచును. ఇట్టివాని విశ్వాసము లోకమును జయించిన విజయము.

30. ఉ॥ లోకపు మెప్పుకో నరుల
లో బహుమానము బొందనో గుణ
ప్రాకట కీర్తికో ఘనుల
ప్రాపక మబ్బనో పెక్కురూకలున్
కోకలు గూర్చనో యెవరి
కోసము క్రైస్తవుడైతి వీవు హృ
ద్వ్యాకుల మేల నీకు నప
వర్గము గోరిన వంతు గాదకో.

తాత్పర్యము

లోకము మెచ్చునా, లేక జనులలో ఘనము పొందనా, లేక నీ గుణ కీర్తులు ప్రకాశించనా, లేక గొప్పవారి ప్రాపకము కోసమా, లేక చాల రూకలును కోకలును కూడబెట్టనా, లేక ఎవరికొరకు నీవు క్రైస్తవుడవైతివి? నీవు కోరినది మోక్షమేగదా. అలాగైతే నీకు మనోవ్యాకులమేల!

31. తే॥ మొదట త్రోవ నడుగు మోపకున్నప్పుడే
యెరిగి శ్రమల భాగ మెత్తుకొంటి
విపుడు కొంతదూర మేతెంచి మది చింత
కలుగుటేల నీకు క్రైస్తవుండా.

తాత్పర్యము

ప్రభువుమార్గములో నీవు మొదటి అడుగుపెట్టక మునుపే, అది శ్రమల మార్గమని నీకు తెలిసి ఆ శ్రమల కొప్పుకొంటివి. ఇప్పుడు కొంతదూరము వచ్చి, క్రైస్తవుడా నీవేల చింతించెదవు?

32. చ॥ హితవుగ గాంతు రొక్కతరి
హీనత జూతురు నొక్కవేళ ను
న్నతమున నుంతు రొక్కొక
దినంబున వేరొకకాలమందు పా
దతలము క్రింద వేతురు
విధావిధ కృత్యములెల్ల గల్గు నీ
బ్రతికిన యన్నినాళ్లు క్షితి
పై నిజక్రైస్తవుడా సహింపుమీ.

తాత్పర్యము

ఈ లోకపువారు నిన్ను ఒకప్పుడు మంచివానిగాను మరియొకప్పుడు నీచునిగాను చూచెదరు. ఒకప్పుడు ఉన్నతస్థానమందును మరియొకప్పుడు పాదములక్రిందను నిన్ను ఉంచెదరు. నిజక్రైస్తవుడా నీవు భూమిమీద ఉన్నంతకాలము నీకు నానావిధములగు మేలుకీడులు గలుగును, వాటిని ఓర్పుతో సహించుము.

33. క॥ హద్దెరుగరాని ముద్దున
పెద్దరికము బొందు నాడు భీషణయుతమౌ
గద్దింపులు గల నాడును
ఒద్దికతో బుద్ధి నిలుపు మొగిక్రైస్తవుడా.

తే॥గీ॥ వెనుకముందట పెక్కు కీర్తనలు పత్రి
కలును రచియింపబడి క్రీస్తుకరుణచేత
కడను క్రైస్తవ నీతి ప్రకాశమనెడు
నీ చరిత్రంబు రచియింప నిష్టమయ్యె.

6. వ॥ మరియును.

## తాత్పర్యము

గ్రంథకర్త తాను రచించిన వాటిలో కొన్నిటి పేరులు వివరించు చున్నాడు. యేసునాయక శతకము యేసుక్రీస్తు ప్రభువు శతకమను రెండు శతకములు మొదట రచియింపబడెను. తరువాత రక్షణ చరిత్ర మూడు ప్రకరణములుగా రచియింపబడెను. అటుతరువాత నిస్తార రత్నాకరమను గ్రంథము వ్రాయబడెను. తరువాత పంచచామర పన్నములు పంచరత్నములు గావింపబడెను. మరియును ముందు వెనుకను అనేక కీర్తనలు పత్రికలు రచియింపబడెను. చివరకు క్రీస్తు కృపచేత నీతి ప్రకాశమను ఈ గ్రంథము రచియించుటకు ఇష్టమయ్యెను. మరియును.

7. మ॥ ఇలలో క్రైస్తవు లెట్టివారు →
నడువళ్ళే రీతిగానుండు వా
రలకే సౌఖ్యము లబ్బు క్రీస్తు మత
సారం బెట్టిదంచున్ జనుల్
పలుమారాడుట నా చెవుల్వినిమె
దత్ప్రత్యుత్తరంబుల్ మనో
జ్వాలమైనట్లుగ నీ చరిత్ర నిడి
చెప్పం బూనితిన్ వేడుకన్.

8. వ॥ అదియునుం గాక మరియును.

## తాత్పర్యము

క్రైస్తవులనగా ఏలాటివారు? వారి నడతలు ఎవ్విధంబులు? వారికి ఏలాటి సుఖము దొరుకును? క్రీస్తుయొక్క మతసారం బెట్టిది? అని, బహు జనులు

ప్రశ్నలనుగూట వినబడెను గనుక వాటికి ప్రత్యుత్తరములు ఈ గ్రంథములో నిమిడించి చెప్పుచున్నాడను; మరియును.

9. చ॥ అనుభవ వేద్యమైన హృదయ భ్ర →
మరంబులచేత క్రీస్తు యే
సుని చరణారవిందములు చుట్టి
తదీయ మకరంద మాధుకీ
ఘన రస మాని యాని సుఖ
కౌశల గానమెనర్చు క్రైస్తవుల్
మనములలోన సంతసిల్ల
మత్కవితార్థ మెరుంగ జేసెదన్.

10. వ॥ ఎట్లనిన.

## తాత్పర్యము

క్రీస్తు పాదపద్మములను చుట్టుకొని యందున్న మధురమైన మకరంద రసమును తమ హృదయములనే తుమ్మెదల వల్లను, పానించి, ధ్యానించి, అనుభవ సుఖము పొందిన క్రైస్తవులు సంతోషించునట్లు నా కవిత్వమును తెలియజేయుదును. ఏలాగనిన:

11. క॥ అనుభవ సుఖ హృదయుని గుణ
మనుభవు లెరుగుదురు గాని యన్యులెరుగ రె
ట్లన తరణి కిరణ సౌఖ్యము
వనజవనము గాక కుముదవనమే మెరుగున్?

## తాత్పర్యము

సూర్య కిరణముల సుగుణము పద్మములే ఎరుగును గాని, కలువలు ఎరుగవు గదా; ఆలాగుననే భక్తునియొక్క మనోసుఖము అనుభవశాలురైన భక్తులకే తెలుసును గాని, ఇతరులకు తెలియనేరదు.

12. మ॥ కవితా సార మెఱుంగ గోరి సుజనుల్
కారుణ్య చిత్తంబుతో
సువిశేషోక్తుల తప్పు పట్ట రవి
యే చొప్పున్న మన్నింతు ర
త్యవివేకుల్మదిలోన గర్వమిడి
భావార్థంబులం జూడకన్
ఇవి తప్పుల్ అవి త్ప్వలందురనినన్
హీనత్వముం గల్గునే.

## తాత్పర్యము

కవిత్వములోని సారాంశమును తెలియగోరు సజ్జనులు సువిశేష వాక్యార్థములయందు కవన దోషములుండినను తప్పులు పట్టక వారు దయతో మన్నించుదురు.

అయితే గర్వముచేత నిండిన మనసుగల అవివేకులు భావార్థములు చూడక ఇవి తప్పులు అవి తప్పులు అని అనినను హీనత్వము కలుగనా? కలుగనేరదు.

13. ఆ॥ ఫల రసా స్వాదనము చేయ దలచువాడు
అల రసాలద్రుమపు వంకరరయ బోడు
సారభావార్థ మెద చూడగోరువాడు
పద్యగద్యాదులెడ తప్పు పట్టబోడు.

## తాత్పర్యము

ఫలరసము యొక్క తీపిని అనుభవింపగోరువాడు, మామిడి చెట్టు యొక్క వంకరలు వెతుకడుగదా; అలాగుననే, తాత్పర్యసారము గ్రహింపగోరువాడు, పద్యగద్యాదులయందున్న కవిత్వదోషములు పట్టడు.

14. క॥ తనువు వెలికెంత శుద్ధత
గనుపరచిన లోనిమనసు కావలయును దే
వునికెపుడు కావ్యమెట్లుం
డిన భావము జూచు తండ్రి నిను మన్నించున్.

15. క॥ కావున నా మనసా నీ
భావంబెరిగెడి మహా కృపానిధియగు నీ
దేవునిపై భర మిడి ధై
ర్యా వాప్తి జేయబూనునది సేయ మొగిన్.

### ఈ రెండు పద్యముల తాత్పర్యము

వెలపటి శరీరము ఎంత శుద్ధిగా కనపరచినను లోపలి మనస్సేగదా దేవునికి కావలెను; ఆలాగున నే; కవిత్వము ఏలాగున్నను దాని భావము చూచు నీ తండ్రియగు దేవుడు నిన్ను క్షమించును.

కావున నా మనసా నీ భావము తెలిసి కరుణాసంపూర్ణుడగు దేవుని మీద నీ భారము ఉంచి ధైర్యముపొంది యేది చేయుటకు పూనుకొంటివో అది క్రమముగా చేయుము.

16. క॥ అని యిష్ట దేవతా ప్రా
ర్థనమును సద్భక్త హృదయ ప్రమదంబును స
జ్జనకవి మాన్యతయును మ
న్మనసాంతర ధైర్య వర్ధనంబును వరుసన్.

17. వ॥ కావించుకొని యిప్పుడు నా యొనరింపబూనిన యీ
గ్రంథంబునందు సర్వలోక ప్రశస్తంబైన క్రీస్తుమార్గం
బునంబ్రవర్తింప గోరు క్రైస్తవునకు తెలుపంబడు విశేష
ధర్మాచరణంబు లిట్టివని వివరించెద.

## తాత్పర్యము

ఈలాగు క్రమముగా ఇష్టదేవునిగూర్చి ప్రార్థించి, సద్భక్తుల హృదయములకు సంతోషమును కలుగజేసి, సత్కవులకు మర్యాదనొనర్చి, మనసుకు ధైర్యమును తెచ్చుకొని, నేను రచియించు ఈ గ్రంథమునందు, భూలోకమంతటను శ్రేష్ఠంబైన క్రీస్తుమార్గమందు, నడువగోరు క్రైస్తవునకు తెలియజేయగల ముఖ్యమైన సుప్రవర్తనలు ఇట్టివియని వివరించెదను.

1. క॥ ఎటుదిరిగిన నేమియు లే
దటునిటు పరుగిడుట వట్టి యడియాస సుమీ
కటకట క్రైస్తవుడా వే
సట పడక పరేశు వాక్య సరణిం జనుమీ.

తాత్పర్యము

ఏ తట్టుకు తిరిగినను ఏ ప్రయోజనములేదు. అటు ఇటు పరుగులెత్తుట వట్టి కోరికెలు సుమీ; గనుక క్రైస్తవుడా, నీవు విసుకక దేవునివాక్యమను మార్గములో వెళ్లుము.

2. తే॥ స్థిరముగలవానికెందు సిద్ధించు మేలు
త్వరపడినవాని కధిక చింతలు లభించు
చెడు మదిని దాని కోర్కె-బోవిడువ రాదు
తెలిసి వర్తింప వలయుక్రీస్తీయు డెపుడు.

తాత్పర్యము

నిలకడగలవానికి మేలు ఎచ్చోటను సిద్ధించును; త్వరపడువానికి ఎక్కువ చింతలు కలుగును; మనసు చెడ్డది గనుక దాని ఇష్టము చొప్పున పోనియ్యకూడదు. క్రైస్తవుడు వీటిని తెలిసికొని ప్రవర్తించవలెను.

3. శా॥ ఆకాశంబున బారు పక్షికిని
దీనత్వంబుతో నేలపై
బ్రాకే చీమకు తిండి నిచ్చి దయతో
పాలించు వాడెవ్వడో
నీకా తిండె భుజింప నిచ్చి మనుపన్
నిష్ణాతుడై యుండగా
నేకాంతంబగు చింత క్రైస్తవుడ
నీకేలా మదిన్ బొందగన్.

తాత్పర్యము

ఆకాశమందెగురు పక్షికిని, నేలనుఁబ్రాఁగు చీమకును, ఆహారమునిచ్చి పాలించు ఆయనే నిన్ను పోషించుటకు నిపుణుడైయుండగా, క్రైస్తవుడా, మనసులో నీకు రహస్యమైన చింత యేల?

4. ఆ॥ చిన్న పెద్దగ నేర్పాటుచేసి యవయ
వంబులన్నియు గూర్చి కాయంబు పుట్ట
జేయు నేర్పరి నిన్ను పోషింపలేడె
యెట్లు జీవింతు నను చింత యేల నీకు.

తాత్పర్యము

తలనుంచి పాదముల పర్యంతము చిన్నవి పెద్దవిగానుండు అవయవము లన్ని చక్కగా కూర్చి, ఈ శరీరమును రూపింప నేర్పుగల ఆయన నిన్ను పోషించలేడా? కావున నేనెట్లు జీవించుదునని నీవేల చింతించెదవు?

5. క॥ మొదటను దేవుని రాజ్యము
సదమలమగు దైవనీతి సచ్చాంత మతిన్
వెదకుము పిదప శరీరపు
బ్రదుకంతయు నీకు నియ్యబడు క్రైస్తవుడా.

తాత్పర్యము

క్రైస్తవుడా నీవు దేవుని రాజ్యమును ఆయన నీతిని మొదట వెదుకుము, తరువాత నీ శరీర జీవనమంతయు నీకు ఇయ్యబడును.

6. ఉ॥ దేవుని తట్టు నీ మనసు
ద్రిప్పుము నీ వొనరించు పాపముల్
ఏ విధమైనవో దలచి
యేడ్వుము నారకవహ్ని కేగు నీ

జీవము గాచి బ్రోవ తన
జీవ మొసంగిన యేసు పాద రా
జీవము లాత్మ నమ్మి
చిరజీవము గోరుము క్రైస్తవోత్తమా.

తాత్పర్యము

ఉత్తమ క్రైస్తవుడా, నీ మనసు దేవునితట్టు మళ్లించుము; నీవు చేసిన పాపములను తలంచి దుఃఖపడుము; నరకాగ్నికి పాలగు నీ ప్రాణమును రక్షించుటకై తన జీవము నిచ్చిన యేసుయొక్క పాదపద్మములు నీ యాత్మలో నమ్మి నిత్య జీవము కోరుము.

7. మ॥ కులదూరుండయి పెక్కు వేలుపుల
మ్రొక్కుల్ రోసి చాలించి మో
హ లతా వేష్టితమైన మాతృపితృ
జాయా భ్రాతృ వర్గంబనే
ఫల వృక్షంబు బెగల్చి క్రైస్తవపు
నామం బూనగా నేమి ని
ర్మల భక్తి క్రియలందు శూన్యుడయినన్
బ్రాప్తించునే సౌఖ్యముల్.

తాత్పర్యము

కులము పోగొట్టుకొని చిల్లర వేల్పుల సేవ చాలించి, ప్రేమయను తీగెలతో చుట్టియున్న తలిదండ్రులు భార్య అన్నదమ్ములు అను ఫలవృక్షమును పెరికివేసి, క్రైస్తవ పేరుమాత్రము పెట్టుకొన్నంత మాత్రమున ఫలము ఏమున్నది! నిర్మల భక్తి క్రియలు లేనివానికి ఆత్మసుఖములు దొరుకునా?

8. తే॥ కులము పెద్దరికంబులు గూలనేల
ప్రియులు విందులు నిందలు పెట్టనేల
తరిమి లోకులు చీకాకు పరచనేల
సత్య మెదలేని పేరు క్రైస్తవుని కవని.

## తాత్పర్యము

మనసులో సత్యములేని పేరుమాత్రము గల క్రైస్తవునకు కుల పెద్దరికము ఏల కూలిపోవలెను! స్నేహితులును బంధువులును ఏల అతని నిందించవలెను! లోకులు అల్లరిచేసి ఏల అతని తరమవలెను! (ఫలప్రాప్తి లేదు గదా).

9. క॥ దేవునికంటికి నీ స
ద్భావముతో నున్న భక్తి బయలు పరుచు మ
ర్త్యావళికి జూపగోరెడు
పై వేషము గాదు భక్తి పథి క్రైస్తవుడా.

## తాత్పర్యము

క్రైస్తవుడా నీ భావమందున్న సద్భక్తిని దేవుని దృష్టికి బయలుపరచుము; మనుష్యులకు చూపింపగోరు పై వేషము భక్తిమార్గము కాదు సుమీ.

10. సీ॥ మనసులోపలి దుఃఖ మణచు దేవుని వాక్య
మనుభవింపక భక్తు డనగ బడునె
తన మనోవాక్ప్రవర్తనలు శోధింప నే
రని వాడు క్రైస్తవుండనగ బడునె
అనుదిన ప్రార్థనాయత్తమా చిత్త సా
ధన లేక సద్భక్తు డనగ బడునె
బుద్ధి మార్పడి యాత్మ శుద్ధి గల్గుట యెరుం
గని వాడు క్రైస్తవుం డనగ బడునె,
తే॥గీ॥ పరమగురు భక్తుడగువాని సరణి తరణి
కిరణముల రీతి సంతోషకరము నగును
పేరు క్రైస్తవుడగు వాని దారి భూరి
ఘోర దుఃఖాంధకారంబు కొదువలేదు.

## తాత్పర్యము

మనోదుఃఖము పోగొట్టి, ఓదార్పు నిచ్చు దేవుని వాక్యము ధ్యానించని వాడు, మనోవాక్క్రియలను పరీక్షింప నేరనివాడు, ప్రతిదినము ప్రార్థనవలన తన మనస్సును సాధకము చేసికొననివాడు, బుద్ధి మార్పుడి ఆత్మశుద్ధి కలుగుట నెరుగనివాడు, ఇట్టి మనుష్యుడు భక్తుడనియు క్రైస్తవుడనియు ఎంచబడడు.

అయితే పరమ గురువగు క్రీస్తుయొక్క నిజభక్తుని మార్గము సూర్యకిరణ ములవలె సంతోషము నిచ్చును. పేరుక్రైస్తవుని మార్గమందు మిక్కిలి భయంకరమైన గాఢాంధకారమువంటి దుఃఖమునకు తక్కువలేదు.

11\. క॥ ఖలగుణములు లోపల దా
గిలిమూతలనాడు వాటి గీటణచుము నీ
వెలపలి మాటలుతేటలు
ఫలమియ్యవు మనసు మారవలె క్రైస్తవుడా.

## తాత్పర్యము

క్రైస్తవుడా నీలోపల దాగుడుమూతలాడుచునుండు దుర్గుణములను చంపుము. మనసు మారవలెను, లేనియెడల నీ నోటిమాటల సొగసువలన ఫల మేమియు లేదు సుమీ.

12\. తే॥ ప్రియముగలచోట దోషంబు పెద్దదైన
కప్పివేతురు నెయ్యంబుగాని చోట
కొంచెమైనను మరి దాని కొండజేతు
రివి మనుష్యుల నైజంబులెరిగి విడుమి.

## తాత్పర్యము

ప్రేమయున్నచోటను పెద్దదోషము కానవచ్చినను, దాని మూసివేయు దురు; అయితే ప్రియము లేనిచోటను చిన్నదోషము చూచినను, దాని కొండంతగా చేయుదురు. ఇవి మనుష్యుల స్వాభావిక గుణములని తెలిసి వీటిని విడిచిపెట్టుము.

13. తే॥ ఒకరి తప్పు లరయ నూహించుటలు మాని
తన మనంబు లోని తప్పులెఱిగి
తన్నుఁబోలె నెనరు మన్నింపు లొరునందు
గాంచు నతడె మంచి క్రైస్తవుండు.

తాత్పర్యము

ఇతరుల తప్పులు వెతకక తన తప్పులను తెలిసికొనుచు, ఇతరులయెడల తనయందువలెనే ప్రేమయును మన్నింపును కలిగిన యతడే మంచి క్రైస్తవుడు.

14. చ॥ మనుజులు నీ సమానులు
సమాన యఘంబుల నిన్నుఁబోలె వ
ర్తనములు లేకయున్న పెర
తప్పులువారికి గల్గియుండు నీ
వొనరుచు పాపమెట్టిది
మహోన్నతుడైన పరేశునాజ్ఞ గై
కొనమి గదా త్వదాత్మ కతి
ఘోరవిచారము క్రైస్తవోత్తమా.

తాత్పర్యము

ఉత్తమ క్రైస్తవుడా, ఇతర మనుష్యులు నీవంటివారు. ఏలననగా నీవు చేయునవి వారు చేయకపోయినను, ఇతర దోషములు వారియందున్నవి. పాపమనగా నేమి? దేవుని ఆజ్ఞలను మీరుటయే పాపము. అదియే నీ యాత్మకు భయంకరమైన విచారము కలుగజేయునది.

15. ఆ॥ తప్పు నీయందు గలిగిన నొప్పుకొనను
వెనుకదీయక మనుజులవేడిమైన
కోపమునకాత్మ తాలిమి గొనుచు క్రీస్తు
ఘనము వెతుకుచు నుండుము క్రైస్తవుండా.

## తాత్పర్యము

క్రైస్తవుడా నీయందు తప్పులున్నయెడల వాటిని ఒప్పుకొనుటకు వెనుక తీయకుము. మనుష్యుల తీక్ష్ణమగు కోపమును సహించుచు ప్రభువైన యేసు క్రీస్తుయొక్క ఘనము వెతుకుము.

16. క॥ తన తప్పు లొకరిపై మో
పిన దీరునె మీద వచ్చు పెనుబాధలు వ
ద్దను ఫలములు దిని హవ యల
ఫణి నేర్పెనటంచు దెలుప బాసెనె దోసగుల్.

## తాత్పర్యము

తన తప్పులు ఒకరిమీద మోపినయెడల రాబోవు శిక్షలు తప్పునా! సర్పము నేర్పినందున ఫలములు తింటినని ఆది స్త్రీయైన హవ్వచెప్పినను ఆపదలు దప్పించుకొనలేదు గదా.

17. సీ॥ అల పిశాచికి యెంతబలమున్న బలవంత
ముననబట్టి యీడ్చి గొంపోవలేదు
తరమైన బలు మనోహరమైన యెరలు చూ
పునుగాని జగము లోపుగొనలేదు
పొగరుతో వగజూపి దిగులొనర్చునుగాని
కుస్వభావము గెల్చుకొనగలేదు
తుచ్ఛంబు మెచ్చు మాంసేచ్ఛలో మత్సరా
దులు నాత్మతో బోరనిలువలేవు,
తే॥గీ॥ ఆత్మరక్షార్థి ప్రభుకృపన్ అరులకెల్ల
వశముగాకుండ పోరాడవలయు గాని
నెపము గల్పించి యొకరిపై నేరముంచ
దగవు సరియౌనె క్రైస్తవోత్తముని కెపుడు.

## తాత్పర్యము

పిశాచికి ఎంత బలమున్నను, బలవంతముగా శోధనలోకి ఈడ్చుకొని పోలేదుగదా.

లోకము పలువిధములగు చక్కని ఎరలుమాత్రము చూపించును గాని లోపరచుకొనజాలదుగదా.

దుస్స్వభావము గర్వముతో శృంగారచేష్టలను చూపించి తరువాత దుఃఖముతో దిగులు పుట్టించునుగాని గెలుచుకొనజాలదు గదా.

శరీరేచ్ఛలు అల్పభోగములయందు సంతోషించునుగాని ఆత్మతో యుద్ధము చేయనోపవుగదా.

కాబట్టి ఆత్మరక్షణ కోరువాడు ప్రభువుయొక్క కృపాసహాయములవలన శత్రువులకు లోబడకుండ పోరాడవలెనుగాని, తన నేరము ఒకరిపైని మోపను నెపము కల్పించుట ఉత్తముడైన క్రైస్తవునకు తగదు.

18. ఉ॥ ఐనను ఈ విరోధులు
మహారణ కర్కశు లిందులోన దు
ర్మానసమందిరాంతర
నివాసి మహా బలశాలి పాప వి
ద్యానిధి దుస్స్వభావుడను
నాతనితో నెదిరించి బోర నె
వ్వారి తరంబు వాని ఖల
వర్తన మర్త్యుడెరుంగజాలునే.

## తాత్పర్యము

అయినను మిగుల క్రూరుడైన యీ శత్రువులలో నొకడు మహా బలవంతుడు. వాడు పాపవిద్యలకు నిధి. వాడు చెడ్డ హృదయమను ఇంటిలో నివసించుచుండును. వాని పేరు దుస్స్వభావుడు. వాని నెదిరించి పోరాడను ఎవరికిని వశముగాదు. వాని కపటమైన దుష్ప్రవర్తనలు నరుడు తెలుసుకొనలేడు.

19. సీ॥ పాము కోరలతోటి సాము సేయగవచ్చు
గాని దుర్జనుతో గదియరాదు
కడలి భంగముల పొంగడచవచ్చును గాని
దుస్స్వభావపు టుబ్బుత్రోయరాదు
పుడమిక్రింది పునాది నడపవచ్చును గాని
ఖల చిత్తమను వేరు గదపరాదు
పిడుగైన నొడిలోన బెట్టవచ్చును గాని
యుగ్రభావపు కాక కోర్వరాదు,

తే॥గీ॥ కటకటా యెన్నిమార్లు సత్క్రైస్తవుండు
వానితో పోరిపోరి తద్వశతనొంది
విన్నదనమున కన్నీరు విడిచివిడిచి
దైవకృప తట్టు కనిపెట్టు తాల్మితోడ.

## తాత్పర్యము

పాము కోరలతో నైనను సాము చేయవచ్చునుగాని చెడ్డమనసును తగలరాదు.

సముద్రతరంగముల పొంగునైనను అణచవచ్చునుగాని దుస్స్వభావము యొక్క అతిశయమును త్రోసివేయను సాధ్యముకాదు.

భూమిక్రింది పునాదినైనను వేరొక చోటికి జరపవచ్చునుగాని దుశ్చిత్తము యొక్క వేరును కదిలింప సాధ్యముకాదు.

పిడుగునుపట్టి ఒడిలోనైనను పెట్టవచ్చునుగాని ఉగ్రస్వభావముయొక్క వేడిమి సహింప సాధ్యముకాదు.

అయ్యో! మంచి క్రైస్తవుడు పలుమారు ఈ శత్రువులతో యుద్ధము చేసినను, వానికి లోబడి ఖిన్నుడై కన్నీరు విడుచును; మరియు వాని జయించుటకు తన చేతగాక దేవుని కృపాబలముకొరకు ఓర్పుతో కనిపెట్టును.

20. క॥ నిజమగు క్రైస్తవు డొక్కఁడె
వృజినాత్మం గవిసి మీఁద క్రిందం బడుచున్
విజయము గోరుచు బోరును
నిజరక్షకుడైన యేసుని సహాయమునన్.

తాత్పర్యము

నిజక్రైస్తవుడు ఒక్కఁడే ఆ పాపస్వభావముతో క్రిందమీదపడి పోరాడుచు, తన నిజరక్షకుడైన ప్రభు యేసుక్రీస్తుయొక్క సహాయముచేత విజయము కోరుచుండును.

21. క॥ ఈ యుద్ధము మది కనుభవ
మై యుండిన యోధవీరు డవునవును నిజం
బే యిది యని సాక్ష్యంబిడు
మాయా క్రైస్తవుల కిది యపరిచయము గదా.

తాత్పర్యము

ఈ యుద్ధముచేసి మనసునందు అనుభవశాలియగు యుద్ధవీరుడు మాత్రము అవును ఇది నిజమని సాక్ష్యమియ్యగలడు. అయితే మాయా క్రైస్తవులకు ఇట్టి పోరాటము పరిచయము లేదుగదా.

22. గీ॥ ఏ నిమిత్తంబుచేనైన నెట్టులయిన
లోన పగగొనియైనను హాని దలచు
మానవుని చెైవులకు మదిలోన క్రీస్తు
భక్తుడగువాడు ఎన్నడు భయపడండు.

తాత్పర్యము

మనసునందు పగబట్టి యేవిధముననైనను హానిచేయను ప్రయత్నపడు నరుని కార్యములకు క్రీస్తుభక్తుడు ఎన్నడును భయపడడు.

23. ఉ॥ మంటిని బుట్టి మన్నుకు సమంబగు
వస్తుచయంబు గూర్చి యం
దంటిన లుబ్ధమత్సర గుణా
న్వితుడై మరి యొక్క-వేళ నా
మంటిని లీనమౌ తృణము
వంటి నరుండటువంటి వాని నీ
కంటను భీతిగా గనకు
క్రైస్తవుడా మది మీఁదుకట్టుమీ.

తాత్పర్యము

నరుడు మంటిలోబుట్టి మన్నుకుబోలిన వస్తువులను సమకూర్చి వాటిని బట్టి పుట్టు లోభమత్సరాది గుణములుగలవాడై మరి కొంతకాలమునకు ఆ మంటిలోనే వాడు కలిసిపోవును గనుక, అట్టి గడ్డిపోచను బోలిన నరునకు క్రైస్తవుడా, నీవు భయపడకుము; నీ మనసు దేవునికి అర్పించుము.

24. ఆ॥ నేను నేనే యెహోవాను నిన్నునాద
రించు వాడను మృతిబొందు తృణము వంటి
మానవుని పుత్రునకు భయంపడగ నీవు
ఎవడవను నీ మహా వాక్యమెదను బెట్టు.

తాత్పర్యము

నేను నేనే యెహోవాను, నిన్ను ఆదరించువాడను, మరణము పొందు గడ్డివంటి మనుష్యపుత్రునికి భయపడుటకు నీవు ఎవడవు! అను ఈ మహా వాక్యమును క్రైస్తవుడా నీ మనస్సులో నుంచుకొనుము.

25. క॥ నీ తండ్రి సెలవు లేనిది
నీ తలవెంట్రుకొకటైన నేలంబడునే
భీతిం బొందకు దేనికి
రాతిరి పగ లతడు నిను మరడు క్రైస్తవుడా.

## తాత్పర్యము

క్రైస్తవుడా నీ తండ్రియైన దేవుని సెలవులేక నీ తలవెంట్రుకలలో ఒకటి యైన నేల రాలదు. కాబట్టి నీవు దేనికిని భయపడకుము, రాత్రి అయినను పగలైనను నిన్ను ఆయన మరువడు.

26. క॥ నీ వారు నిన్ను దరమని
యీ వసుమతిలోని వార లేమననీ నీ
భావము క్రీస్తుని దయినను
ఏ వెతలకు భయము బొందవిల క్రైస్తవుడా.

## తాత్పర్యము

క్రైస్తవుడా నీ యింటివారు నిన్ను తరిమినను, లోకులు నిన్ను ఏమనినను, నీ హృదయములో క్రైస్తవుడవయియుంటే ఏలాటి ఆపదలకును నీవు భయపడవు సుమీ.

27. సీ॥ అపహాసకులు గూడి యాడిక ల్చాడ నీ
యాత్మ బోధానంద మణగి పోదు
నిందకుల్ గుమికూడి తొందరల్ పెట్ట నీ
మదిలోని నెమ్మి యెప్పటికి బోదు
తరిమి గద్దించు నిష్ఠుర చిత్తులుండ నీ
చిత్సుఖానుభవంబు చెదిరిపోదు
పడరాని పాట్లు పెట్టెడు వారలుండ నీ
పరమ భాగ్యాసక్తి తరిగిపోదు,
తే॥గీ॥ అతులితానంద మోక్ష రాజ్యాధికార
వైభవోన్నతుడగు యెహెూవా కృపాను
భవము మది కబ్బినట్టి క్రైస్తవునిప్రేమ
భక్తి వెడలింప నెవ్వారి వశముగాదు.

తాత్పర్యము

అపహాసకులుకూడి దూషణ మాటలతో కూర్చిన పాటను నీ మీద పాడినను, తెలివిగల నీ ఆత్మయొక్క ఆనందము అణగిపోదు.

నిందకులు గుంపుకూడి తొందరలు కలుగజేసినను, నీ మనస్సునందుండు నెమ్మది యెప్పటికిని వదలిపోదు.

కఠినచిత్తులు కొందరు కూడి తరిమి గద్దించినను, నీ హృదయములోని అనుభవ సుఖము చెదరిపోదు.

పడరాని పాట్లను పెట్టువారు ఉన్నను, పరమభాగ్యమందుండు నీ ఆసక్తి తరిగిపోదు.

సాటిలేని మోక్షానందమను భాగ్యమునకు అధికారియు సర్వోన్నతుడును అగు యెహోవా దేవుని కృపను అనుభవించియున్న క్రైస్తవునియొక్క ప్రేమను భక్తిని తీసివేయ నెవరికిని శక్యముకాదు.

28. క॥ క్రీస్తుని వాగ్దత్తంబులు
నిస్తుల మాణిక్య ఖచిత నిర్మల స్వర్ణ
ప్రస్తుత సుభూషణములుగ
వాస్తవ క్రైస్తవుని కెపుడు వదలక యుండున్.

తాత్పర్యము

నిజక్రైస్తవునకు ప్రభువుయొక్క వాగ్దత్తములు వెలలేని మాణిక్యముల చేత చెక్కిన నిర్మలమైన బంగారు భూషణములవలె వదలక యుండును.

29. సీ॥ అవమానములు భవ్యమగు మంచి బహుమతుల్
దూషణంబులు మణీ భూషణములు
అపహాసములు చంద్రహారముల్ మరి క్రూర
దృష్టిపాతములు ముత్తియపు సరులు
నిందాకటూక్తు లింపొందు చందన సుగం
ధామోద లిప్త శ్రేష్ఠాంబరములు
తాడనంబులు మూర్ధ్న తైలాభిషేకముల్
గద్దింపు లబ్జరాగముల గనులు,

తే॥గీ॥ చిత్త విశ్రాంతి గల క్రైస్తవోత్తమునకు
ధరను జెందు విపత్పరంపరలు ఇంపు
సొంపుగల సంపదల భంగి జూడ నొప్పు
యేసువాక్యార్థ మెదలోన నిముడు వలన.

తాత్పర్యము

మంచి క్రైస్తవునకు అవమానములే బహుమానములు, దూషణములే రత్న భూషణములు, వెక్కిరింపులే చంద్రహారములు, దయలేని చూపులే ముత్యాల పేరులు, నిందలే సుగంధపు పూతలు, మనస్సు నొప్పించు మాటలే శ్రేష్ఠవస్త్రములు, దెబ్బలే అభిషేకతైలము, గద్దింపులే కెంపుల గనులు; ఉత్తమ క్రైస్తవుడు తన ప్రభువుయొక్క ఉపదేశ వాక్యములను తన మనస్సున ఉంచుకొనును గనుక, లోకులవలన అతనికి సంభవించు ఆపదలను ఇంపు సొంపుగల సంపదల వలెను ఎంచును. ఇట్టివాని విశ్వాసము లోకమును జయించిన విజయము.

30. ఉ॥ లోకపు మెప్పుకో నరుల
లో బహుమానము బొందనో గుణ
ప్రాకట కీర్తికో ఘనుల
ప్రాపక మబ్బనో పెక్కురూకలుఁ
గోకలు గూర్చనో యెవరి
కోసము క్రైస్తవుడైతి వీవు హృ
ద్వ్యాకుల మేల నీకు నప
వర్గము గోరిన వంతు గాదకో.

తాత్పర్యము

లోకము మెచ్చనా, లేక జనులలో ఘనము పొందనా, లేక నీ గుణ కీర్తులు ప్రకాశించనా, లేక గొప్పవారి ప్రాపకము కోసమా, లేక చాల రూకలును కోకలును కూడబెట్టనా, లేక ఎవరికొరకు నీవు క్రైస్తవుడవైతివి? నీవు కోరినది మోక్షమేగదా. ఆలాగైతే నీకు మనోవ్యాకులమేల?

31. తే॥ మొదట త్రోవ నడుగు మోపకున్నప్పుడే
యెరిగి శ్రమల భాగ మెత్తుకొంటి
విపుడు కొంతదూర మేతెంచి మది చింత
కలుగుటేల నీకు క్రైస్తవుండా.

తాత్పర్యము

ప్రభువుమార్గములో నీవు మొదటి అడుగుపెట్టక మునుపే, అది శ్రమల మార్గమని నీకు తెలిసి ఆ శ్రమల కొప్పుకొంటివి. ఇప్పుడు కొంతదూరము వచ్చి, క్రైస్తవుడా నీవేల చింతించెదవు?

32. చ॥ హితవుగ గాంతు రొక్కతరి
హీనత జూతురు నొక్కవేళ ను
న్నతమున నుంతు రొక్కొక
దినంబున వేరొకకాలమందు పా
దతలము క్రింద వేతురు
విధావిధ కృత్యములెల్ల గల్గు నీ
బ్రతికిన యన్నినాళ్లు క్షితి
పై నిజక్రైస్తవుడా సహింపుమీ.

తాత్పర్యము

ఈ లోకపువారు నిన్ను ఒకప్పుడు మంచివానిగాను మరియొకప్పుడు నీచునిగాను చూచెదరు. ఒకప్పుడు ఉన్నతస్థానమందును మరియొకప్పుడు పాదములక్రిందను నిన్ను ఉంచెదరు. నిజక్రైస్తవుడా నీవు భూమిమీద ఉన్నంతకాలము నీకు నానావిధములగు మేలుకీడులు గలుగును, వాటిని ఓర్పుతో సహించుము.

33. క॥ హద్దెరుగరాని ముద్దున
పెద్దరికము బొందు నాడు భీషణయుతమా
గద్దింపులు గల నాడును
ఒద్దికతో బుద్ధి నిలుపు మొగిక్రైస్తవుడా.

### తాత్పర్యము

హద్దులేని ప్రేమచేత గొప్పతనము కలుగునపుడును భయంకరమైన గద్దింపులు వచ్చునపుడును క్రైస్తవుడా, నీవు ఈ రెంటెని ఏకముగా నంగీకరించి నీ బుద్ధిని నిలుపుము.

34. క॥ దొంతరలై జనుదెంచెడు
సంతోష దినంబులందు శ్రమదివసములే
కాంతముగ జేరినప్పుడు
భ్రాంతి విడిచి సరిగ నిలువవలె క్రైస్తవుడా.

### తాత్పర్యము

దొంతులవలె వచ్చు సంతోష దినములయందును, ఒంటరిగా వచ్చు కష్ట దినములయందును, క్రైస్తవుడా నీవు భ్రాంతిచెందక సరిగా నుండవలెను సుమీ.

35. మ॥ శ్రమలన్నింటి జయింప నిష్ట ఫలముల్
సాధింప దైవోగ్ర శా
పము మాన్పింప పిశాచ బాణ పటల
ప్రాప్త జ్వరాంతర్య తా
పము ఖండింప మనో తమిస్రమణ
గింపన్ పెంపుతో క్రైస్తవో
త్తముడాత్మార్థము ప్రార్థనల్ సలుపు
మోదం బొప్పగా నిత్యమున్.

### తాత్పర్యము

శ్రమలను జయించుటకును, కోరిన ఫలములు పొందుటకును, దేవుని శాపము మాన్పించుటకును, పిశాచి బాణములవలన కలుగు సంతాపము ఖండించుటకును, మనసులోని చీకటి నశించుటకును, ఉత్తమ క్రైస్తవుడు నిత్యము ప్రార్థనలు చేయవలెను.

36. క॥ అనుదిన మేకాంత ప్రా
ర్థనలు గదా క్రైస్తవునకు తప్పని విధి; భ
క్తి నిరూఢమందు గలుగును
తన మానస చర్య తనకు దార్ఢ్యమగున్.

తాత్పర్యము

క్రైస్తవునకు దినదినమును రహస్యప్రార్థనలు తప్పని విధిగా నుండవలెను. అందువల్ల స్థిరమైన భక్తి సిద్ధించును; మరియు తన మనసుయొక్క స్థితి తనకు సాక్ష్యముగా నుండును.

37. ఉ॥ ప్రార్థన కాలమందు గురిపట్టి మనంబు
గుణం బణంచు మీ
వ్యర్థ తలంపులెన్నియొ రయంబున
మ్రోలికి దెచ్చిపెట్టి యి
ష్టార్థము లడ్డుసేయు విమలాత్మ
సహాయము లేక ప్రార్థనల్
సార్థకమౌనె యాత్మ కొక
సౌఖ్యము గల్గునె క్రైస్తవోత్తమా.

తాత్పర్యము

ఉత్తమ క్రైస్తవుడా, ప్రార్థన సమయమందు నీ మనసుమీద గురియుంచి దానిని చలింపనీయకుము. ఏలననగా, ఆ సమయమున నీ మనస్సు ఎన్నో వ్యర్థమైన తలంపులు నీ యెదుటనుంచి, నీ ఆత్మ కోరికలను అడ్డగించును. ప్రార్థనలు పరిశుద్ధాత్మ సహాయము లేక సార్థకములుకావు; ఆత్మకు కొంచెమైనను సుఖము దొరకదు.

38. సీ॥ ఆత్మలోనను విశుద్ధాత్మ సాక్షాత్కార
మును గల్గుటే క్రైస్తవుని సుఖంబు
అజ్ఞాన తిమిర భావ జ్ఞప్తియను వెల్గు
నుదయించుటే క్రైస్తవునిఫలంబు

తలపులన్నిటి నొక్క తలపుచే దునిమి
బుద్ధిని నిల్పుటే క్రైస్తవుని బలంబు
సందేహ రహిత విశ్వాస దృష్టిని సిలువ
గనుగొంటయే క్రైస్తవుని ధనంబు
తే॥గీ॥ పరమ గురుని కటాక్ష సంప్రాప్తమైన
ప్రార్థనల వృద్ధిచేతను పట్టుపడెడు
ఫలము లివిగాని మాటలవలన గావు
ప్రార్థనలు లేని వారల బ్రతుకదేల.

తాత్పర్యము

పరిశుద్ధాత్మ సందర్శనము ఆత్మలో కలుగుటయే క్రైస్తవుని సుఖము. అజ్ఞానమను చీకటిలో విజ్ఞానమను వెలుగు ఉదయించుటే క్రైస్తవుని ఫలము.

లోకపు తలంపులన్నిటిని పరమార్థచింతతో చంపి బుద్ధిని నిలుపుటయే క్రైస్తవుని బలము.

సందేహములేక విశ్వాస హృదయముతో సిలువను ధ్యానించుటయే క్రైస్తవుని ధనము.

పరిశుద్ధాత్మ సందర్శనము జ్ఞానోదయము బుద్ధిస్థిరత సిలువ ధ్యానములనెడు దివ్యఫలములు ప్రభువైన యేసుయొక్క దయాసహాయములతో చేయు ప్రార్థనలవలన నేగాని వట్టి మాటలవలన దొరకవు. ప్రార్థనలేనివారి బ్రతుకువలన ఏ ప్రయోజనములేదు.

39. క॥ ఇలపై సాగిల బడుటయు
నిలిచియు మోకాళ్లబడియు నిటలమున కరాం
జలి నిడుటయు తను వినయము
గల భక్తి యొనర్పవలయు క్రైస్తవుడెపుడున్.

తాత్పర్యము

భూమిమీద సాష్టాంగపడుటయు నిలువబడుటయు మోకాళ్లూనుటయు నుదుటను దోసిలొగ్గుటయు ఈ మొదలగు శరీరమందలి వినయసూచనలతో క్రైస్తవుడు ప్రార్థన చేయవలెను.

40. సీ॥ నిట్టూర్పు, తలపు, కన్నీరు, మినుదెస దృష్టి
యుల్లంబుతోటి ప్రశ్నోత్తరములు
కరములు వ్రేళ్లు చక్కగ పైకి ఎత్తుట
యేకాంతియై యుండ నిచ్చయిడుట
పులకాంకురములు నింపుగ మేన బొడముట
సంతోష బాష్పముల్ జారిపడుట
పాడుటల్ లోన మాట్లాడుటల్ నవ్వుట
దుఃఖించుటయును తృప్తుండునగుట,
తే॥గీ॥ మంచి భక్తునికివి యన్ని లాంఛనములు
క్రైస్తవోత్తమ యివి నీకు గలిగెనేని
యిందులో నెద్దియైన సర్వేశ్వరుండు
మరువడని నీవెరింగి నెమ్మనము గొనుము.

## తాత్పర్యము

ఒకప్పుడు నిట్టూర్పు విడుచుట, ఒకప్పుడు ధ్యానముచేయుట ఒకప్పుడు కన్నీరు కార్చుట, ఒకప్పుడు ఆకాశముతట్టు దృష్టియుంచుట, ఒకప్పుడు తనకుతాను మనసుతో సంభాషించుకొనుట, ఒకప్పుడు చేతులు వ్రేళ్లను పైకెత్తుట, ఒకప్పుడు రహస్యస్థలమందు ఉండుటకు కోరుట, ఒకప్పుడు శరీరము గగురు పొడుచుట, ఒకప్పుడు ఆనందబాష్పములు విడుచుట, ఒకప్పుడు ఆత్మలో పాడుట, తనలోతాను మాట్లాడుకొనుట, ఒకప్పుడు నవ్వుట, ఒకప్పుడు విచారపడుట, ఒకప్పుడు తృప్తియగుట, ఈ మొదలగునవి నిజభక్తుని యందుండు లక్షణములు. మంచి క్రైస్తవుడా నీయందు ఇట్టి లక్షణములు అనుభవముగా నున్నయెడల, వీటిలో ఒకదానినైనను దేవుడు మరవడని యెరిగి నెమ్మది గలిగియుండుము.

41. తే॥ అవనిలో నీవు క్రైస్తవుండయిన ఫలము
మాకు జూపించుమని బల్కు మానవులకు
తెలియ సాక్షివ్వ గలవి సత్క్రియలె గాని
యనుభవాత్మార్థములు దెల్ప నలవి యగునె.

తాత్పర్యము

నీవు క్రైస్తవుడవైనందుకు భూమిలో ఫలము ఎట్టిదో మాకు చూపించుమని పలుకు మనుష్యులకు క్రైస్తవుని సత్క్రియలే సాక్షిగాని, అతని ఆత్మకు గలిగిన అనుభవములు తెలియజేయ నలవిగాదు గదా.

42. క॥ తన మానస వర్తనములు
తనలో పాతరలు బడిన తప్పులు చూడన్
మనసియ్యని మర్త్యుడు భ
క్తుని యనుభవ మెట్లు దెలిసికొనగ జాలున్.

తాత్పర్యము

తనమనసుయొక్క చర్యను పాతల్లు వేసినట్టు తనలోనుండు దోషములను చూడను మనసియ్యని నరుడు భక్తునియొక్క ఆత్మానుభవములను ఏలాగు తెలిసికొనగలడు?

43. క॥ రాకా చంద్రుని యందము
జీకులకుం జూప నెవరిచే నవును చిదా
లోకన సుఖ మెడ్డెలకును
ఏ కరణిం జూప వచ్చు నిల క్రైస్తవుడా.

తాత్పర్యము

క్రైస్తవుడా, పున్నమనాటి చంద్రుని చక్కదనము గుడ్డివాండ్లకు చూపించను ఎవరికైనను శక్యమగునా? అలాగుననే, ఆత్మదృష్టియొక్క సుఖము మూర్ఖులకు ఏలాగున చూపించుటకు అలవియగును?

44. గీ॥ ఆత్మలో నున్న నిట్టూర్పు లంగలార్పు
లనుభవము లేనివాడు గన్గొనుట యెట్లు
బిడ్డ కనునట్టి స్త్రీనొప్పి గొడ్డుదాని
కెన్ని విధముల నెరిగింప నెరుకపడునె.

తాత్పర్యము

భక్తునిలోనున్న మనోవిచారములును, నిట్టూర్పులును, అనుభవము లేని వాడు ఏలాగు చూడగలడు? పిల్లను కను స్త్రీయొక్క నొప్పి గొడ్రాలకు ఎన్ని విధములను తెలిపినను ఆమె తెలిసికొనదుగదా.

45. క॥ తప్పొప్పుకొన్న శిక్షలు
దప్ప వనుచు నెరిగి దాని దాచను మదికిన్
మప్పెడు వారల కెప్పుడు
ముప్పు గదా కడకు మోసమున్ క్రైస్తవుడా.

తాత్పర్యము

నేరము ఒప్పుకొనినయెడల శిక్ష తప్పక వచ్చునని, ఆ నేరమును దాఁచను తమ మనసుకు నేర్పువారికి, అది చివరకు హాని మోసములను కలుగ జేయును సుమీ.

46. ఉ॥ సాక్షులు లేని చోట ప్రతి
సంగతియందును నిర్మలాత్మయున్
సాక్షిగ నుండి నీ మదికి
సాక్ష్యము నిచ్చుచు నుండు లోక ప్ర
త్యక్షము గాదటంచు
దురితం బెద దాచెదవేని నీ మన
స్సాక్షికి కన్ను మూయుటకు
చాలుదువా మరి క్రైస్తవోత్తమా.

తాత్పర్యము

మంచి క్రైస్తవుడా, నీ ప్రతికార్యమునకు సాక్షులు లేకున్నను, పరిశుద్ధాత్మ యెల్లప్పుడును నీ మనసుకు సాక్షియైయుండును. లోకమునకు బయలుపడదని నీ మనసులో పాపమును దాచ వెతికినను, నీ మనస్సాక్షి యొక్క కంటిని మూయజాలవు సుమీ.

47. తే॥ కాలిలో జొచ్చి విరిగిన కంటకంబు
నరసి తీయంగ నగుగాని యాత్మలోని
దుర్మనస్సాక్షి యను ముల్లు తొలగ ద్రోయ
గల సమర్థుం డిలను లేడు క్రైస్తవుండ.

తాత్పర్యము

అరికాలిలో గ్రుచ్చుకొని విరిగిన ముల్లు వెతికి తీసివేయవచ్చును గాని, క్రైస్తవుడా, ఆత్మలో నాటియున్న దుర్మనస్సాక్షియను ముల్లును తీసివేయునట్టి సమర్థుడు ఎవడును భూమిమీద లేడు సుమీ.

48. క॥ నిన్నొరు లెరుగక యున్నను
నిన్నను నీ వెరుగుదువు మనీషాంతర మం
దున్న వెతలు నిట్టూర్పులు
కన్నీరును నీకు సాక్షిగద క్రైస్తవుడా.

తాత్పర్యము

క్రైస్తవుడా, ఇతరులు నిన్ను ఎరుగకయున్నను నిన్ను నీ వెరుగుదువు గదా, అందుకు నీ మతిలోని బాధ నీ నిట్టూర్పులు నీ కన్నీళ్లు నీకు సాక్షులు గదా.

49. తే॥ చెడు మనస్సాక్షి నిన్నెత్తి పొడుచు టుడుగు
వరకు మరి సన్మనస్సాక్షి దొరుకుదనుక
నూటలుగ బారు కన్నీటితోటి యేసు
పాదములు మజ్జనము సేయు పని వహించు.

తాత్పర్యము

నిన్ను ఎత్తిపొడుచు చెడ్డ మనస్సాక్షి అణగిపోయి మంచి మనస్సాక్షి దొరుకువరకు నీ కన్నీళ్లతో క్రీస్తు పాదములు కడుగు పని బూనుము.

50. క॥ ప్రభు కరుణా జలదము గుబ
గుబలాడి కటాక్ష రసము గురిసి మనస్తా
ప భయాగ్ని నార్చి నీకును
శుభమగు నెమ్మది యొసంగు జుమి క్రైస్తవుడా.

తాత్పర్యము

మంచి క్రైస్తవుడా, నీవు ఆలాగు చేసినయెడల, ప్రభువు తన కృపయను మేఘములోనుంచి కటాక్షమను వర్షము కురిపించి నీ మనస్తాపమను అగ్ని చల్లార్చి నీకు మంచి నెమ్మది యిచ్చును.

51. క॥ నెమ్మదిగల భక్తుని హృద
యమ్ము గదా పూర్ణశాంతమయి సంతత సౌ
ఖ్యమ్ముల కిమ్మయి యుండును
నమ్మిన క్రైస్తవుని బ్రతుకునకు మొదలిదియె.

తాత్పర్యము

స్థిరముగల భక్తుని హృదయము నిండు శాంతముగలిగి యెల్లప్పుడును సుఖమునకు ఉనికిపట్టయియుండును. ఇదియే విశ్వాసియైన క్రైస్తవుని జీవనమునకు మొదలు.

52. తే॥ దూషణకు భూషణకు నెల్ల దుఃఖ సుఖము
లకును మానావమానంబులకును కలిమి
లేములకు బుద్ధి సమము కాలేనియెడల
గలుగునే నెమ్మది సుఖంబు క్రైస్తవునకు.

తాత్పర్యము

దూషణ భూషణలయందును, సుఖమందును దుఃఖమందును ఘనతయందును అవమానమందును, కలిమియందును లేమియందును, బుద్ధి ఒక్కేవిధమున ఉండనియెడల, క్రైస్తవునకు మనసున సుఖము ఎట్లు కలుగును!

53. మ॥ పరులెట్లాడిన నాడనీ శ్రమలు
ప్రాప్తంబైన ప్రాప్తింప నీ
శిరులుం బోయిన బోవనీ హృదయ
విచ్ఛిన్నంబు గానట్టి యా
దరణీయంబగు నిండు నెమ్మది
సదాంతఖ్యాతియై యుండినన్
పరిమోదాత్త సుఖ ప్రపూర్ణుడుగదా
భక్తుండు ధాత్రీ స్థలిన్.

తాత్పర్యము

ఇతరులు ఏలాగు మాట్లాడినను మాట్లాడుదురుగాక, కష్టములు ఎన్ని వచ్చినను వచ్చునుగాక, సంపదలు తరిగిపోయినను పోవునుగాక, అయితే హృదయమందు భంగముకాక స్థిరముగానుండు నెమ్మదియను ఐశ్వర్యము అంతముకాక నుండినయెడల, భక్తుడు భూమియందు సంపూర్ణ సంతోషాత్మగల సుఖమును అనుభవించువాడై యుండును.

54. ఆ॥ పుటములో బడ్డ బంగారు పూదె భంగి
శోధనల బాధచే నాత్మ శుద్ధి దొరుకు
దాని వెల మానవుని కన్ను గానరాదు
గాని ప్రభు వొక్క డెరుగునో క్రైస్తవుండా.

తాత్పర్యము

పుటములో వేయబడిన బంగారము రీతిని బాధలనెడు పరీక్షకు నిలిచిన ఆత్మకు శుద్ధి దొరుకును. అయితే ఇట్టి ఆత్మయొక్క వెల నరుని కన్నులు కనుగొనలేవు గాని ప్రభువు ఒక్కడే దాని తెలిసికొనును.

55. సీ॥ హృదయంబు తెలివితో నుండనీ మానసీ
పైచూపులకు వెల్లిపడక యున్న
విహిత భాషల మంచి బహుమానముల పెక్క
మర్యాద లిత్తురు మర్త్యులెపుడు

ఆత్మశుద్ధికి శోధనావస్థ బహువేళ
పై వెల్తి గని పృథగ్భావ మూని
మునుజూచు వారె మార్గము జేసికొనెన్న
డెరుగని వానిగా నెంతురిట్టి,
తే॥గీ॥ మానవుల చూపులకు భక్తి మహిమలోని
లోతు గనుగొన్న వాడేల లొంగి పోవు
పరమమగు శాంతి పైనుండి దొరికి నెమ్మి
నిండు గల క్రైస్తవుం డేల నీచపడును.

తాత్పర్యము

మనుష్యులు, ఒకనికి హృదయమందు తెలివి యుండినను లేకపోయినను, వాడు పైడంబములయందు వెల్తిలేకున్నయెడల అతనిని ప్రియపూర్వకమైన మాటలతో ఘనముగా నెంచి మర్యాద చేయుదురు. అయితే ఒకడు ఆత్మశుద్ధి నిమిత్తము శోధనలోనుండి పైడంబములు లేనివాడయ్యేనేని అతనియెడల భిన్నభావము వహించి యెన్నడును ఎరుగనివారివలె జూచి పెడమొగము పెట్టుకొందురు. అయితే అట్టి నైజగుణముగలవారి చూపులకు భక్తి ప్రభావము యొక్క లోతును కనుగొని పరమశాంతి స్థిరచిత్తములుగల క్రైస్తవుడు భయపడడు, లొంగిపోడు, నీచుడు కానేరడు.

56. క॥ గుణ మెరుగ నీదు ఏలిక
నిను తక్కువ జూచినపుడు నెమ్మది విడువం
గణగకుమీ గొణగకుమీ
సణగకుమీ కాదు తగవు సరిక్రైస్తవుడా.

తాత్పర్యము

క్రైస్తవుడా, నీ గుణము తెలిసికొనుటకు నీ యేలినవాడు నిన్ను తక్కువగా నెంచు సమయములో నీవు మనసు నెమ్మదిని విడిచి సణగుట గొణగుట నీకు తగినది కాదు.

57. ఉ॥ తక్కువ గల్గు నంచు పరి
తాపము బొందుట యేల క్రైస్తవా
మిక్కిలి భాగ్యరాసులకు
మించిన యేసు కృపా ప్రసాదముం
జిక్కెను దేవుడాత్మ నిను
స్నేహ మొసంగిరి లేనిదేది నీ
యక్కర మాత్రమౌ నిహ
ప దార్థ మొసంగుచుక నీకు గల్గదో.

తాత్పర్యము

క్రైస్తవుడా, నీకు తక్కువ కలుగునని పరితపించుట యేల! అనేక భాగ్యరాసులను మించిన క్రీస్తుయొక్క కృపయను సత్ప్రసాదము నీకు కలిగెను; దేవుడును పరిశుద్ధాత్మయును నిన్ను ప్రేమించిరి. ఇకను నీకు లేనివి యేమిటి? నీకు అవసరమగు ఇహసంబంధమైన పదార్థము కొంచెము నీకు దొరకదా?

58. ఉ॥ పిడికెడు మన్ను నీకయిని
బెట్టను తీసికొనన్ సమర్థతల్
బడసిరి గాని మానవులు
భావములో బెనగొన్న క్రీస్తు ప్రే
ముడి వెడలింప స్వాంత పరి
మోదము మాన్ప సశక్తులే కదా
తడబడనేల నీవెపుడు
తండ్రి దయన్ గనిపెట్టు క్రైస్తవా.

తాత్పర్యము

క్రైస్తవుడా, నరులు పిడికెడు మన్నుమాత్రమేగదా నీకు ఇవ్వను మల్లి తీసికొనను సామర్థ్యము కలిగియుందురు. అయితే నీకు కలిగిన క్రీస్తుయొక్క

ప్రేమను హృదయ సంతోషమును తీసివేయుటకు వారికి శక్తి లేదుగదా. కాబట్టి నీ వెందుకు తడబడెదవు, నీ తండ్రియగు దేవుని దయకొరకు ఎప్పుడును ఎదురు చూచుచుండుము.

59. క॥ పోయిన దేమిటి పిడికెడు
మాయ గదా పోయె భక్తి వైభవమాత్మా
దాయము పోయెనె దైవ స
హాయము నీకుండె చాలునది క్రైస్తవుడా.

తాత్పర్యము

పోయినను పిడికెడు మాయవస్తువు మాత్రముగదా పోయెను, భక్తియొక్క ఐశ్వర్యమును ఆత్మయొక్క ఆస్తియును పోలేదుగదా; క్రైస్తవుడా, దేవుని సహాయము నీకు ఉన్నది గనుక అన్నిటికిని అదియే చాలును.

60. తే॥ మాయ నీ వంతు కొంచెము మాత్రమిచ్చి
తీసికొను వారి కందునే దివ్య లాభ
మించుకయు గల్గునే మాయ నెంత గూర్చ
మాయమై పోవుగాని యాదాయ మగునె.

తాత్పర్యము

కొందరు నీకు మాయవస్తువు కొంచెము ఇచ్చి దాని మళ్లీ తీసికొనుచుంతలో వారికి దానివలన మంచి లాభము గలదా! మాయను ఎంతగా కూర్చినను అది మాయమైపోవునేగాని ఆదాయము కాదు సుమీ.

61. క॥ బెణకకుమీ సత్యోక్తికి
వణకకుమీ దానివలన వచ్చు శ్రమలకున్
మునుగకుమీ చింతాబ్ధిని
సణగకుమీ పరుల యెడల సత్క్రైస్తవుడా.

తాత్పర్యము

మంచి క్రైస్తవుడా, నీవు సత్యవాక్యముకొరకు బెణకవద్దు సుమీ. దాని వలన వచ్చు శ్రమలకు వణకవద్దు సుమీ. దానిగూర్చి చింతయను సముద్రములో మునుగవద్దు సుమీ. ఇతరుల విషయము సణగవద్దు సుమీ.

62. ఉ॥ తోఁచిన యట్లు నీ తలఁపు
త్రోవను బోకు పరాత్పరుండు నీ
డాచిన తల్లికంటె బహుగా
దయ గల్గిన వాడు నీకు చై
చాచి మహోపకారము
లోసంగను వచ్చెడు వేళ మానవుం
డాచ గలండె తండ్రి చెయి
నడ్డ సమర్థుడె క్రైస్తవోత్తమా.

తాత్పర్యము

ఉత్తమ క్రైస్తవుడా, నీ కిష్టమువచ్చిన త్రోవను నీవు పోవలదు. నీ కన్న తల్లికన్నను నీ దేవుడైన పరాత్పరుడు నీయందు మిక్కిలి దయగలవాడై యున్నాడు. ఆయన తన చెయి చాపి నీకు కావలసినవి యివ్వవచ్చునపుడు మనుష్యుడు అడ్డగించగలడా? దేవుని హస్తమును అడ్డగించగలవాడు ఎవడు! ఎవడును లేడు.

63. క॥ దేవుని ముఖ ప్రసన్నత
నీవైపున లేని వేళ నిఖిల మనుష్యుల్
దీవించి పెంచ గలరే
నీ వెతలను మాన్ప గలరె నిజక్రైస్తవుడా.

తాత్పర్యము

నిజక్రైస్తవుడా, దేవుని ముఖకాంతి నీ తట్టులేని సమయమందు లోక మనుష్యులందరును నిన్ను దీవించి పోషింపగలరా! లేక నీ బాధలను పోగొట్ట గలరా?

64. మ॥ సుఖముం దుఃఖము క్షేమమాపదయు
హెచ్చున్ తగ్గు దాసత్వమున్
నిఖిల క్షోణితలాధిపత్యము గడు
దారిద్ర్యమున్నణీ

ముఖ జాంబూనద రౌప్య సంపదల
ప్రోవుల్ హానియున్ వృద్ధియు
న్నఖిలం బిచ్చును దేవు డొక్కఁడని
యభ్యాసించుమిా క్రైస్తవా.

తాత్పర్యము

సుఖదుఃఖములును శుభాశుభములును హెచ్చుతగ్గులను దాసత్వరాజ్యాధికారములును కలిమి లేములును లాభనష్టములును ఇవియన్నియు ఇచ్చువాడు దేవుడేయని క్రైస్తవుడా, నీవు నేర్చుకొనుము.

65. క॥ పెంపను చంపి సమాధిని
దింపను జీవమిడి లేపి దీవింపను నీ
యింపుగల దేవు డొక్కఁడె
సంపూర్ణ ప్రభావు డతడు సత్క్రైస్తవుడా.

తాత్పర్యము

మంచి క్రైస్తవుడా, నిన్ను పెంచను చంపను సమాధిలో దింపను జీవమిచ్చి లేపి ఆశీర్వదించను ప్రియుడైన దేవుడు ఒక్కఁడే సంపూర్ణశక్తిగలవాడు సుమీ.

66. ఉ॥ కావున నీకు మర్త్యు లపకారులు
గారుపకారులయిన గా
రేవిధమైన కార్యముల కెల్లను
దేవుని చెయ్యిగాదె నీ
జీవము గావ బ్రోవ దరి
జేర్చను మార్చను కీడు మాన్పి సౌ
ఖ్యావహమైన మేలొసగ
నంతటి కాతడె క్రైస్తవోత్తమా.

తాత్పర్యము

కాబట్టి మంచి క్రైస్తవుడా, మనుష్యులు నీకు అపకారులైనను ఉపకారులైనను కారు, నీ జీవమును కాపాడి రక్షించుటకును, మార్పుబొందించి తన

యొద్దికి చేర్చుటకును, కీడు తొలగించి సుఖముగల మేలు దయచేయుటకును దేవుని బలహస్తమే చాలునుగాని, నరులవల్ల యేమియుకాదు.

67. క॥ సార మతిని గను దైవ
ప్రేరేపణ లేక నరుని హృదయంబున ధ
ర్మారంభము సత్క్రియ లుప
కారంబులు పుట్టబోవు గద క్రైస్తవుడా.

తాత్పర్యము

దేవునియొక్క ప్రేరేపణ లేకున్నయెడల, మనుష్యుని హృదయములో నీతి ఆరంభించదు; సత్క్రియలు పుట్టవు; నరుడు ఒకరికి ఉపకారము చేయలేడు. క్రైస్తవుడా, మంచిబుద్ధితో దీనిని గ్రహించి చూడుము.

68. క॥ గురి నరు నెడ నిడి యీ స
త్పురుషుడు మము బెంచె నితని పుణ్యంబున మా
దురవస్థ వదలెనని కొం
దరు దేవుని మరిచిరే గదా క్రైస్తవుడా.

తాత్పర్యము

ఈ సత్పురుషుడు మమ్మును పెంచినాడు, ఇతని ధర్మమున మా దురవస్థ తొలగిపోయెను, అని కొందరు పలుకుచు ఒక మనుష్యునియందు గురియుంచి, క్రైస్తవుడా, దేవుని మరచిపోయెదరు గదా.

69. ఆ॥ ఇతని వలన బ్రతికి తీ భూమిలో దివ్వ
బెట్టి మ్రొక్క కొందు నిట్టి నరుని
కనుచు నిచ్చకంబు లాడులేగాని త
త్కారణుం డెవండొ దలచ డకటా.

తాత్పర్యము

ఇతనివలన ఈ లోకమందు బ్రతికితిని, ఇతనిపేరట దీపముపెట్టి మ్రొక్కు కొందును అని (ఒక దాతనుగూర్చి ఒక బీదవాడు ఇచ్చకములాడునేగాని), ఇట్టి ఉపకారములను పొందుటకు ఎవరు కారణమైయుండునో ఆయనను (భగవంతుని) తలంచుకొనడు అయ్యో!

70. ఉ॥ నీ యజమాను డర్మిలిని
నీ జతవానిని హెచ్చుచేసి సు
శ్రేయస కార్యధుర్యునిగ
జేసెడు వేళను నీ మనంబులో
భాయని మోదమో విరస
భావమొ యింకెటు లుండునో సుమీ
మాయ మనంబు గుర్తెరిగి
మంచిగ క్రైస్తవుడా నటించుమీ.

తాత్పర్యము

క్రైస్తవుడా, నీ యజమానుడు ప్రేమతో నీ జతపనివానికి ఘనమైన ఉద్యోగమునిచ్చి నీకన్నను అతని హెచ్చుచేసినప్పుడు, నీ మనస్సునందు ఎడతెగని సంతోషము పుట్టునో, లేక ఈర్ష్యకలుగునో చూడుము. మాయమనస్సును గుర్తెరిగి ధర్మమార్గమున నడుచుకొనుము.

71. తే॥ ఒకరి మెప్పున కోర్వక నొకరికంటె
తన్ను మెచ్చను గోరు మత్సర గుణంబు
దాని దగులని వాడొక్కడైన లేడు
దానితో పోరు సలుపు క్రైస్తవుడొకండు.

తాత్పర్యము

ఇతరులు ఘనముపొందుట గూచి ఓర్వలేక తనకే ఆ ఘనత రావలెనను మత్సరగుణమునకు లోబడినవాడు భూమిమీద ఒక్కడైనను లేడు. అయితే క్రైస్తవుడు ఒక్కడుమాత్రమే దానితో పోరాడుచుండును.

72. క॥ నీవంటి మనుజు నీవలె
భావమునం దలచి చిత్త వాక్యక్రియలన్
గావింపుము సుస్నేహము
దైవాజ్ఞల సారమిదె గదా క్రైస్తవుడా.

## తాత్పర్యము

క్రైస్తవుడా, నీవంటి మనుష్యులను నిన్నువలె భావించి మనోవాక్య క్రియలచేత ప్రేమించవలెను; ఏలననగా ఇదియే దేవుని ఆజ్ఞల సారాంశము.

73. క॥ కడుపేదవైన పెంటను
బడియున్న నితాంత రోగ భరితుండయినన్
కుడి యెడమల నీ కంటం
బడెనేనియు కరుణ జూపవలె క్రైస్తవుడా.

## తాత్పర్యము

ఒకడు మిక్కిలి బీదవాడైనను, పెంటమీద పడియున్నను, బహు రోగ భరితుడైనను, నీ కుడివైపునగాని యెడమవైపునగాని కనబడినయెడల, క్రైస్తవుడా, అతనికి నీవు దయచూపవలెను సుమీ.

74. సీ॥ ధనముచే నీవు ఆదర మొందితివి దరి
ద్రతచేత నతడు దూరమున నుండె
పీతాంబరముల శోభిత మూర్తి వీవు పే
లికలు దాల్చుటను మాలిన్య డతడు
ఇష్టాన్నములను సంతుష్ట చిత్తుడ వీవు
బలుసు గూరను దుఃఖ భాగి యతడు
హంసతూలిక తల్పమందు పండుదు వీవు
తృణ భస్మ రాసి నిద్రించు నతడు,
తే॥గీ॥ నీకు వానికిగల నేటు నీరసంబు
లింతియే గాని ప్రాణ దేహేంద్రియాదు
లందు నీలాటి మానవుం డతడు గాడె
కనికరము ప్రేమ సమపరచు క్రైస్తవుండా.

తాత్పర్యము

నీవు ధనవంతుడవై మర్యాద పొందుచున్నావు, అతడు దరిద్రుడై దూరమున నున్నాడు.

నీవు పట్టు వస్త్రములు ధరించి చక్కని కాంతిగలవాడవై యున్నావు, అతడు పేలికలు చుట్టుకొనుటవలన మైలగానున్నాడు.

నీవు కోరిన అన్నపానాదులవలన తృప్తిపొందిన మనస్సుగలవాడవై యున్నావు, అతడు బలుసుకూర తిని దుఃఖము ననుభవించుచున్నాడు.

నీవు హంసనూగు వెంట్రుకల మెత్తని పరుపుమీద పండుకొనుచున్నావు, అతడు గడ్డిమీదను బూడిదెమీదను నిద్రించుచున్నాడు.

నీకును అతనికిని ఉండు హెచ్చుతగ్గులు ఇంతమాత్రమేగాని, దేహప్రాణ ఇంద్రియాదులన్నిటిలోను అతడు నీకు సమానుడై యున్నాడుగదా, కాబట్టి క్రైస్తవుడా, కనికరమందును ప్రేమయందును అతని నీకు సమానునిగా నెంచుము.

75. తే॥ జగతియందు కులాలుండు సాన మీద
మంటిచే కుండ లొనరించు మాడ్కి సర్వ
నరుల నొక రక్తమున పరాత్పరుడు చేసె
గాన ఘన నీచు లిల లేరు క్రైస్తవునకు.

తాత్పర్యము

కుమ్మరవాడు ఒక మంటి ముద్దతో కుండలు చేయులాగున, దేవుడు భూమి మీద మనుష్యులనందరిని ఒక రక్తముచేతనే సృష్టించెను; కాబట్టి క్రైస్తవునకు ఘనులు కొందరని నీచులు కొందరని లేరు, అందరును సమానులే.

76. క॥ ధరవారిని తనవారిని
సరిగా భావించి ప్రేమ సలుపగ వలయున్
నిరు పేదలయెడ వినయము
కరుణయు జూపింప వలయు క్రైస్తవు డెపుడున్.

తాత్పర్యము

క్రైస్తవుడు తనవారిని ధరణియందున్న యితరులను ఒక్కరీతిని చూడ వలెను. మరియు మిక్కిలి బీదలయెడల వినయమును దయయును ఎప్పుడును చూపించవలయును.

77. సీ॥ తనకు కావలెనన్న ఘనత నన్యుని పట్ల
నొనరింప జూచుటే వినయభక్తి
తనకు శాపంబు వెట్టినవారికొరకు నా
శీర్వాద మడుగుటే చిత్తశుద్ధి
తనకు నిగ్రహ మొనర్చినవారియం దను
గ్రహముగా జూచుటే సహనగుణము
తనకు తక్కువ దరిద్రతనున్న వారి యా
పద బాప దలచుటే సదయబుద్ధి,
తే॥ గీ॥ సాధు సంశుద్ధ సద్గుణ శ్రాంత శాంత
మానసానంద మే ముఖ్యమైన బ్రతుకు
దైవకృప బొందియున్న సత్క్రైస్తవునకు
గల మహైశ్వర్య మది యెన్నగా దరంబె.

తాత్పర్యము

తనకు కావలెనని కోరిన ఘనత యితరులకు తాను చెల్లించుటయే వినయ భక్తి, తనను తిట్టినవారిని దీవించుమని ప్రభువును అడుగుటయే చిత్తశుద్ధి, తనకు అపకారము చేయువారిని అనుగ్రహముతో చూచుటయే సహనము.

తనకన్నను మిగుల బీదలయొక్క ఆపదలు పోగొట్టవలెనని ఆలోచించుటయే దయాళుబుద్ధి.

ఇట్టి నిర్మలమైన సుగుణములతో ఎల్లప్పుడు శాంతము గలిగిన మనసానందమె ముఖ్యమైన బ్రతుకు. ఆహా, దేవుని కృపను పొందియున్న మంచి క్రైస్తవునకు కలుగు గొప్ప భాగ్యము వర్ణించుటకు ఎవరి శక్యము!

78. సీ॥ సత్క్రియాను గత లజ్జా భోగమే గదా
సన్మానమైయుండు సజ్జనులకు
చిర సహిష్ణుత్వభాసుర చిహ్నమే గదా
సాహసంబైయుండు సాధువులకు

మలిన రాహిత్య ప్రేమ పదార్థమేగదా
పటుశక్తిమైయుండు భక్తులకును
తను దాను తగ్గించికొనియుండుటే గదా
మహాత్వమైయుండు మహి బుధులకు,
తే॥ గీ॥ సార సౌందర్య నిర్మలో దార సుగుణ
భూషణము లివి యాత్మ సంతోషణములు
బుద్ధిగలవారి కివి భవ్యబోధనములు
సాధు సత్క్రైస్తవులకివే సాధనములు.

తాత్పర్యము

సత్క్రియలవలన వచ్చు అవమానము అనుభవించుటయే సజ్జనులకుగల సన్మానము.

దీర్ఘశాంతమను ఉత్తమలక్షణమే సాధుజనులకు సాహసము.

శుద్ధమైన ప్రేమగుణమే భక్తులకు దృఢశక్తి.

తనను తాను తగ్గించుకొనుటయే పెద్దలకు దొడ్డతనము.

మిగుల సౌందర్యమును శుద్ధమును, శ్రేష్ఠమునైన గుణములె ఆత్మకు సంతోషకరమైన భూషణములు. మరియు బుద్ధిమంతులకు ఇవియే శుభమైన బోధనలు. సాధువులైన క్రైస్తవులకు ఇవియే నిత్యసాధనములు.

79. ఉ॥ అన్నము దేవ వాక్యము
ప్రియాంబరమా ప్రభు యేసు పుణ్యమున్
చెన్నగు భూషణంబులు
విశేష దయాప్రియశాంత శీలతల్
ఎన్నగరాని సంపదల
కెక్కుడు సంపద నెమ్మనంబు ఈ
కన్నులు గానలేవు గద
క్రైస్తవ ముఖ్యుని యాత్మ సౌఖ్యముల్.

## తాత్పర్యము

దేవుని వాక్యమే అన్నము, ప్రభువైన యేసుక్రీస్తుయొక్క పుణ్యమే వస్త్రము, విశేష దయ ప్రేమ శాంతశీలతలె సుందరమైన అలంకారములు, మనసు లోపలి నెమ్మదియే లెక్కింపలేని సంపద. ఉత్తమ క్రైస్తవునియొక్క ఆత్మసుఖములు శరీర నేత్రములకు కనబడవుగదా.

80. క॥ ఓపిక గల సద్భక్తుని
కాపద లెన్నన్ని వెంట నంటుచు దిరుగున్
దీప చ్ఛవి గని శలభము
లేపుగ జుట్టుకొను భంగి నిలక్రైస్తవుడా.

## తాత్పర్యము

క్రైస్తవుడా, దీపముయొక్క కాంతిని చూచి మిడతలు ఏలాగున చుట్టుకొనునో, ఆలాగున ఓర్పుగల మంచి భక్తుని అనేక ఆపదలు వెంటాడుచుండును.

81. శా॥ ఆపత్కాలమునందు సాహసము
చిత్తాయత్తముం జేయుమీ
దాపై చేరెడు దుఃఖ పుంజములకున్
ధైర్యంబు నీలోన సం
స్థాపింపన్ సమకట్టుమీ కపట
భాషా వేషముల్ మాని స
ద్వ్యాపారంబున నుండుమీ పరమ
భవ్య జ్ఞానివై క్రైస్తవా.

## తాత్పర్యము

క్రైస్తవుడా, ఆపదసమయమందు మనస్సులో సాహసము స్థిరపరుచుము, బహు దుఃఖములు సంభవించునప్పుడు మనస్సులో ధైర్యము స్థిరపరుచుము, నీవు కపటమైన వేషభాషలుమాని శ్రేష్ఠమైన పరమాత్మజ్ఞానముగల వాడవై సత్యమైన నడవడికయందు నిలువుము.

82. చ॥ శరధి తరంగ మాలికల
చాడ్పున నాపదమైని యాపదల్
తరుచుగ వచ్చెనేని మది
తాలిమి వీడకు దైవచిత్తమిా
వెరుగవు గాన వాటిని
వహించుట కౌదల వంచి తండ్రిపై
భర మిడి రక్షణార్థమయి
ప్రార్థనసేయుము క్రైస్తవోత్తమా.

తాత్పర్యము

ఉత్తమ క్రైస్తవుడా, సముద్ర తరంగములవలెను ఒకదానిపైని మరియొకటి ఆపదలు నీమీదికి వచ్చునప్పుడు హృదయధైర్యము వదలకుము, దేవుని చిత్తము నీవు ఎరుగవు గనుక తలవంచి వాటిని వహించి సహించుము. మరియు నీ తండ్రియైన దేవునిపైని నీ భారము ఉంచి రక్షణకొరకు ప్రార్థనచేయుము.

83. చ॥ మనుజ దురాకృతంబున
శ్రమల్ జనుదెంచును కొన్ని వేళలన్
పనిపడి దైవ చిత్తమయి
బాధలు వచ్చును కొన్ని వేళలన్
మనసు చలింపనీక ప్రభు
మార్గము దప్పక దిక్కు నీవెనా
కని మొరపెట్టి దేవుని
సహాయము వేడుము క్రైస్తవోత్తమా.

తాత్పర్యము

మంచి క్రైస్తవుడా, కొన్నివేళలయందు మనుష్యుల దుష్టచేష్టలవలన కష్టములు వచ్చును. మరికొన్ని సమయములలో దేవునిచిత్తమై బాధలు వచ్చును. అయితే అందుకు మనసు చలించనియ్యక ప్రభువు త్రోవను విడువక దేవుడే

నీ దిక్కు అని మొరపెట్టి సహాయముచేయుమని ఆయనను వేడుకొను చుండుము.

84. క॥ పగవానికి పగ సేయుట
తగునని యాపగతు జంప దలతురు మనుజుల్
పగతునకు మేలు సేయం
దగు పని నీ కియ్యబడెగదా క్రైస్తవుడా.

తాత్పర్యము

శత్రువును పగబట్టి చంపుట మంచిదని లోకులు తలంచుచున్నారు. అయితే క్రైస్తవుడా, నిన్ను పగచేయువానికి నీవు తగిన మేలుచేయుటయే నీవు చేయవలసిన పనియైయున్నది సుమీ.

85. ఆ॥ లోకమందు జూడ నీకొక పగవాడు
లేడు గాని నీకు కీడు సేయ
జాలుదుష్ట వైరి నీలోనె యున్నాడు
కన్ను దెరచి చూడు క్రైస్తవుండా.

తాత్పర్యము

విచారించి చూడగా లోకములో నీకు పగవాడు ఒక్కడైనను లేడు; అయితే నీకు కీడుచేయ శక్తిగల శత్రువు నీలోపలనే ఉన్నాడు; క్రైస్తవుడా నీలోపలి కన్ను తెరిచి వాని చూడుము.

86. క॥ సకల మహీ రాజ్యము లిం
చుక కాలములో జయించు శూరునకైనన్
వికవిక లాడించు స్వభా
విక శత్రువు డితడొకడె భువిని క్రైస్తవుడా.

తాత్పర్యము

క్రైస్తవుడా, భూరాజ్యములన్నియును కొంచెము కాలములోనే జయించ శక్తిగల శూరునికైనను దుష్టస్వభావమను వాడొకడే గుండెలు వణకింపచేయు శక్తిగల శత్రువైయున్నాడు.

87. మ॥ పగవాఁడెవ్వఁడు నీకు మానవులలో
పంచేంద్రియ ప్రాణ దే
హ గుణావస్థల నిన్నుఁ బోలెడు మను
ష్యాకారముల్ గాని వే
రుగ గన్పించుట లేదు నీదు మద
గర్వోగ్రస్వభావంబె నీ
పగవాఁడుం గడు కుచ్చితుం డతని
ద్రుంపం జూడుమీ క్రైస్తవా.

తాత్పర్యము

మనుష్యులలో నీకు పగవారు ఎవరు! దేహేంద్రియావస్థలయందు వారందరును నిన్నుబోలిన నరరూపులేగదా! నీకును వారికిని భేదమేమియును లేదు, గనుక వారు నీకు శత్రువులుకారు. (నిన్ను మోసపుచ్చు శత్రువు నీలోనే యున్నాడు), మదము, గర్వము, కోపము మొదలగువాటితో కూడిన నీ దుస్స్వభావమే నీ శత్రువు; క్రైస్తవుఁడా వాని చంపుటకు యత్నించుము.

88. శా॥ నాతోడన్ సముఁడేడి చూడు మిదిగో
నా యిల్లు నా భూమి నా
జీతం బింక గుర్రాల్ రథంబులును
దాసీ దాస దాయాదులన్
ఖ్యాతిం జెందిన వాఁడ నంచు మదిలో
గర్వించు మర్త్యుండయో
ప్రాతఃకాలపు మంచురీతి నివురున్
ప్రాణాంత మే తెంచినన్.

తాత్పర్యము

దుస్స్వభావముగల నరుడు ఇది నా యిల్లు, ఇది నా భూమి, ఇది నా జీతము, ఇవి నా గుఱ్ఱములు, ఇవి నా రథములు, వీరు నా దాసదాసీలు,

వీరు నా దాయాదులు, నావలె ఘనముపొంది నాకు సమానుడగువాడు ఏడి యని మనస్సునందు గర్వించి పలుకును. అయ్యో! వానికి మరణము వచ్చి నప్పుడు సమస్తమును ఉదయకాలపు మంచువలె హరించిపోవునుగదా.

89. ఆ॥ తనకు దానె కాని తనకెవ్వరును గారు
వట్టిమాయ మత్తు బెట్టగాక
పుట్టినప్పుడెద్ది పోగాల మపుడెద్ది
వెంట దేదు దేని గొంటబోదు.

తాత్పర్యము

నరుడు తనకుతానే కాని తనకు ఇతరులెవరును సహాయులుకారు; వట్టి భ్రమవలన మత్తుపొంది యిది నాది, వీరు నా వారు అని చెప్పును; ఏలననగా పుట్టినప్పుడు ఏమియు తనతోకూడ తేలేదు, చనిపోవునప్పుడు ఏమియు తనతోకూడ కొంచుపోడు.

90. క॥ కుళ్లు దిగజారు తొమ్మిది
చిల్లులు గల కసటు బాన చేడ్పాటుల పు
ట్టిల్లు తన తనువు గనుగొని
కల్లరి మనుజుండు పొంగు గద క్రైస్తవుడా.

తాత్పర్యము

క్రైస్తవుడా, కుళ్లు పదార్థములు బయలుదేరు తొమ్మిది రంధ్రములుగల మైల కుండయు, ఆపదలకు పుట్టిల్లునైన తన శరీరమును చూచుకొనుచు తులువ మనుష్యుడు తనలోతాను ఎంతో ఉప్పొంగును.

91. తే॥ అది యిది యనంగరాని దేమయిన లేని
దనెడి పెను మాయలోని మాయకును చుక్క
నగు నరుని నమ్మునే భక్తుడైన వాడు
తనకు తగినట్టి ప్రాపకుం డనుచు మదిని.

## తాత్పర్యము

అట్టిదిట్టిదని అనరానిదిని ఏమియు లేనిదని అనబడు పెనుమాయలోని మాయకన్నను చులకనైనవాడు మనుష్యుడు; అలాటి నరుడు తనకు తగినట్టి ప్రాపకుడని భక్తుడు తన మనస్సునందు నమ్ముకొనునా? ఎన్నటికిని నమ్మడు.

92. క॥ ఇహ పరముల కధిపతి చిర
మహిమాద్యైశ్వర్య భాగ్యవంతుండు మహా
మహుడగు యెహోవా గద నీ
మహదాశ్రయు డతని నమ్ముమా క్రైస్తవుడా.

## తాత్పర్యము

ఇహపరములకు రాజును, శాశ్వత మహిమ ఐశ్వర్యభాగ్యములు గలవాడును, మిగుల తేజస్సుగల యెహోవా దేవుడెగదా, నీకు గొప్ప ఆధారమై యున్నాడు, కాబట్టి క్రైస్తవుడా, నీవు ఆయనే నమ్ముము.

93. సీ॥ సకల కారణ కార్య జగదాదులకు నెల్ల
నాది కారణమైన యాత్మ యతడె
అఘట నాఘటన సాధ్యాసాధ్య విద్యా ప్ర
వీణుడైనట్టి కోవిదుడతండె
సవికల్ప మవికల్ప వివిధ భావాతీత
సగుణ నిర్గుణ సర్వసాక్షి యతడె
నిఖిల భేదాభేద నిశ్చయానిశ్చయ
ప్రాజ్ఞతల్ దెలియు సర్వజ్ఞుడతడె,
తే॥గీ॥ యఖిల సృష్టిస్థితి ప్రళయముల కాత
డొకడె సర్వాధికారి సర్వోపకారి
దీన బాంధవు డతడె నీ దిక్కు నిన్ను
గన్న తండ్రి యతండె సత్క్రైస్తవుండా.

## తాత్పర్యము

సకల లోకములయొక్క కారణ కార్యములన్నిటికిని ఆది కారణమై యున్న పరిశుద్ధాత్మ ఆయనే. సంభవించనిది సంభవింపజేయుటకును అసాధ్యమైనది సాధ్యముచేయుటకును నేర్పుగల మహా విద్వాంసుడు ఆయనే. సవికల్ప నిర్వికల్పములను సమాధియోగములను సగుణనిర్గుణములను మించియుండు సర్వసాక్షి ఆయనే. ఇది భేదము, ఇది అభేదము, ఇది నిశ్చయము, ఇది అనిశ్చయము, అని సకలమును తెలియు జ్ఞానముగల సర్వజ్ఞుడు ఆయనే. ఉత్పత్తి స్థితిలయములపైని సర్వాధికారియు సర్వమునకు ఉపకారియు దీనులకు బంధువుడును ఆయనే. మరియు మంచి క్రైస్తవుడా, నీ తండ్రియు నీకు దిక్కును ఆయనే సుమీ.

94. క॥ నిను కలుగ జేసి కావల
సిన యుపకృతులెల్ల కరుణసేయు యెహోవన్
మును నీ మనసంతటి చే
తను స్నేహము సలుపు సంతతము క్రైస్తవుడా.

## తాత్పర్యము

క్రైస్తవుడా, నిన్ను పుట్టించి నీకు కావలసినవన్నియు దయచేయుచుండు నీ దేవుడైన యెహోవాను మొదట నీ హృదయమంతటితో ఎల్లప్పుడును ప్రేమించుము.

95. సీ॥ కనురెప్ప వేసి తీసిన యంత సేపైన
నిను మరచి పోనట్టి నెనరు తండ్రి
అధరంబు గదలి మాటాడు ప్రొద్దైన నీ
యెడ పరాకును లేని కడు ప్రియుండు
మిటికాయ వేసి నంతటి వేళనైన నీ
కుపకారములు తప్పకొసగు దాత
అడుగు దీసడుగు వేసెడు కాల మంతైన
నెడ సేయనట్టి నీ యిష్ట విభుడు,

తే॥ మిన్ను ఈ మన్నుపై గప్పియున్నరీతి
నిన్ను తనకున్న భాగ్యంబులన్ని తెఅచి
తఱుచుగా నిచ్చు నీ పరాత్పరుని ప్రేమ
కనుగొనుము ఎట్టులున్నదో క్రైస్తవుండా.

తాత్పర్యము

కంటిమీద రెప్పవేసి తీసినంత సేపైనను నిన్ను మరవని నీ ప్రియుడగు తండ్రి, పెదవి కదలి మాట తొలగినంత సేపైనను నీయందు పరాకులేని నీ స్నేహితుడు, చిటికవేసినంత సేపైనను తప్పక నీకు సకలోపకారములు ఇచ్చు దాత, అడుగుదీసి అడుగువేసినంత సేపైనను నిన్ను విడిచిపెట్టని నీ యిష్టప్రభువు, భూమిని ఆకాశము కప్పియున్నలాగున తన ఉపకారములతో నిన్ను కప్పి తన భాగ్యములు తరుచుగా నీకు ఇచ్చుచున్న పరాత్పరుడగు నీ దేవుని ప్రేమ, క్రైస్తవుడా, నీయెడల ఏలాగు ఉన్నదో తెలిసికొనుము.

96. తే॥ నది మహోదధి పదమంటి వదల కెట్టు
లుండునో యట్టు ప్రభునియం దుల్లముంచి
ప్రేమ నిర్ఝుర రసము బారించి క్రీస్తు
భక్తుడా తండ్రితో నైక్య పదవి గొనుమి.

తాత్పర్యము

ఏరు ఏలాగు సముద్రమును అంటి వదలక యున్నదో ఆలాగే క్రీస్తు భక్తుడా, నీ మనసు ప్రభువుకట్టు ఉంచి, నీ ప్రేమయను మధురసారము పారింప జేసి తండ్రితో అన్యోన్యమగు పదవి ననుసరించుము.

97. క॥ జీవము కంఠెను మధురము
గా వినబడు దైవదత్త ఘన వాక్కులనే
ప్రావృడ్జలదమునకు నీ
భావపు చాతకముపొంగవలె క్రైస్తవుడా.

తాత్పర్యము

క్రైస్తవుడా, వానకోవెల వర్ష కాలపు మేఘమునకు ఉవ్విళ్ళూరునట్లు జీవము కన్నను మధురముగానున్న దేవుని వాగ్దత్తములకు నీ మనసు ఉవ్విళ్ళూరవలెను సుమీ.

98. క॥ దేవుని వాఙ్మధు మధురము
దావీదు రుచించి తొల్లి తగు సాక్ష్యమిడెన్
నీవా సాక్ష్యము నిజమని
భావానుభవమున గంటివా క్రైస్తవుడా.

తాత్పర్యము

దేవుని వాక్యములు తేనెకంటెను మధురమైనవి అని పూర్వము దావీదు అను రాజు చవిచూచి సాక్ష్యమిచ్చెను, అలాగుననే క్రైస్తవుడా, నీవును నీ యనుభవమందు అది నిజమని కనుగొంటివా?

99. క॥ కడు చేరువయిన కాలము
నిడువైనను దైవదత్త నిజవాక్ఫలముల్
బడయుక మానడు క్రైస్తవు
డుడుగని ప్రార్థనల మనసు ఓపికచేతన్.

తాత్పర్యము

ఓపిక కలిగి యెడతెగని ప్రార్థనలుచేయు క్రైస్తవుడు మిక్కిలి శీఘ్ర కాలములోనైనను దీర్ఘకాలములోనైనను దేవుని సత్యవాగ్దత్త ఫలములు అనుభవింపక మానుడు సుమీ.

100. సీ॥ విత్తనంబు లిల దున్ని వేయువాడాతుర
త్వముచేత వెంటదే తత్ఫలంబు
లతి వేగమున బొంద నాశించునే యట్లు
గోరక కాలంబు కొరకు వాడు

కనిపెట్టి యోర్మితో పని వీడకుండు గా
వున నట్లు సత్క్రైస్తవుండు దాల్మి
గొని దేవ వాగ్దత్తమనుభవించిన దాక
మనసులో కనిపెట్టి యనుదినంబు,
తే॥గీ॥ ప్రార్థనలు సేయు దైవాత్మ బలమువలన
భక్తి భావంబు మదికి నిబ్బరము గలుగు
నోర్పు నోదార్పు బడయ దేవోక్తిచేత
ఫలము తుద నొందు ప్రభు కృపా బలమువలన.

## తాత్పర్యము

వ్యవసాయకుడు భూమిని దున్ని విత్తనములువేసి వెంటనే దాని ఫలము కోరడు, పంటకాలమువరకును అతడు తాలిమితో కనిపెట్టి తన పనిని విడువకుండును; ఆలాగే మంచి క్రైస్తవుడును దేవుని వాగ్దత్తములు తన అనుభవమునకు దొరకు పర్యంతము ఓర్పుతో కనిపెట్టి తన పనియైన ప్రార్థన విడువక చేయుచుండును. మరియు ప్రార్థించునప్పుడు పరిశుద్ధాత్మ బలముచేత మనసుకు భక్తియు నిబ్బరమును కలుగును; దేవుని వాక్యమువలన ఓర్పును ఓదార్పును దొరుకును; ప్రభువు కృప బలమువలన చివరకు ఫలమును పొందును.

101. శా॥ సందేహంబులు మాని దార్ఢ్యమగు
విశ్వాసంబు లో నూని యా
త్మందుందాల్మి ఘటించి దేవుని సువా
గ్దత్తామృతాస్వాదనా
నందాసక్తి తిరంబుగా మనసులో
న న్నిల్పి యిష్టార్థముల్
పొందే దాకను ప్రార్థనల్ విడువకన్
పోరాడుమీ క్రైస్తవా.

తాత్పర్యము

క్రైస్తవుడా, నీవు సందేహములు మాని హృదయమందు దృఢవిశ్వాసము ధరించి ఆత్మలో తాలిమిని స్థాపించి, దైవవాగ్దత్తమను అమృతము రుచి చూడ గల ఆనందమైన కోరికె మనసునందు స్థిరముగా నిలిపి, నీవు నిరీక్షించువాటిని పొందు పర్యంతము ఎడతెగని ప్రార్థనలచేత పోరాడుచుఁ నుండుము.

102. శా॥ ఎంతో కాలము వేడుకొంటి నిక
నే నేనాటికిం గాంతు నా
యంతర్వాంఛిత మంచు బల్విసుపుతో
నవ్వేడుటల్మాని దు
శ్చింతం బొందు నొకఁడు ఇంక నొకడున్
సిద్ధించు నందాక నే
కాంత ప్రార్థన మానడెన్నటికి
దుఃఖం బంతముం గల్గినన్.

తాత్పర్యము

ఒకడు నేను బహుకాలము ప్రార్థించితిని, నా హృదయములోని కోరికను ఇకను నేను ఏనాటికి పొందగలను అని విసికి ప్రార్థనలు మాని దగని తలంపుల పాలవును; అయితే మరియొకడు తన నిరీక్షణ సిద్ధించు పర్యంతము చాలా దుఃఖములును చివరకు ప్రాణాంతమును కలిగినను తన ఏకాంత ప్రార్థనలు విడువడు.

103. క॥ ఏది తన కొసగ మంచిదో
యేదిచ్చిన మేలుగాదో హితమగు ఫలముల్
మీఁ దెఱిగి యిచ్చు తండ్రికి
కాదనియెడు బిడ్డ కు మతి గద క్రైస్తవుడా.

తాత్పర్యము

తన పిల్లకు ఏది యిచ్చుటవలన మేలో, ఏది ఇచ్చుటవలన కీడో, అది తెలిసి తదనుకూలమైన ఫలములను ఇచ్చు తండ్రికి, అది సరికాదని చెప్పు బిడ్డ

దుర్బుద్ధి గలవాడుగదా; దేవుడు తన భక్తునకు తగినది యేదో అదే యిచ్చును, గనుక భక్తుడు దేవుని చిత్తానుసారముగా నడవ నేర్చుకొనవలెను.

104. క॥ ఇష్టార్థ మబ్బు కొఱకై
కష్టంబులు తెరలు తెరలుగా గప్పని యే
నష్టములు రాని తమ తమ
నిష్ఠలు దప్పరుగదా మనీషన్ భక్తుల్.

తాత్పర్యము

భక్తులు ఎన్నెన్ని కష్టములు వచ్చినను, బహు నష్టము సంభవించినను, తమ నిరీక్షణలు సిద్ధించువరకు మనసునందు పూనుకొనిన నిష్ఠలు విడువరు గదా.

105. ఉ॥ సంపదలన్నియున్నెనరు
సంతతి యంతయు నొక్కనాటి శో
ధింపున నాశమై పిదప
దేహము రోగముచేత నిండి బా
ధింపగ నోర్చుకొంచు తన
ధీరత వీడక యోబు తొల్లి రె
ట్టింపగు భాగ్యమందడె
దృఢీకృత భక్తిని క్రైస్తవోత్తమా.

తాత్పర్యము

ఉత్తమ క్రైస్తవుడా, పూర్వకాలమందు యోబు అను సత్పురుషునకు ఒక్కనాటి శోధనవలన అతని సంపదయును సంతతియును నశించి పోయెను; తరువాత అతని దేహమంతయు రోగముతో నిండి చాలా బాధలు పొందినను, ధైర్యము విడువక ఓర్చుకొనుచు దృఢభక్తి గలవాడైనందున పూర్వము పోయిన దానికన్న రెండంతల భాగ్యము తరువాత అతనికి దొరికెను.

106. సీ॥ మానవ నే వేడుటల్ కానానుస్త్రీ తన్ను
నవమానపరచి మాట్లాడినపుడు

విడిచెనే తన కేకవేయుటల్ నొక చీకు
మనుజాళి గద్దింపు మాటలకును
వదిలెనే తన భక్తి పర ధీరుడగు యోబు
బహు దుఃఖముల పాలు బడిన వేళ
వణికిరె నృప కోప వహ్ని బాధలకు, ష
ద్రకు మేషకును అబె, ద్నగులు తొల్లి,
తే॥ గీ॥ ముఖ్యమగునట్టి యిష్టార్థములు లభింప
గోరువారెల్ల జనుదెంచు ఘోర విపద
దుఃఖముల కోర్తురే గాని తొలగిపోరు
గాన నీవట్లు మెలగుమీ క్రైస్తవుండా.

## తాత్పర్యము

కానాను దేశపుస్త్రీ తనను ధిక్కరించి మాట్లాడినపుడు తన విజ్ఞాపనము మానలేదుగదా.

ఒక గుడ్డివానిని ఊరకుండుమని అనేకులు గద్దించినపుడు అతడు కేకలు వేయుట మానలేదుగదా. మిగుల ధైర్యవంతుడగు యోబు తనకు అనేక కష్టనష్టములు సంభవించినపుడు తన భక్తిని విడువలేదుగదా. షద్రకు మెషకు అబేద్నెగో అనువారు రాజుయొక్క కోపమునకును అగ్నిబాధలకును భయపడలేదుగదా; వీరందరివలెనే తమ యిష్టార్థములు లభింపగోరువారందరును తమ దృఢభక్తి విశ్వాసములు విడువక, కఠినబాధ దుఃఖములను సహింతురుగాని తొలగిపోరు; కావున క్రైస్తవుడా, నీవును ఆలాగుననే నడువవలెను సుమీ.

107. ఆ॥ భక్తికార్యంబులెడ నీవు ప్రౌఢవైన
బుద్ధిలో మత్సర గుణంబు బొడమనీయకు
జ్ఞానగర్విష్టులగువారి మానసములు
గలపుచుండు పిశాచంబు క్రైస్తవుండా.

### తాత్పర్యము

క్రైస్తవుడా, నీవు భక్తికార్యములయందు ముదిరినవాడవైనను మత్సరగుణము నీలో పుట్టనీయకుము; తెలివివలన గర్విష్ఠులగువారి హృదయములను పిశాచి తొందరపెట్టుచుండును.

108. చ॥ పొడవున నుండగోరు చెడు
　　బుద్ధిని బద్ధుని జేయకున్న ని
న్నడుగున నంటజేయుచు
　　రయంబున దొర్లిపడంగ ద్రోచి పె
క్కిడుమల బెట్టు గావున
　　మహిన్ నిను తగ్గగ జేసి యెప్పుడున్
కడు వినయంబు భూషణముగా
　　ధరియించుము క్రైస్తవోత్తమా.

### తాత్పర్యము

ఉత్తమ క్రైస్తవుడా, హెచ్చుగా నుండగోరు దుర్బుద్ధిని బంధించనియెడల అది నిన్ను క్రిందికి దొర్లించి పడద్రోసి మిగుల వెతలబెట్టును, కావున అహంకారము మాని నిన్ను నీవు తగ్గించుకొని అతి వినయమును నీకు భూషణముగాను ధరించుకొనుము.

109. క॥ నిను నీవు తగ్గి నడిచిన
ఘనతను బొందెదవు లేక గర్వితమతివై
నిను నీవు హెచ్చుగకొ
న్నను నీచము హీన మవఘనము వచ్చుసుమీ.

### తాత్పర్యము

నిన్ను నీవు తగ్గించుకొని నడుచుకొనినయెడల ఘనతను పొందుదువు, అయితే గర్వబుద్ధితో నిన్ను నీవు హెచ్చించుకొనినయెడల నీకు నీచతయును ఘనహీనతయును కలుగును సుమీ.

110. క॥ నానావిధమగు వాంఛల
తో నిండిన హృదయమునకు తోషణ మిసుమం
తైనను గలుగదు గావున
మానసము దురాశ లుడుగవలె క్రైస్తవుడా.

తాత్పర్యము

పలువిధములగు ఆశలతో నిండిన హృదయమునకు కొంచెమైనను సంతుష్టి లేదు, కావున క్రైస్తవుడా, మనసునందలి దురాశలు విడువవలెను సుమీ.

111. ఉ॥ కోరికె లన్నిటిం జిదుము
కోరికె మోక్ష సుఖంబు దాని ని
స్సారముచేసి పైకి కొన
సాగెడు వేరొక కోర్కె యున్నదే
పారన దెట్టులన్న పర
మాత్మ సుఖైక్యత యేసు పాద పం
కేరుహ దర్శన స్పరిశ
కేవల మబ్బుటె క్రైస్తవోత్తమా.

తాత్పర్యము

ఉత్తమ క్రైస్తవుడా, అన్ని కోరికలను ఖండించు మంచి కోరిక మోక్షాపేక్షయై యున్నది. అయితే దానిమించిన కోరిక మరియొకటి యున్నది, అది యేదనగా పరిశుద్ధాత్మతో అన్యోన్యత్వము, క్రీస్తుయొక్క కమలముల వంటి పాదములను చూచుటకును తాకుటకును అధికృత కలిగియుండగోరుటయే సుమీ.

112. క॥ మోక్షాధిపుడగు దేవుని
సాక్షాద్దర్శనము గోరు సౌఖ్యముకంటెన్
మోక్షాపేక్ష ఘనముగా
దిక్షురసము నిమిడె పిప్పియెడ క్రైస్తవుడా.

తాత్పర్యము

క్రైస్తవుడా, మోక్షాధికారియగు దేవుని ప్రత్యక్షముగా చూచు సౌఖ్యము కన్నను మోక్షమునే కోరడము అంత ఘనమగు కోరిక కాదు; చెరుకు రసము పిప్పియందు ఇమిడియున్నలాగున దేవుడు మోక్షమందు ఇమిడియున్నాడు. (కావున నీ యాశ దేవునియందే ఉంచుము.)

113. ఉ॥ దేవునికంటె వేరయిన
దివ్యసుఖంబును లేదు క్రీస్తులో
జీవముకంటె వేరె యొక
క్షేమము నెందును లేదు నిర్మలా
త్మావిలసద్దయా రసము
ద్రావుటకంటెను వేరె తృప్తి యిం
కేవలనైన లేదు మరి
యేమిడు మోక్షము క్రైస్తవోత్తమా.

తాత్పర్యము

దేవునికన్న ఇతరమైన దివ్యసుఖము ఏదియు లేదు, క్రీస్తునందలి బ్రతుకు కన్న వేరొక క్షేమము ఎక్కడను లేదు. పరిశుద్ధాత్మయొక్క అతిశ్రేష్ఠమగు దయారసము త్రాగుటకన్న అధికమైన తనివి మరి యేవిధమునను లేదు; మంచి క్రైస్తవుడా, మోక్షము ఇంతకన్నను విశేషమైనది మరియేమి ఇవ్వగలదు!

114. క॥ కావున త్రయైకమగు నీ
దేవునిపై యాశ నిలుపు దృఢమతివై ము
ఖ్యావసరమైన కోర్కెయి
దే, వర భక్తులకు సమ్మతియు క్రైస్తవుడా.

తాత్పర్యము

కావున క్రైస్తవుడా: తండ్రి, కుమారుడు, పరిశుద్ధాత్మయును త్రైయైకుడగు నీ దేవునియందు నీ కోరికను దృఢముగా నుంచుము; శ్రేష్ఠమైన భక్తులకు ప్రాముఖ్యమును అవసరమును సమ్మతమునునగు కోరిక యిదే సుమీ.

115. ఉ॥ జన్మము దాల్చు ఖేచర
రసాచర వారిచరాది జీవులం
దున్న నుజోద్భవంబు కడు
దొడ్డది తన్నర కోటిలో పున
ర్జన్మము ధీ వినూత్నకృత
జన్మము గల్గిన వారిజన్మమే
జన్మముగాక దుర్జనుల
జన్మము లేటికి క్రైస్తవోత్తమా.

తాత్పర్యము

ఉత్తమ క్రైస్తవుడా: ఆకాశమందును, భూమియందును, నీళ్లలోను సంచరించు, సర్వ జీవులలో నరజన్మము మిగుల దొడ్డది. ఆలాటి నరులలో పునర్జన్మము, అనగా మనస్సు నూతనము చేయబడిన భక్తులయొక్క జన్మమే సాఫల్యమగు జన్మము; దుర్జనులయొక్క జన్మము ఎందుకు?

116. క॥ పునరపి జననము మరణము
పునరపి జననమని కవులు బోధించిరవె
ల్లను వట్టి కల్లమాటలు
మనసొక్కటి మార్పుపొందవలె క్రైస్తవుడా.

తాత్పర్యము

నరులకు అనేక జననమరణములు ఉన్నవని కొందరు కవీశ్వరులు బోధించియున్నారు; అవి యన్నియు వట్టి అబద్ధపుమాటలు: అయితే క్రైస్తవుడా మనసు మాత్రమే మార్పు పొందవలెను.

117. ఆ॥ ఆత్మవలన పునర్జన్మమగుచు మోక్ష
రాజ్యమున చేరవలెనని రాత్రివేళ
యేసు నికొదేముతో చెప్పుటిది నిజంబు
గాని తక్కిన వన్నృతముల్ క్రైస్తవుండా.

### తాత్పర్యము

ఒకనికి ఆత్మజన్మము కలిగితేనేగాని దేవుని రాజ్యములో ప్రవేశించలేడని ప్రభువైన యేసుక్రీస్తు రాత్రివేళ తనవద్దకు వచ్చిన నికొదేముతో చెప్పిన లాగున, పరిశుద్ధాత్మవలన మనసు మార్పుపొందుటయే నిజమయిన పునర్జన్మము గాని తక్కినవన్నియు అనగా అనేక జనన మరణములు కలవను కల్పనా కథలు అసత్యమైనవి సుమీ.

118. వ॥ అదిగావున క్రైస్తవోత్తమా భవదీయ చిత్తంబున
నీ యుత్తమంబగు పునర్జననం బనుభవగోచరం బైయుం
డుటంజేసి నిరంతర సంతుష్టాంతరంగుండవై సుఖం
బున నుండుమని చెప్పిన తెరంగు క్రైస్తవ నీతిప్రకా
శంబునందు వివరింపంబడియెను.

### తాత్పర్యము

గనుక ఉత్తమ క్రైస్తవుడా, ఈ ఉత్తమమగు పునర్జన్మము నీ మనసుకు అనుభవ గోచరమై యున్నందువలన ఎల్లప్పుడును సంతోష హృదయము గలవాడవై సుఖముగా నుండుమని చెప్పిన ప్రకారము క్రైస్తవ నీతిప్రకాశమను ఈ గ్రంథమందు వివరింపబడెను.

క॥ నజరేతుపుర విహారా
నిజసుజనాశ్రితమనోజనిత భయదూరా
వృజనాటవీ కుఠారా
విజయామృత ప్రేమపూర విశ్వాధారా.

### తాత్పర్యము

నజరేతను పట్టణమున నివసించినవాడా, నీయొక్క సుజనులగు ఆశ్రితుల మనసున పుట్టిన భయమును పోగొట్టి పాపమనెడు యడవికి గొడ్డలివంటి వాడా, జయస్వరూపుడా, ప్రేమ యను అమృతమునకు ప్రవాహమైనవాడా సమస్తమునకు ఆధారుడవగు దేవా.

క॥ భీషణ దోషాంధతమః
పూషా నిజసాధువర్గ పోషా సుదయా
భూషా గుణఘోషా మృదు
భాషా మనుజావతార పరమవిచార.

తాత్పర్యము

భయంకరమగు పాపమను చీకటికి సూర్యునివంటివాడా, సాత్వికులైన నీ జనులను పోషించువాడా, మంచిదయయే అలంకారముగా గలవాడా, సుగుణములు ధ్వనించుచున్నవాడా, మృదువైన మాటలుగలవాడా, మనుష్యావతార మెత్తినవాడా, మిక్కిలి శ్రేష్ఠమయిన ఆలోచన గలవాడా.

మా॥ విమలమతిసమీపా, వీతసంసారతాపా,
సుమహిత నరరూపా, శుద్ధవిజ్ఞానదీపా,
అమితశుభవిచారా, యాత్మరక్షాధికారా,
శమదమగుణధీరా, సత్య వేదాంతసారా.

తాత్పర్యము

శుద్ధ హృదయముగలవారి సమీపమున ఉండువాడా, సంసార దుఃఖములు లేనివాడా, అన్నిటికంటె యోగ్యమగు నరరూపమెత్తినవాడా, పరిశుద్ధ జ్ఞానమే దీపముగా గలవాడా, మితిలేని శుభమైన ఆలోచన గలవాడా, ఆత్మలను రక్షించుటకు అధికారము గలవాడా, శాంతము ఇంద్రియ నిగ్రహము లను గుణములచేత ధైర్యవంతుడా, సత్యవేదాంతమునకు సారమైనవాడా.

గ॥ ఇది శ్రీయేసునాథ పాదారవింద ధ్యానానంద రస
పాన నిరంతరాభ్యాసమాన మానసోల్లాస భక్తజన
విధేయ పురుషోత్తమ నామధేయ ప్రణీతంబైన క్రైస్తవ
నీతిప్రకాశంబునందు సర్వంబును ఏకాశ్వాసము.

## తాత్పర్యము

శ్రీ యేసు ప్రభువుయొక్క పాదకమలముల ధ్యానమను ఆనంద రసపానము చేసి, ఎల్లప్పుడు దానిని అభ్యసించుటవలన మనసునందు సంతోషించెడు భక్తి జనులకు విధేయుడగు పురుషోత్తముడను పేరుగల అతనిచే క్రైస్తవ నీతి ప్రకాశము అను గ్రంథము అంతయు ఏకాశ్వాసముగా రచియింపబడెను.

ఆ॥ పదియు నెనిమిది నూరులపైని యయిదు
పదులు నొకవర్షమందున పద్యరూప
కముగ క్రైస్తవ నీతిప్రకాశమిది ర
చించబడె ప్రభువు దీని దీవించుగాక!

## తాత్పర్యము

1851-వ సంవత్సరమునందు పద్యరూపముగా క్రైస్తవ నీతి ప్రకాశమను నీ గ్రంథము రచియింపబడెను. ప్రభువైన యేసు దీని దీవించు గాక!

# యేసునాయక శతకము

## JESUS THE SINNER'S REFUGE

రెవ. పురుషోత్తమ చౌధరి కవికృతము.

# విషయసూచిక


| | పద్యముల సంఖ్య |
|---|---|
| శ్రీ యేసు స్తోత్రము ... ... ... ... | 65 |
| భక్తుని పశ్చాత్తాపము ... ... ... ... | 65 |
| మనుష్యుని అనిత్యత ... ... ... ... | 75 |
| పాపమువలన దుర్గతి ... ... ... ... | 78 |
| మనసు చంచలము ... ... ... ... | 81 |
| విగ్రహారాధనాదుల వ్యర్థత ... ... ... | 82 |
| నరకము తప్పించుకొను సాధనము ... ... ... | 84 |
| సత్యమైన ప్రాయశ్చిత్తము ... ... ... | 85 |
| ప్రభువు మరణమువలని పుణ్యము ... ... ... | 87 |
| ప్రభువుయొక్క ఉచితమగు కృప ... ... ... | 90 |
| ప్రార్థన స్తోత్రములు ... ... ... ... | 92 |
| సత్క్రియలవలననే మోక్షము కలుగదు ... ... ... | 98 |
| అన్యదేవతలయెడల భక్తుని విరక్తి ... ... ... | 99 |
| భక్తుని మనో సుఖము ... ... ... ... | 99 |
| ప్రభు నామ విజయము ... ... ... ... | 103 |

# యేసునాయక శతకము

1. శ్రీకరమై సుధీజనవశీకరమై నిజభక్త నిత్యసౌ ఖ్యా
కరమై సమస్త జగదావన పావన రక్తసిక్త శో భాకరమై చెలం
గెడు భవత్పద పద్మము లాశ్రయించి నే, ప్రాకట భక్తితో
గొలుతు బాయక యెప్పుడు యేసునాయకా.

## తాత్పర్యము

ధన్యత నిచ్చునవియై, మంచి మనస్సుగలవారికి స్వాధీనములునవయు, తన భక్తుల నిత్యసుఖమున కాధారములయి, యావత్తులోకముయొక్క పాపములను పోగొట్టునట్టి రక్తముతో కూడి ప్రకాశించునట్టి నీ పాదపద్మముల నాశ్రయించి నిష్కపటమగు భక్తితో ఎల్లప్పుడును గొల్చెదను, ఓ యేసునాయకా ॥

## భక్తుని పశ్చాత్తాపము

2. భారముతో ప్రయాసముల బొల్పడువారలు నాదు
పజ్జకిం పారగ రండు మీ యలత మాన్పెదనంచును బిల్చు
నీ కృపా సారము చిల్కు వాక్యము విచారముచేసి మదీయ
పాప వి స్తారభరంబుతో సిలువ దాపుకు వచ్చితి యేసు
నాయకా.

## తాత్పర్యము

భారములు మోయలేక కష్టపడుచున్న వారలారా, నా వద్దకు రండి, మీ యలసట తీర్చెదను అని చెప్పుచున్న నీ కృపను ప్రసరించు నీ వాక్యమును ఆలోచించుకొని, విస్తారమయిన నా పాపముల భారముతో నీ సిలువవద్దకు వచ్చితిని । యేసునాయకా ॥

3. ఎంతటి పాపియైనను ఒకించుక సంశయమాత్మ లేక నీ
చెంతను జేరి ప్రార్థనలు సేయగ నీవది జూచి తస్సన, శ్శాంతి

యొనర్చి సజ్జనుల సంగతిగూర్చి యణంచి పాపముల్ సంతస
మిచ్చి బ్రోతువని చాటునుశాస్త్రము యేసునాయకా.

తాత్పర్యము

ఎటువంటి ఘోరపాపియైనను సరే, యే మాత్రము అనుమానము మనస్సులో పెట్టుకొనకుండా నీయొద్దికివచ్చి ప్రార్థనచేసితే అది నీవు చూచి, వారి మనస్సులకు నెమ్మదియిచ్చి నీ భక్తులతో సాంగత్యము దయచేసి, పాపములను పోగొట్టి, మనస్సులో సంతోషము కలుగజేయుదువని నీ వాక్యము నేర్పుచున్నది । యేసునాయకా ॥

4. నేను దురంతపాతకుడ నేను దురాత్ముడ నేను క్రూరుడ
న్నేను మహాపరాధినిదె నేను కృతఘ్నుడ నేను నీచుడం,
దీనుడనయ్య నేను భవదీయ దయామృత వృష్టి నాపయిన్
మానుగబంపి నా మనసు మార్పడజేయవె యేసునాయకా.

తాత్పర్యము

నేను ఘోరపాపిని, చెడిపోయిన ఆత్మగలవాడను, క్రూరుడను, గొప్ప అపరాధిని, కృతజ్ఞతలేనివాడను, నీచుడను, దీనుడను, నామీద నీ కృపయనే అమృతవర్షము కురిపించి నా హృదయమును మార్చుమా । యేసునాయకా ॥

5. కాపురుషాళి కగ్రజుడ కల్మషరాసుల పెంట భూరి సం,
తాప దురంత చింతలకు తావగువాడన మార్గదుర్గుణ, ప్రాపకు
డన్మహానరక పాత్రుడనో కరుణాపయోధి నీ దాపున జేరినాడ
తవ దాస్యమొసంగవె యేసునాయకా.

తాత్పర్యము

పాపాత్ముల సమూహములో మొదటివాడను, పాపరాసియనే పెంట కుప్పను, విస్తారమగు దుఃఖములకు చెడు ఆలోచనలకు ఉనికియయినవాడను, పనికిరాని దుర్గుణములకు ఆధారమును, ఘోరనరకమునకు పాత్రుడను. ఓ కృపాసముద్రుడా, నీ యందజేరినాను, నీసేవ దయచేయుమయ్యా । యేసునాయకా ॥

6. విడిచితి పారమార్థిక వివేకము సద్గతిదెల్పు శాస్త్రము
న్నడిచితి దుష్టనైజయుత మద్హృదయాచరణానుసారినై నడిచితి
సత్యశాంత సుగుణంబుల బారగదోలి దుఃఖముల్ గుడిచితి
నింక నీ శరణుగోరితి జేరితి యేసునాయకా.

తాత్పర్యము

పరమార్థములయెడల నుండిన వివేకమును విడిచిపెట్టితిని, మోక్షమార్గమును చూపించు వేదగ్రంథమును చదువుట మానితిని; దుష్టస్వభావముతో గూడిన నా హృదయము ననుసరించి నడుచుకొంటిని, సత్యము శాంతము మొదలయిన సుగుణములను పోగొట్టుకొని దుఃఖముల ననుభవించితిని; అయితే ఇప్పుడు నీ శరణుగోరి నీ యొద్దికి వచ్చినాను। యేసునాయకా॥

7. మరచితి దేవవాక్యములు మత్సర కామవికారవిద్యలం
గరచితి దుష్కృతవ్రతము కానొనరింప పిశాచిచెయ్యినే జర
చితి చెప్పతీర నగసాట్లకు పాలయి సారె కక్కటా బరచితి
దిక్కులేకిపుడు వచ్చితి నీదరి యేసునాయకా.

తాత్పర్యము

దేవుని వాక్యములను మరచిపోతిని; కామ క్రోధ మత్సరాది దుష్టవిద్యలను నేర్చితిని; చెడ్డకార్యములను చేతునని సాతానుకు చేతిలో చెయ్యి వేసితిని; చెప్పనలవికాని కష్టములపాలయి, అయ్యో పరుగెత్తితిని; యిప్పుడు వేరేదిక్కులేక నీ చెంత చేరితిని। యేసునాయకా॥

8. అనుపమ చిత్తశాంతిసుఖ మారడిబుచ్చితి నిత్యముక్తి
సా ధన ధనరాశి వోగొడితి ధైర్యమహాఫల భూరుహంబు
ఖం, డన మొనరించితిన్ గటకటా కడు మూర్ఖుడనైతి నేను నీ,
మనసిక నన్నుబట్టి బరిమార్తువొ బ్రోతువొ యేసునాయకా.

తాత్పర్యము

దేనితో సమానములేని మనోనెమ్మది సౌఖ్యము పోగొట్టుకొంటిని; నిత్యమయిన రక్షణకు సాధనమగు ధనరాశిని పాడుచేసికొంటిని; ధైర్యమును శ్రేష్ఠ

మైన ఫలములుగల వృక్షమును పడగొట్టివేసితిని; అయ్యయ్యో, బహు మూర్ఖు డనైపోతిని; నీ చిత్తము, ఇక నన్ను చంపుదువో, రక్షింతువో। యేసునాయకా॥

9. వీసము సేయరానిమెయి వీరడి సౌఖ్యముగోరి భద్రవి,
శ్వాసము పాడుచేసి విలసన్మృదు చిత్తము నల్లరాయిగా, జేసి
మహా పరాధములు చేసితి నీ సముఖంబునందు నా, దోసము
లెంచి నీ దయను దూరముసేయకు యేసునాయకా.

### తాత్పర్యము

దమ్మిడికయిన పనికిరాని పిచ్చిసౌఖ్యమును ఆశించి, మంగళప్రదమయిన విశ్వాసమును పాడుచేసికొని, చక్కని మృదువైన మనస్సును కఠినపరచుకొని, ఘోరపాపములు నీ యెదుట చేసితిని; నా పాపములు లెక్కలోకి తెచ్చి నీ దయచూప మానవద్దు। యేసునాయకా॥

10. ఆదరణీయమైన విమలాత్మయు నన్నెడబాసిపోయె జ్ఞా,
నోదయమైన దేవవచనోజ్వల దీప్తులడంగె మానసా, చ్ఛాదిత
మయ్యె నంధతమసంబు భవత్పద భక్తి వీడనా, కీ దురవస్థగూడె
నిక నెయ్యది నెమ్మది యేసునాయకా.

### తాత్పర్యము

ఆదరణకర్తయగు పరిశుద్ధాత్మ నన్ను విడిచిపోయెను, జ్ఞానమును వృద్ధి చేయు దేవుని వాక్యముయొక్క ప్రకాశత నాకు తగ్గిపోయెను; చీకటి నా మనస్సును కమ్మెను; నీ పాదములందలి భక్తి విడిచిపెట్టినందునగదా నాకీ దుర్గతి పట్టినది; నాకిక నెమ్మది యెక్కడిది। యేసునాయకా॥

11. కుటిలమనంబు గూర్చికొని కుంఠితబుద్ధి వహించి
మాయ లం, పట కపట ప్రవర్తనలు బాగుగనేరిచి నోట తేనె
హృ, ద్ఘటమున దుర్విషంబిడి వృథా నిజభక్తికి వేషమెత్తినే, గట
కట మోసపోతి నను గావవె యిప్పుడు యేసునాయకా.

## తాత్పర్యము

కపటమైన మనస్సుపెట్టుకొని, వంకరబుద్ధి నిల్పుకొని, వేషధారణతో కలిసిన కపటపు ప్రవర్తన పూర్తిగా నేర్చుకొని, నోటితో తియ్యనిమాటలు పలుకుచు హృదయములో విషముపెట్టుకొని, నిజమయిన భక్తిలేక వ్యర్థమయిన భక్తివేషము వేసికొని మోసపోతినయ్యా; నన్నిప్పుడు రక్షించు । యేసునాయకా॥

12. దబ్బరలాడి యాడి గురి దప్పిన మాటల గోడు చూపి
నీ, నిబ్బరమైన భక్తులను నీచులగా మదినెంచి మించినే, నుబ్బుడు
కాడనై గరువ మున్నతిజేయుచు పాపినైతి నా, యబ్బ త
వాంఘ్రి దాస్యమిపు డబ్బగజేయవె యేసునాయకా.

## తాత్పర్యము

బడాయి మాటలును, స్థిరములేని పలుకులును పలుకుచు, స్థిరవిశ్వాసము గల భక్తులను హీనముగా చూచుచు, ఎంతో గర్వముగలవాడనయి పాపము చేసితిని; ఓ తండ్రీ, యిప్పుడు నీ పాదసేవ నాకు దయచేయుమయ్యా । యేసునాయకా॥

13. ఎఱిగి యెఱింగి పాపము లనేకముజేయను మాటిమాటి
కిన్, పరుగులు వెట్టిపోతి తవ భక్తజనోత్తము లిచ్చు బోధలు,
న్వీరుచుచు నింద్రియార్థముల వెంటను నంటుచు బోయితి న్నహా,
నరకుడనై తుదింజెడితి నమ్మిక వీడితి యేసునాయకా.

## తాత్పర్యము

ఎన్నో పాపములు ఎరిగి బుద్ధిపూర్వకముగానే మళ్లిమళ్లి చేయుటకు పరుగెత్తిపోతిని, నీ భక్తశ్రేష్ఠులు చేయు ఉపదేశములు మీరి, దురాశల వెంట బడి పోవుచుంటిని, ఘోరనరక పాత్రుడనయితిని, చివరకు విశ్వాసము పోగొట్టుకొని చెడిపోతినయ్యా । యేసునాయకా॥

14. నమ్మినవారికెల్ల నపనమ్మిక నాయెడ గల్గజేసితిన్, నెమ్మది
నుండువారలకు నేత్రజలంబులు నిండజేసితిన్, కుమ్మరి సారెకైవ

డిని గ్రుమ్మరితిన్ మదినిల్పలేక నీ, సమ్మతమేమి నన్నికను
చంపెదో పంపెదో యేసునాయకా.

## తాత్పర్యము

నను నమ్మినవారికి నామీద నమ్మకములేకుండ చేసికొంటిని, విచారము లేకుండా నేను వారికి కన్నీళ్లు (దుఃఖము) కలుగజేసితిని, మనస్సు స్థిరముగా నుంచుకోలేక కుమ్మరివాని సారెవలె అటునిటు తిరిగితిని; నీ చిత్తమేమో, నన్ను చంపుదువో, రక్షింతువో । యేసునాయకా ॥

15. తప్పులులేనివారొకరు ధాత్రినిలేరని దేవవాక్యముం,
జెప్పుట నిక్క-మట్టి నర జీవులలోపల నాకు మించబల్, తప్పులు
సేయువాడొకడు ధారుణి నారయలేడు నేడు నా, తప్పులబాపి
నీ కరుణ దప్పక బ్రోవవె యేసునాయకా.

## తాత్పర్యము

తప్పులు చేయనివారు భూలోకములో లేనేలేరని దేవునివాక్యము చెప్పు మాట నిజమే; అట్టి నరులలో నాకంటె ఎక్కువ పాపములు చేయువాడు ఈ లోకములో మరియెవరు లేరు; అయితే ఈ దినము నా పాపములు పోగొట్టి నీ కృపచూపి రక్షించుము । యేసునాయకా ॥

16. సాధుజనావనా వినుము సజ్జన నిందితమైన విగ్రహా,
రాధకవంశ జన్ముడ నిరంతర పాపవిచార దుష్ట వి, ద్యాధిక నైపు
ణుండ చరితార్థములేని తమిస్రశాస్త్ర దు, ర్గాధల గ్రుంకినాడ
నను గావవె యిప్పుడు యేసునాయకా.

## తాత్పర్యము

సాధుజనులకు అధీనుడవైనవాడా. నా మనవి వినుము; సజ్జనులు నిందించు విగ్రహారాధనచేయువారి వంశమున బుట్టినవాడను, ఎల్లప్పుడు పాపపు ఆలోచనలను చెడువిద్యలో బహు నేర్పుగలవాడను, మెచ్చుకొన దగినదికాని పాపాంధకారపు శాస్త్రపు గాథలలో మునిగినవాడను, ఇప్పుడు నన్ను రక్షించుమయ్యా । యేసునాయకా ॥

17. పువ్వుల దోటలో బెరుగు బూరుగ వృక్షము భంగి నందమా, గువ్వలమందలో మెలగు ఘూకము పోల్కి త్వదీయ సంఘమం, దివ్విధముండి నేను కపటేచ్ఛలకాలము బుచ్చి యకటా, నెవ్వల పాలుగాబడుచు నీచతనొందితి యేసు నాయకా.

### తాత్పర్యము

పువ్వులవనములో పెరిగే బూరుగచెట్టువలెను, చక్కని గువ్వలగుంపులో చేరిన గుడ్లగూబవలెను, నీ సంఘములో నేనుంటిని; కపటపు ఆశలలో నా కాలముగడుపుచు కష్టములపాలయితిని, ఇతరులవల్ల నీచముగా నెంచబడితిని; అయ్యయ్యో। యేసునాయకా॥

18. పొల్లుల మూట విప్పు గతి భూజనులెంచిరి నా చరిత్రమున్, కుళ్లిన మాంసరాశిగతి కొందరికయ్యె మదీయ కృత్యముల్, ముల్లుదు సిల్లు రీతి బుధ ముఖ్యులలో మమ నామమిట్లునే, నెల్లిదమైతి నక్కట మహీజనమంతికట యేసునాయకా.

### తాత్పర్యము

నా ప్రవర్తనను లోకులు ఎందుకు పనికిరాని పొల్లుగా భావించిరి, కొందరికి నా పనులు మురిగిపోయిన మాంసమువలె అసహ్యముగా తోచెను; సజ్జనులలో నా పేరు అంటే గసికముల్లు గుచ్చుకొన్నట్టు కష్టముగానుండెను; లోకములోని జనులకందరికి నేను అసహ్యుడనైపోతిని, అయ్యో। యేసు నాయకా॥

19. వాకిటికుళ్లు పెంటగతి వర్జితమై బడు కసుకురీతి యీా, లోకమునందు నీ కృపకు లోబడు క్రైస్తవ లోకమందున, స్వీకరమైతి నన్ను వెలిచేసిరి యింకెటు వోదునయ్యరా, వే కరుణా నిధీ మనుపవే శరణార్థిని యేసునాయకా.

## తాత్పర్యము

ఇంటివాకిట పారవేయబడి మురిగిపోయిన పెంటవలెను, కక్కిన ఆహారమువలెను నేను ఈ లోకమునందు నీ కృపపొందిన క్రైస్తవ జనులకు వారితో చేర్చుకొన నర్హుడను కాకపోతిని; వారు నన్ను తమలోనుండి వెలివేసిరి; ఇక నే నెక్కడికి బోదునయ్యా, కృపాధారుడా, రావయ్యా, నీ శరణుగోరి వచ్చిన నన్ను బ్రతికించుమయ్యా । యేసునాయకా ॥

20. హా యిక నేమిసేయుదు మదంతర నేత్రము మ్రోల
రేబగల్, బాయక నన్మదీయమగు పాపము రూపము దాల్చి
నిల్చెన, య్యో యిది బారదోల నెవరోపుదు రెయ్యది దిక్కు
నాకు స్వా, పాయము నీవె నీ సిలువ ప్రాపకమే గతి యేసు
నాయక.

## తాత్పర్యము

అయ్యో, యిక నేనేమి చేతును? రాత్రింబగలు నా మనోనేత్రము ఎదుట నేను చేసిన పాపము స్వరూపముతో వచ్చి విడువకుండా నిలిచి యున్నది. దీనిని పారదోలుటకు ఎవరిచేత నవును? నా కెవరు దిక్కు! నీవే నాకు ఆధారము; నీ సిలువయే నాకు శరణ్యము । యేసునాయకా ॥

21. మెట్టల దొంతి చీమ తల మీదను పాదుగ నున్న
రీతిని, ట్టట్టు మెదల్పరాని మరణాయత దుష్కృత భూరి భార
ము, న్నట్టిమదీయ మానసము పై భరమోర్వగలేక బొబ్బలు,
న్బెట్టుచు నిన్ను జేరితిని విశ్రమమియ్యవె యేసునాయకా.

## తాత్పర్యము

చీమ తలమీద కొండమీద కొండ పేర్చి పెట్టినట్టుగా ఇటునటు కదలింప వీలుగాకుండా మరణ కరమయిన పాపముల భారము నా మనసుమీద పడి అణచుచున్నది, ఈ భారము మోయలేక మొరపెట్టుచు నీ కడకు వచ్చి చేరితిని; నాకు విశ్రాంతి దయచేయుము । యేసునాయకా ॥

22. ఉల్లము దల్లడిల్లె మది నోపని తాపము మోపు
లయ్యె వ, ర్థిల్లెనూన దుఃఖములు దీనదశల్ బసకట్టి నిల్చె
నా, కెల్లెడ మృత్యుహేతువయి తిప్పుడు నన్విడి పొమ్ముపావ
మా, ఒల్లనటంచు జెప్పియిట వచ్చితి బ్రోవవె యేసునాయకా.

### తాత్పర్యము

నా మనస్సు గాబరా పడెను; భరింపలేని సంతాపము మనస్సులో పుట్టుకొని వచ్చెను, విస్తారములయిన దుఃఖములు నిండుకొనెను; నీచత్వము నిలువరముగా నాకు ప్రాప్తించెను; ఓ పాపమా, ఎటు చూచినను చావే నాకు తెచ్చిపెట్టితివి; ఇక నన్ను విడిచిపెట్టి పో, యిక నీవు నాకు వద్దని చెప్పి నీ సన్నిధికి వచ్చితిని। యేసునాయకా॥

23. ఎడతెగరాని మోహలత లెక్కుడు దుర్మతి వృక్ష
మూలమం, దెడనెడబుట్టి చుట్టుకొని యెల్లెడ శాఖల నల్లెనం
దులో, చెడుగుణ పక్షులుం బసలు చేసెను దాని భవత్కృపా
సిచే, వడిబడ ద్రుంచి నీ నెనరు వహ్నిని గాల్చవె యేసు
నాయకా.

### తాత్పర్యము

ఇన్నన్నియని చెప్ప నలవిగాని ఆశలనే తీగలు పాపస్వభావమను వృక్షముయొక్క వేరునుండి పుట్టి ఆవరించి నలుదిక్కుల కొమ్మలుగా వ్యాపించెను; ఆ కొమ్మలలో దుర్గుణములను పక్షులు నివాసము చేయుచున్నవి; ఆ వృక్షమును నీ కృప యను కత్తితో శీఘ్రముగా నరికి పడగొట్టి నీ ప్రేమ యను అగ్నితో కాల్చివేయుమా। యేసునాయకా॥

24. పాపములన్నిట న్నిగుల పాపము క్రీస్తు మదీయ
పాపము, న్బాపగనోపడంచు నపనమ్మిక జెందుటయే నితాంత
మా, పాప మిదేయటంచు నొక భక్తుడు చెప్పినదాలకించి నీ,
ప్రాపున జేరవచ్చితి కృపామతి బ్రోవవె యేసునాయకా.

### తాత్పర్యము

పాపములలో మహా పాపము క్రీస్తు ప్రభువు నా పాపమును పోగొట్ట లేదన్న అవిశ్వాసమే, యిదే ఘోరపాపమని యొక భక్తుడు చెప్పిన మాట విని నీ శరణు గోరి వచ్చితిని కనికరముతో నన్ను రక్షించు । యేసునాయకా ॥

**25. మనుజుల చోట నాకపట మార్గమెరుంగగ నీక మద్భ్రమన్, అనుగతి జేయునట్లు జగదంతర జీవుల భావనల్ సదా, గనుగొనునట్టి దేవునికి కన్నులు మూసి భ్రమింప వచ్చునే. యిన రుచి మూయబోయిన తమిస్రము లేమగు యేసునాయకా.**

### తాత్పర్యము

మనుష్యులయెదుట నా మోసకార్యములు కనబడకుండా చేసినట్టు చేయ గలనని భ్రమపడి జగత్తులోనున్న జీవుల ఆలోచన లెల్లప్పుడు చూచుచున్న దేవునికి కానరాకుండా చేసి మోసము చేయగలనా! సూర్యుని ప్రకాశమును మూసివేయబోవు చీకటి యేమగును? । యేసునాయకా ॥

**26. ఇల నెటువంటి విత్తనము విత్తునో మానవుడట్టి సస్యమా, ఫలములె కోసికూర్చుకొను పల్మరు నేను శరీరవాంఛ వి, త్తులు వెదజల్లినాడ కడు దుఃఖ ఫలంబులు గోసి కూర్చుకో, వలసెను అయ్యయ్యో యెరిగి వహ్నొడి గట్టితి యేసు నాయకా.**

### తాత్పర్యము

లోకములో మనుష్యుడు ఏ విత్తనములు విత్తునో, ఆ పంటయే ఆ పండ్లే కోసికొనునుగదా? అటువలెనే శరీరాశలనే విత్తులు వెదచల్లియున్నాను గనుక దుఃఖము కలిగించు ఫలములే అనుభవింపక తప్పదు, అయ్యయ్యో, యెరిగి యుండే నిప్పు ఒడిలో కట్టుకొంటినయ్యా । యేసునాయకా ॥

27. దినకరుడంబరంబున సదీధితుడై వెలుగొందు నత్తరిన్, కనుగవ మూసికొంచు పథి గానక బోయి యొకండు కూపమం, దున బడె దోసమిం కెవరిదో యిటులైతిని నేన కాదె నీ, యనుపమ బోధ త్రోసి మనసంధత జేసితి యేసునాయకా.

### తాత్పర్యము

సూర్యుడు ఆకాశమున పైకెక్కి తీక్షణముగా వెలుగుచున్న సమయమున నొకడు రెండు కండ్లు మూసికొని దారిగానక బావిలో పడినయెడల తప్పు ఎవరిది? నేను అట్టి పని చేసినవాడనైతిని; నీ మహా శ్రేష్ఠమయిన బోధ త్రోసివేసి నా మనస్సును చీకటిగా చేసికొంటిని గదా । యేసునాయకా ॥

28. విలువ యొనర్పరాని బలు విద్రుమమొక్కటి యిచ్చి నల్లబొ, గ్గులు గొనురీతి నీ ప్రణుత కోమల పాదములంటి భక్తిచే, జెలగెడు మన్మనోమణి నొసంగి పిశాచికి నింద్రియార్థ దు, ష్ఫలములు గొంటి నే నకట చచ్చుట గానక యేసునాయకా.

### తాత్పర్యము

ఇంతయని ఖరీదు కట్ట సాధ్యముగాని మహా దివ్యమయిన వజ్రమునిచ్చి దానికి బదులు నల్లని బొగ్గులు తీసికొన్నట్టు నీ స్తోత్రార్హమయిన పాదములకు సేవ చేయు భక్తితో నిండిన నా మనస్సు అనే వజ్రమును సాతానుకిచ్చి యిహ సుఖమనే కొరగాని ఫలములను తీసికొంటినే, దీని కంతము మరణమే యని యెరుగక పోతినే, అయ్యో । యేసునాయకా ॥

## మనుష్యుని అనిత్యత

29. పురుగుల చెత్తరోగముల పుట్టిన యిల్లు మలాది కిట్టముల్, దొరగెడి మోటికుండ బహు దుఃఖలతాలికి కుంకుమేరు భీ, కర దురితాలవాలము వికారగుణంబుల కాటపట్టు

పై, న్నరముల వృక్ష మీ తనువు నమ్మునె భక్తుడు యేసు నాయకా.

### తాత్పర్యము

ఈ శరీరము పురుగులతో నిండిన చెత్త, రోగములకు పుట్టిల్లు, మల మూత్రాదులయిన పెంట పదార్థములు కారుచుండే ఓటికుండ, లెక్కలేని దుఃఖములకు మూలమైనది, భయంకరమైన పాపములకు సాధనమయినది, చెడు గుణములకు ఆధారమయినడి; పెద్దనరములు కొమ్మలవలె నుండు వృక్షము; భక్తుడైన వాడు ఇట్టి శరీరమును నమ్ముకొనునా! । యేసునాయకా ॥

30. చంచల తుల్యమైన యిహ సౌఖ్యము గోరి నరుండు గర్వముం, బెంచి మదించి తన్ను తన మేనినిగా దలపోయు గాని నే, త్రాంచల మెత్తి చూడడు తరాతరముల్గడ తేరుటల్ మరో, క్కించుక సేపులో తనకు మృత్యువు డాయుట యేసు నాయకా.

### తాత్పర్యము

ఏ మాత్రము స్థిరముకాని యీ లోక సుఖమును కోరి మానవుడు గర్వించి మదమెక్కి, తన శరీరమే తానైనట్టు ఆలోచించును, గాని తరము తర్వాత తరము గడిచిపోవుచున్నదని, మరికొంచెము కాలమునకు తనకే మృత్యువు సంభవించునని కన్నెత్తి చూచి ఆలోచింపడు । యేసునాయకా ॥

31. ఒక నిమిషార్థకాలమున నూపిరి యేపుదొలంగు నంతకు, త్తుక కఫవాత పిత్తములతోడను గుర్గురు పెట్టి యింటివా, రొక రెలుగెత్తి బిల్చిన నోహూయని బల్క నశక్యమా నోకిం, చుక తరి జచ్చు మర్త్యుడతి చుల్కన జీవుడు యేసునాయకా.

### తాత్పర్యము

ఒక అరనిమిషములో ఊపిరిబలము తగ్గిపోయి, గొంతులో కఫవాతము ప్రవేశించి గురుగురు ధ్వని పుట్టినప్పుడు, ఇంటిలో ఎవరైన ఎంత బిగ్గరగా పిల్చి

నను ఒహో యని మారుపల్కనేరదుగదా, కొంచెము సేపులో మానవుడు చచ్చిపోవువాడని, వాని జీవమెంతో అల్పమయినదని గ్రహించడే। యేసునాయకా॥

32. శిరిగలనాడు పేదలకు జేసెడు మేలు దలంపలేక
కా, వరమున విశ్రమీగు ధనవంతుడు రోగి దరిద్రు లాజరుం,
బరువడి బిల్వడే నరక బాధలగుందెడు వేళ కాల మెం, వ్వారికిని
హెచ్చుతగ్గు లిరువంకలనుండవె యేసునాయకా.

తాత్పర్యము

భాగ్యమున్న దినములలో బీదలకు చేయఁగల మేలు నాలోచించక పొగరుతో ఒళ్లుమరచిన ధనవంతుడు నరకబాధతో శ్రమపడుచున్నప్పుడు, రోగముతో బాధపడిన దరిద్రుడగు లాజరును మరీమరీ పిలువలేదా? ఎంతవారికిని మంచికాలము కష్టకాలము రెండు విధములుగ నుండునుగదా। యేసునాయకా॥

33. సోదరవిత్తపత్ని సుత సుందరమందిర వాసియయ్యు
వ, న్నోదర సౌఖ్యముల్గది వినోదముసేయ బ్రమత్తుడై నరుం,
డాదటవచ్చు వార్థికమటావలి మృత్యువు జాడ జూడక, న్వేదు
రుడై చెడుం దుదిని నీదయగానక యేసునాయకా.

తాత్పర్యము

సహోదరులు, ధనము, భార్య, బిడ్డలు, చక్కని యిల్లుగలవాడైయుండి కడుపుకు మంచి యన్నము మనస్సుకు సంతోషములు కలిగియున్నందున మదించినవాడయి యున్నప్పుడు కొంచెముకాలము తర్వాత ముసలితనము వచ్చునని ఆ మీదట మృత్యువువచ్చునని ఆలోచింపక పిచ్చివాడై నీ దయ నెరుగకయే చివరకు చెడిపోవును। యేసునాయకా॥

34. ఎల్లియొ నేడొ లేక పదియేడులనో మృతి సిద్ధ
మంచు దా, నుల్లములో నెరింగి నరుడుబ్బుచు తన్నెద మెచ్చు
కొంచుమ, త్రిల్లుచు మత్సరించుచు కృతిస్తుతిగోరుచు నిట్లు
కాలముం, జెల్లుగ జేయుగాని నిను జేరనుగోరడు యేసునాయకా.

### తాత్పర్యము

రేపో యీ దినమో లేక పదియేండ్లకో చావు తప్పదన్నమాట మనస్సులో ఎరిగియుండియు మానవుడు గర్వించుచు (తనంత వాడు లేడుగదా యని) మనస్సులో అతిశయపడుచు మదముతోను మాత్సర్యముతోను నిండుకొని, కవులు తన్ను పద్యములతో స్తుతించవలెనని గోరుచు—ఈలాగు కాలము వెళ్లబుచ్చునే గాని నీ చెంత జేరగోరడు । యేసునాయకా ॥

35. నిద్దురవేళ గాంచు కల నిక్కముగాని తెరంగున
న్గడున్, ప్రొద్దుటి మంచుబిందువుల పోడుములుండని రీతి
మోముపై, నద్దమొకింత నేపిడిన యట్టిహ సౌఖ్యములన్నిబోవు
నీ, యొద్దనె గల్గుగాదె సతతోన్నత సౌఖ్యము యేసునాయకా.

### తాత్పర్యము

నిద్రలో కన్న కల నిజము కానట్లును, ప్రొద్దుటి పూట కురియుమంచు హరించిపోయినట్లును, అద్దములో ముఖము చూచుకొని వెంటనే మరచిపోయినట్లును, ఈ లోక సౌఖ్యములన్ని మాయమైపోవును; నిత్యముండు శ్రేష్ఠమయిన సౌఖ్యము నీ సన్నిధియందె దొరకునుగదా । యేసునాయకా ॥

### పాపమువలని దుర్గతి

36. పాపము సేయువేళ నది పండుగగా గనుగాని వెన్క
సం, తాపము హానిదుఃఖము సదామతిచింత జనాపవాదమే,
వైపున జూడసిగ్గు బుధవర్గములో తలవంపులిట్టి పె, ల్లాపద
లొండుటల్ గనడహో నరుడాత్మను యేసునాయకా.

### తాత్పర్యము

పాపము చేయు సమయమున అది పండుగగా (సంతోషముగా) నుండవచ్చును గాని తర్వాత మనస్సులో మంట, విచారము ఎల్లప్పుడు మనస్సుకు బాధ జనులవల్ల దూషణ ఎటుచూచినను అవమానము, సజ్జనులమధ్య తలవంపు ఈ మొదలైన కష్టనష్టముల నాలోచించడే నరుడు । యేసునాయకా ॥

37. ఆకలిగొన్న బెబ్బులికి నబ్బిన దూడవిధంబు దుష్టద,
ర్వీకర భీకరోగ్రముఖ పీడిని బాధితమైన దీనమం,డూకము
భంగినెట్టి నరుడు న్విరహజ్వర పూరితాన్య కాం,తాకరవశ్యు
డైన నికదప్పునె దుర్గతి యేసునాయకా.

తాత్పర్యము

ఎంత గొప్పవాడైనను మోహమనే జ్వరముతోనిండిన పరస్త్రీచేతిలో చిక్కినట్టయిన, ఆకలిగొనియున్న పెద్దపులికి దొరికిన దూడవలెను విషసర్పము యొక్క భయంకరమైన నోటిలోచిక్కి బాధపొందుచున్న నీరసమగు కప్ప వలెను ఉండును; అట్టివానికి దుర్గతితప్పునా । యేసునాయకా ॥

38. శ్రేయస హాని తేజము సుశీలము బాయు యశంబు
మాయు న, న్యాయము జేరు నింద యపహాసము దూషణ ప్రాణ
హాని యా, దాయము బోవు దుర్దశకు తావగు నిట్టి పరాంగ
నాసుఖో, పాయము గోరువాని కెడబాయునె దుర్గతి యేసు
నాయకా.

తాత్పర్యము

ఇటువంటి పరస్త్రీసంగమ సుఖము కోరువానికి క్షేమము పోవును; ముఖములో తేజస్సు మంచిస్వభావము వాని విడుచును, కీర్తి నశించును, అన్యాయము ప్రాప్తించును; నింద, నలుగురిలో నగుబాటు, దూషణ, ప్రాణహాని సంభవించును, ధనము నష్టమవును, దుర్దశ వానినిపట్టి పీడించును; వానికి దుర్గతి తప్పునా । యేసునాయకా ॥

39. అంతములేని చింతలు నితాంతముగా జనుదెంచు
చున్న పె, న్వింతలదొంతులై బెనగు వేడ్కయు నెమ్మదియుం
దొలంగు న, భ్యంతర మంతరింద్రియ సుభక్తికి చాటగు నన్య
కాంతతో, మంతన మాడువానికి సమస్తము కీడగు యేసు
నాయకా.

### తాత్పర్యము

చాటున పరస్త్రీతో సహవాసము చేయువానికి లెక్కలేని విచారములు ఎడతెగక రాసులుగావచ్చి బాధించును, సంతోషమును మనస్సులో నెమ్మదియును పోవును, ఆత్మలోనుండు మంచి భక్తికి అభ్యంతరము కలుగును; సమస్తము కీడేయగును । యేసునాయకా ॥

40. సారవిహీన దుష్టజన సంగతిగోరు పవిత్రసత్య వా,
గ్ధోరణి దూరమై చను హితుండహితుండగు శాస్త్రరీతి ని, స్సా
రము జూచు క్రూరమగు చావునకైన దెగించు నన్యకాం, తా
రతు డెవ్వడాతనికి దప్పునె దుర్గతి యేసునాయకా.

### తాత్పర్యము

పరస్త్రీతో పోవువాడు ఎందుకు కొరగాని దుష్టుల సహవాసము కోరును, పవిత్రమయినట్టి, నిజమయినట్టిమాటలు పలుకు అలవాటు మానును, మిత్రుడు శత్రువగును; దేవునివాక్యబోధ వానికి రుచించక చప్పనగానుండును, క్రూరమైన చావునకైన తెగించును; అట్టివానికి దుర్గతితప్పునా । యేసునాయకా ॥

41. గాలము మ్రింగుగాక తన కాలము నేలెడు మృత్యు
నాలుకన్, కేలిడుగాక దావశిఖి కీలజొరం జనుగాక యుగ్రకా,
కోలము గ్రోలుగాక పెరకోమలి కామవికారచాటువా, చాల
తలందు జిక్కని విచారుడె ధీరుడు యేసునాయకా.

### తాత్పర్యము

గాలమును మ్రింగవచ్చును, తనకు మరణమెప్పుడు రావలెనో నియమించు మృత్యుదేవత నోటిలో వేలుపెట్టవచ్చును, అడవి చిచ్చుమంటలో ప్రవేశించవచ్చును, భయంకరమైన కాలకూట విషము త్రాగవచ్చును.

[ఇట్టి పనులుచేసిన చేయవచ్చును. అట్టి పురుషుడు ధీరుడుకాడు.]

అన్యస్త్రీయొక్క మోహపుచేష్టలలోను మాటలలోను చిక్కని మనస్సుగలవాడే ధైర్యశాలి । యేసునాయకా ॥

42. మృదువులు గావుగా హృదయముల్ ఒనగూడెడు
భక్తి రత్నముల్, పదిలముగావుగా యితర భామలజేరినవారి
కాపదల్, కొదువలు లేవుగా విమల కోమల రమ్యమనః ప్రశాం
తమా, పదవులు బోవుగా నిరయ బాధలటావల యేసు
నాయకా.

## తాత్పర్యము

పరస్త్రీతో సాంగత్యము చేయువారికి హృదయములు కఠినమవునేగాని మృదువుగా నుండవు, మనసులో పోగయ్యే భక్తిరత్నములు భద్రముగా నుండవు, అట్టివారికి ఆపదలకు తక్కువయుండదు, బహు దివ్యమయిన మనశ్శాంతి యానందము మొదలైనవి క్షీణించి పోనేపోవును; చిట్టచివరకు నరక వేదనలు ప్రాప్తించును । యేసునాయకా ॥

## మనసు చంచలము

43. ఏ పనిలేకనే పరుగులెత్తుచు నొక్కొకచోట నిల్చిన,
ల్వైపుల నిక్కి చూచుచు నిలాతలి గ్రుమ్మరు కుక్కరీతి నా,
పాపమనంబు నిల్వదొక పజ్జనికన్ భవదంఘ్రులొద్ద సం, స్థాపన
చేసి నీ నెనరు త్రాటను గట్టవె యేసునాయకా.

## తాత్పర్యము

ఏ పనిలేకపోయినను వెర్రిపరుగులెత్తుచు ఒక్కొక్కచోట నిల్చి యీ తట్టు ఆ తట్టు వెర్రిచూపులు చూచుచు భూమిమీద తిరిగే కుక్కనుబోలి నా పాపపు మనస్సు ఒకదానిమీద నిలువలేక తిరుగుచుండును; యేసునాయకా నీ పాదములవద్ద నన్ను నిలిపి నీ ప్రేమయను పగ్గముతో కట్టిపెట్టుము స్వామీ!

44. మనసును బట్టి నిల్ప తన మానసమే బురికొల్పు నెట్ల
నం, గనలెడి వెర్రికుక్క మెడ గట్టగబోయిన నూలిప్రోగు
భం, గిని జనుగాదె వ్యర్థమయి కేవల నీ కరుణాంకుశంబుచే,
కొనక మనోమద ద్విపము గూడునె కట్టను యేసునాయకా.

## తాత్పర్యము

తన మనస్సును తానే నిల్పుకొనగలడనుట యెటువంటిదంటే, కోపముతో మండిపడు పిచ్చికుక్క మెడను నూలుపోగుతో కట్టితే నిష్ప్రయోజనమై పోవునుగదా; కాబట్టి నీ కరుణయను అంకుశముతో నా మనస్సనే మదపుటేనుగును స్వాధీనముచేసికొంటే నే దాని కట్టవచ్చును। యేసునాయకా॥

## విగ్రహారాధనాదుల వ్యర్థత

45. దురితములోన బుట్టి బహు దుర్జన సంగతి పెంపు
జెంది దు, శ్చరితపు వెజ్జువేల్పులకు సాగిలి విగ్రహభక్తి జేసి ము,
ఖ్యరుడయి దుస్స్వభావపు వశంబగు పాపినరుండు పుణ్యమే,
తెరగున జేయు నీతి సుపథం జననేర్చునె యేసునాయకా.

## తాత్పర్యము

పాపములోపుట్టి, బహు దుష్టులతో సహవాసముజేసి దుష్టదేవతలను మ్రొక్కి విగ్రహారాధనచేసి మూర్ఖుడయిపోయి పాపస్వభావమునకు లోనయిన పాపాత్ముడు పుణ్యమేలాగున చేయగలడు! మంచి నీతిమార్గమున నడువగలడా?। యేసునాయకా॥

46. ఇల దెగిపడ్డ వృక్ష మొరు లెత్తకయున్న దనంత లేచు
నా, విలసిత ప్రాణవాయువులు వీడిన పీనుగయుం దనంతనే,
చలనము నొందునా, దురిత జాలములో బడి చచ్చు మూర్ఖ
జీ, వులకును నీవులేని యసువుండిన నేటికి యేసునాయకా.

## తాత్పర్యము

నేలమీద విరిగిపడియున్న చెట్టు నితరులెత్తకపోతే తనంతట తానే లేచి నిలువగలదా? ప్రసిద్ధమయిన ప్రాణవాయువులు పోయిన పీనుగ తనకు తానే కదలునా? పాప సమూహములో పడి చచ్చియున్న మూర్ఖనరులు నీవిచ్చు జీవము లేనప్పుడు ఎంత ప్రాయముండిన నేమిలాభము। యేసునాయకా॥

47. ఇలను సమస్త పాపముల కెక్కువ పాపము విగ్రహం
బుపై, దలపిడి పూజసేయుటలు దానన జేసి వివేకశూన్యమై,
వెలుగు దొలంగి యాత్మ తమ వేష్టితమై చెడిపోయి పాపము,
గ్గలమగుగాని జీవనసుఖం బెదగాంచునె యేసునాయకా.

### తాత్పర్యము

లోకములో పాపములన్నిటికంటె మహాపాపము విగ్రహములమీద మనస్సు నిలిపి పూజచేయుటయే; అట్లు చేయుటచేత వివేకముపోవును, ఆత్మకుండు జ్ఞానము నశించి అంధత్వము వ్యాపించి చెడిపోవును; పాపమే వృద్ధి యగునుగాని మానవుడు హృదయములో నీవిచ్చు జీవనసుఖము అనుభవించునా। యేసునాయకా ॥

48. కనవినరాని బొమ్మలకు కానుకలిచ్చుచు లెమ్ము చూ
డునా, మనవిదె యాలకించుమని మర్త్యులనేకులు వెర్రిబుద్ధి
గై, కొని కడలేని దుర్దశల కూపములో బడియున్నవారు న,
న్మనిపిన యట్లవారల మనంబులు ద్రిప్పవె యేసునాయకా.

### తాత్పర్యము

చూడలేని వినలేని బొమ్మలకు కానుక లర్పించి—లేచి చూడు ఈ నా మనవి వినుము అని యెంతోమంది మనుష్యులు పిచ్చిపట్టిన మనస్సుతో చెప్పుచు అపరిమితమైన దురవస్థలో పడియున్నారు; నన్ను నీవు రక్షించినట్టు వారి మనస్సునుకూడా మార్చి రక్షించుము। యేసునాయకా ॥

49. లోకపు చైవుల న్విడిచి లోన జరించెడు నాత్మ జూతు
నన్, పోకిళులందు బోయి తన బుద్ధిపయిన్ భరముంచు మాన
వుం, డేకొలదైన జీవసుఖ మించుక లేక నశించుపాప మం, గీకర
మాత్రలేక నిను కీర్తనసేయక యేసునాయకా.

### తాత్పర్యము

ఈ లోకపు చర్యలన్ని విడిచి (యోగులయి) తమలోనున్న ఆత్మను చూడగలమను భ్రమను పెట్టుకొని తన బుద్ధిబలమునే ఆధారముచేసికొను

మానవుడు ఎంతమాత్రము నిజమైన సుఖముగల బ్రతుకు ఎరుగక, తన పాప స్థితి నొప్పుకొనక, నీ నామకీర్తన చేయక నశించిపోవుచున్నాడు। యేసు నాయకా॥

50. పాపముసేయు వేలుపుల ప్రాపున జేరెడు పాపులెట్ల
నం, దూపరిచేత బోయి తమ తుండ మగాధ మనీరమైన దు,
ష్కూపము జేర్చి తత్తరను గూలి నశించెడు వారి భంగి వా,
రేపగిదిన్ విముక్తి సుఖమెన్నడు గానరు యేసునాయకా.

తాత్పర్యము

పాపకార్యములు చేసిన దేవతల నాశ్రయించిన పాపాత్ము లెట్టివారనగా దాహముగొనిన యేనుగు (నీళ్లున్నవన్న భ్రమచేత) నీరులేనిది, మిక్కిలి లోతయి వది పాడుపడియున్న బావియొద్దకు బోయి ఆత్రముతో తన తొండము పెట్ట బోయి దానిలో పడి నశించునుగదా; అదేరీతిని వారికి మోక్షసౌఖ్యము దొరకనే దొరకదు। యేసునాయకా॥

51. విమల నదీ జలంబులు సమీపమునం బ్రవహింపు
చుండ దా, హము గొనలేక వెర్రి మనుజాధముడద్దరి నుయ్యి
ద్రవ్వి నీ, రము గొనబోవునట్లు మధురంబగు నీ స్తుతి మాని
మూఢ దై, వముల నుతించబోవుట లవస్యము చావగు యేసు
నాయకా.

తాత్పర్యము

నిర్మలమయిన యుదకము నదిలో తనకు దగ్గిరగా పారుచుండగా దాని త్రాగి దాహము తీర్చుకొనుటకు బదులు, వెర్రివాడయి ఆ ప్రక్కను గుంట త్రవ్వి నీళ్లు త్రాగబోయిన బుద్ధిహీనునివలె కొందరు ఆనందకరమైన నీ స్తుతి విడిచి మూఢదేవతలను స్తుతించుచున్నారు; అట్టివారి గతి ఆత్మనాశనమే గదా?। యేసునాయకా॥

## నరకము తప్పించుకొను సాధనము

52. నిరయ నితాంత సంతమస నిర్గత ధూమ సముగ్రవహ్ని
పా, గర భరితోగ్ర వీచికలు గప్పెడి కాలముదప్ప నిప్పుడే, నర

గున బోయి మానసము సజ్జన క్రైస్తవ గోష్ఠినుండినన్, చిరసుఖ
మాత్మకబ్బు తుది జేకురు మోక్షము యేసునాయకా.

### తాత్పర్యము

నరకమునందలి యెడతెగని చీకటిలోనుండి బైలుదేరే పొగతో కూడిన అగ్ని సముద్రములోనుండు భయంకరమైన అలలు ఆత్మను కప్పివేయు సమయము రాకముందే యిప్పుడే శీఘ్రముగా వెళ్లి మనుష్యుడు తన మనస్సును, సత్క్రైస్తవుల సహవాసమున చేర్చినయెడల నిత్యమగు సుఖము ఆత్మకు లభించును, చివరకు పరలోకము ప్రాప్తించును। యేసునాయకా॥

## సత్యమైన ప్రాయశ్చిత్తము

53. కనుగొనల న్నిరంతరము గారెడు నీరము వేరుచేసి
నా, తనువు సమస్తముం దరిగి ధైర్యత వహ్నిని వ్రేల్చునీ పరా,
మననము నాకు గల్గినను పాపమొకించుక బాయునే భవ, త్తను
మృతికర్త దివ్య సుకృతంబొనగూడక యేసునాయకా.

### తాత్పర్యము

నా కన్నులనుండి యెల్లప్పుడు పాపమునుగూర్చి విలాపముతో కన్నీరు పారుచుండినను, నా శరీరమంతా ఖండించి తెగువచేత అగ్నిలో హోమము చేసేటంత త్యాగబుద్ధి కలిగినను, నీ మరణముయొక్కయు రక్తముయొక్కయు పుణ్యము సంపాదించుకొననియెడల నా పాపము లేశమయిన పోవునా! యేసు నాయకా॥

54. పరమ పవిత్రమున్ పతిత పావనపుణ్య నిధానమైన
నీ, కర చరణారవిందముల గారెడి రక్తములో మునింగి నా,
నెరి దురితంబులం దొలగి నెమ్మది సౌఖ్యము గల్గి నీ కృపా,
శరధిని వాలలాడి తుద సద్గతి నొందెద యేసునాయకా.

### తాత్పర్యము

మిక్కిలి పవిత్రమును పాపులను పుణ్యాత్ములనుగా చేయు సాధనమైన తామరపువ్వువలె మృదువయిన నీ హస్తములనుండి పాదములనుండి స్రవించిన

రక్తమునందు నా యాత్మ మునిగి నా విస్తారపాపములను పోగొట్టుకొన్నందు వనే నాకు మనశ్శాంతి కలుగుచున్నది, ఇకమీదట నీ కృపాసముద్రములో ఈదులాడుచు జీవించి తుదకు మోక్షములో చేరెదను। యేసునాయకా॥

55. ప్రేమను మానవాకృతి ధరించుట శాశ్వత రాజ్య సౌఖ్యముల్, ప్రేమను వీడివచ్చి కడుపేద మనుష్యుని యింట జన్మమున్, ప్రేమను దోసకారులను బిల్చుట నమ్మినవారి పాపముల్, ప్రేమను మోసి నీ తనువు ప్రేమను వీడుట యేసు నాయకా.

### తాత్పర్యము

నీవు నీ ప్రేమాతిశయముచేతనే నరరూపము దాల్చితివి; ఆ ప్రేమను బట్టియే మోక్షరాజ్యమందు నీకుగల నిత్యసౌఖ్యమును మహిమను విడిచిపెట్టి కడు బీదవానియింట బుట్టితివి; ఆ ప్రేమతోనే పాపాత్ములను నీయొద్దకు రమ్మని పిల్చితివి; నిన్ను నమ్మి వచ్చినవారి పాపములను భరించి నీ శరీరము వర్పించితివి। యేసునాయకా॥

56. ప్రేమసుధానిధీ సకల ప్రేమల సారములోని నిగ్గు నీ, వైమహిలోన పాపినరవర్గము గావను వచ్చినావు నీ, ప్రేమ దలంచ నా తరమె బీదగు నీదగు శిష్యులందు నీ, ప్రేమను జూప కాళ్లడుగవే ప్రియమొల్కగ యేసునాయకా.

### తాత్పర్యము

ఓ ప్రేమామృతమునకు ఊటయయినవాడా, ప్రేమ యెన్నెన్ని విధములుగా నుండగలదో వాటన్నిటిలోను మహా శ్రేష్ఠమయిన ప్రేమాస్వరూపివై యీ లోకములోని పాపికోటిని రక్షింపవచ్చినవాడా, నీ ప్రేమ యిట్టిదని వివరించుట నా తరమా, కడుపేదలయిన నీ శిష్యులయెడల నీకుగల ప్రేమాతిశయము చూపుటకు వారి పాదములు కడిగితివిగదా। యేసునాయకా॥

57. నీ మరణంపు మ్రానిదెస నిశ్చలదృష్టులు నిల్పువాడు నీ, ప్రేమరసంబు గ్రోలి మది బీటలువారి వినమ్రుడై భవ,

న్నామము నెంచుచుం దనువునం బులకాంకురముల్ చెలంగ ని,
ష్కామ సుభక్తి మానస సుఖంబున వర్ధిలు యేసునాయకా.

### తాత్పర్యము

నీవు మరణముపొందిన సిలువమ్రానివైపు నిశ్చలముగా తన కన్నులు పెట్టి చూచి ధ్యానించువాడు నీ ప్రేమామృతము పానముచేసి హృదయము పగిలి వినయముగలవాడై నీ నామము స్మరించుచు ఆనందముచేత శరీరమున గగుర్పాటునొంది ఫలాపేక్షలేక పవిత్రమైన భక్తిచెంది మనసానందముతో వర్ధిల్లును । యేసునాయకా ॥

58. జగతియు దాని సర్వధన సంపదలన్నియు కానుక బెట్టి
యుం, బుగ మమదేహమంతయు బ్రమోదముతో బలిగాగ
వ్రేల్చినం, దెగునె మదీయపాప మెదదీరునె తాపము వేయు
నేల నీ, దగు తనురక్తమే పరమధర్మము నాకది యేసునాయకా.

### తాత్పర్యము

ఈ లోకమును దానిలోనుండు ధనధాన్యాదులన్నియు నీకు అర్పించి నా దేహమంతా సంతోషముతో బలిగా కాల్చివేసినను, నా పాపము పోవునా? హృదయములో వేదన తీరునా? వెయ్యిమాటలేల? నీ శరీరరక్తములే నాకు పుణ్యసాధనము । యేసునాయకా ॥

## ప్రభువు మరణమువలని పుణ్యము

59. పల్లవతుల్య పాదకర పంకజ మధ్యములందు రక్త
మున్, చిల్లున జిమ్మ మేకులు దుసిల్లగ సిల్వనుగొట్టి పక్కలో,
బల్లెము గ్రుచ్చు వారియెడ వైరములేక కృపారసంబు శో భిల్లె
గదా భవద్ధృదయ వీధిని పెల్లుగ యేసునాయకా.

### తాత్పర్యము

లేత చిగుళ్లవంటి మృదువైన నీ కరచరణార విందముల మధ్యనుంచి రక్తము చిమ్మున వచ్చునట్లు మేకులుకొట్టి సిలువకు బిగించి, నీ చిరుడొక్కను

బల్లెముతో పొడిచిన క్రూరులయెడల ద్వేషములేక నీ హృదయమున కృపారసమే మెండుగ ప్రవహించెగదా। యేసునాయకా॥

60. కొట్టిరి జేరు బందులను గుచ్చిన ముండ్ల కిరీటమాదలఁ, బెట్టిరి దుష్టసైనికులు బిట్టుగ బాధల బెట్టి కల్వరీ, మెట్టను సిల్వమ్రానిపయి బెట్టి వధించిరి భక్తులాత్మచే, పట్టను గాదె యీ దశకు బాల్పడినాడవు యేసునాయకా.

తాత్పర్యము

దుర్మార్గులగు రాణువవారు పెద్దమేకులతో [నీ కాలుసేతులను] బిగించిరి; నీ తలకు గుచ్చుకొనే ముండ్లకంపతో చేసిన కిరీటము పెట్టిరి; కఠినమైన బాధలు పెట్టి కల్వరి గుట్టను సిలువమీద నిన్ను వధించిరి; ఇది యెందుకు! నీ భక్తుల ఆత్మలను రక్షించుటకేగదా యీ శ్రమలన్నిటికి నీవు లోబడితివి। యేసునాయకా॥

61. పొంతిపిలాతు మ్రోల గొనిపోయెడి దుర్జనయూథ సైనికుల్, మించి మహోగ్ర బాధలను మృత్యువొనర్పగ బోవు నత్తరిన్, ముంచిన గాలివానలకు మూర్ధము వంచని కొండరీతినీ, యంచితమైన ధైర్యమహిమాద్భుత మొప్పెను యేసునాయకా.

తాత్పర్యము

దుష్టులయిన సైనికులు పొంతిపిలాతునొద్దికి నిన్ను తీసికొనిపోయి బహు క్రూరమయిన శ్రమలు నీకు కలుగజేసి నిన్ను చంపబోవునప్పుడు కొండనె ముంచునంత వానకు తుఫాను గాలికి తలవంచని పర్వతమువలె నీవు మహాతిశయమగు ధైర్యమును చూపుచు సహించితివిగదా! । యేసునాయకా॥

62. పులుగులకుండె గూళ్లు మరి బొల్పుగ నక్కలకుండె గోతులీ, యిల తల చాఁవ నాకు తల మెక్కఁడ లేదని దీన వృత్తితో, బలికెడి నీ మృదూక్తులకు భక్తుల డెందము

గంది కుంది క, న్గొలుకుల నశ్రుబిందువులు గొబ్బున రాలవె యేసునాయకా.

### తాత్పర్యము

పక్షులకు గూళ్లును, నక్కలకు కన్నము లున్నవిగాని యీ లోకములో తల వాల్చుటకు నాకు స్వంత స్థలములేదని నీవు పలికిన దీనవాక్యమునకు నీ భక్తజనులు మనస్సు కరిగి నొచ్చుకొని వారి కన్నులనుండి నీరు ధారలుగా కారవా। యేసునాయకా॥

63. కరములు పార జాపి యిరు కాళ్లొకచో నిడి సిల్వ మ్రానిపై, తిరముగఁ బండ బెట్టి బలు దిట్టపు మేకుల గొట్టు వేళ నె, త్తురు లొగిబారు గాయములతో శ్రమతో కడుసల్పు తోడ నీ, వరుదగు బాధ నొందవె తవాశ్రిత రక్షకు యేసు నాయకా.

### తాత్పర్యము

[ఆ నాడు క్రూరులు] నీ చేతులు పారజాపి రెండు పాదములు జోడించి సిలువకొయ్యమీద నిన్నుపరుండబెట్టి బలమైన గసికలతో వాటిని బిగియ గొట్టినప్పుడు ఆ గాయములనుండి రక్తధారలు పారగా నీ వెంతో నొప్పితోను, మనోవేదనతోను, నీ శరణుజొచ్చిన వారి రక్షణార్థమై చెప్ప నలవిగాని బాధ ననుభవించితివిగదా। యేసునాయకా॥

64. పుడమి వణంకె సంతమసమున్ రవి గప్పె సమాధుల ద్రులు, నట్టడువడి బ్రద్దలై తెరిచె కల్వరిమెట్టను నీవు సిల్వపై, నిడుమల నొంది ప్రాణములు వీడిన కాలమునందు నక్కటా, పొడియవదేల నా మనసు మోటతనం బిది యేసు నాయకా.

### తాత్పర్యము

నీవు సిలువమీద శ్రమల ననుభవించి ప్రాణములు విడిచినప్పుడు భూమి కంపించెను, సూర్యబింబము చీకటిమయమాయెను; కల్వరి కొండమీది సమా

ధులును బండలును ఒకపెట్టున పగిలెను గాని నా రాతివంటి గుండె కరుగదే, యెంత మూర్ఖమయినది నా మనస్సు । యేసునాయకా ॥

65. మరణము రెండు రీతులయి మానవులందరి బట్టి చంపెనే, మరణము నాత్మమృత్యువు క్రమంబున పాపమువల్ల నాత్మపై, మరణము నేలె దాని బరిమార్చుటకై మృతిబొంది తీవు నీ, మరణము పాప దుర్మరణ మారణ హేతువు యేసు నాయకా.

### తాత్పర్యము

మనుష్యుని పాపమువల్ల శరీరమునకు మరణము, ఆత్మకు మరణము అను రెండు విధముల మరణము మానవుల కందరికి ప్రాప్తించెను; ఆత్మకు వచ్చిన మరణమును నశింపజేయుటకయి నీవు మరణము నొందితివి; ఇట్టి నీ మరణము పాపమువల్ల వచ్చిన శరీరాత్మల మరణమునకు మరణము కలుగజేయు సాధన మయినది గదా । యేసునాయకా ॥

66. ఒక్కని పుట్టుకన్ భువిని జెందెను పాపము దాని మాన్ప నిం, కొక్కని చావునన్ పుడమి జొచ్చెను పుణ్యము పాపమాదముం, ద్రొక్కెను నీతి పుణ్యముల త్రోవలు నీ మరణంబుచేత పెం, పెక్కెను దీని నమ్ము నరులెంతటి ధన్యులు యేసునాయకా.

### తాత్పర్యము

ఒకడు పుట్టుటనుబట్టి భూలోకములోకి పాపమువచ్చెను, దానిని పోగొట్టి పుణ్యము సంపాదించుటకు మరియొకరి మరణము సాధనమాయెను; అతని పాపము ఆదాము నణగద్రొక్కగా నీవు మరణము పొందినందువల్ల నీతిపుణ్యములు మానవులకు దొరుకు మార్గ మేర్పడెను; ఈ సత్యములు నమ్ము మానవులెంతో ధన్యులు । యేసునాయకా ॥

### ప్రభువుయొక్క ఉచితమగు కృప

67. ఉచిత దయా ప్రభావ మహిమోన్నత శక్తిని నీవు నెందరిన్, ప్రచురముగా ననంత సుఖ భోగుల జేసితి వెంత

వింత దు, ష్ట చరితు డొక్క తస్కరుడు చచ్చెడు కాలము
నందు నిన్ను వే, డుచు జనె గాదె ముక్తికి గడున్ ముద
మొందుచు యేసునాయకా.

తాత్పర్యము

నిర్హేతుకమయిన కటాక్షమును చూపి నీ వెందరినో బాహాటముగా అపరిమితమయిన సుఖము ననుభవించునట్లు చేసితివి, ఇది యెంతో ఆశ్చర్యము కాదా! దురాత్ముడయిన యొక దొంగ మృతినొందే సమయమున నిన్ను ప్రార్థించి మహా ఆనందముతో మోక్షమునకు బోయెనుగదా । యేసునాయకా॥

68. పడతి యొకర్తు వచ్చి తన బాష్ప జలంబుల నీ
పదాబ్జము, ల్గడిగి శిరంబు వంచి కురులన్ దగనొత్తి సుగంధ
తైలమా, యడుగులఁ బూసి ముద్దులిడె నట్టి మహా దురి
తాత్మురాలిపై, కడుదయ జూపి మోక్షపథ గామిని జేయవె
యేసునాయకా.

తాత్పర్యము

ఒక స్త్రీ నీయొద్దికి వచ్చి కన్నీటితో తామరపూవులవంటి నీ పాదములు కడిగి తన తల వెండ్రుకలతో నీ పాదము లద్ది తుడిచి వాటికి సుగంధ తైలము పూసి ముద్దుపెట్టుకొనెను; ఆ పాపాత్మురాలిమీద ఎంతో దయచూపి మోక్ష మార్గమున ప్రవేశపెట్టితివి। యేసునాయకా॥

69. తాలిమిలేని క్రోధపరితాప మనస్కుడునై త్వదీయ
భ, క్తాళిని పాడుసేయ నరికట్టి దమస్కను ప్రోలి కేగునా,
సౌలను వాని నీ పరమ భక్తుని జేసితి విట్టి నీ కృపా, శీల మహా
త్వమబ్బురమ చింత్యమనంతము యేసునాయకా.

తాత్పర్యము

ఎంతకు ఆగనిద్వేషముతో మండుచున్నబుద్ధితో నీ భక్తసమూహమును నశింపజేయవలెనన్న నిశ్చయముతో దమస్కు పట్టణమునకు బోవుచున్న సౌలను నతని నీ పరమభక్తునిగా చేసితివే; ఇట్టి నీ కృపాస్వభావమెంత అద్భుతమైనది! మానవుని బుద్ధికందనిది, యింతంతయని వర్ణింపసాధ్యముకానిది । యేసునాయకా॥

70. ముమ్మరమైన ప్రేమరస ముప్పతిలన్ కనులందు
నశ్రుధా, తమ్మొనరించి యేడ్చియు స్వతంత్ర దయాబలమూని
లాజరా, లెమ్మని బల్కనంతటనె లేచియు వాడు సమాధి మృత్యు
బం, ధమ్ములబాసె నీ కతడు డాసినచుట్టమె యేసునాయకా.

### తాత్పర్యము

విస్తారమయిన ప్రేమ పుట్టుకొనిరాగా కన్నీరు రాల్చుచు విలపించి నీ స్వంత దయాతిశయమును చూపి, లాజరా లెమ్మని పిలువగానే అతడు లేచి సమాధియొక్క మరణముయొక్క కట్లను తెంపుకొనెను; అతడు నీకు దగ్గిర చుట్టమా । యేసునాయకా ॥

71. ఎన్నటిచుట్టమో మరియ యెన్నటిబంధువొ లాజ
రుండు నీ, కెన్నటి కూర్మివిందొ మృతివేళ దలంచిన తస్కరుండు
నీ, రెన్నిక జెందినారు మరియెందరి నీ కృపచేత మోక్షసం,
పన్నులజేసినావు భవబంధములూడిచి యేసునాయకా.

### తాత్పర్యము

ఆ మరియ నీ కేనాటిబంధువో, ఆ లాజరు నీ కెన్నటిచుట్టమో, మరణ సమయమున నిన్ను తలచిన ఆ దొంగ నీకు ప్రియబంధువో, వీరు ప్రసిద్ధిలోకి వచ్చినవారు; ఇంకా యెందరెందరిని పాపబంధములు తెంపివేసి నీ కృపచేత మోక్షభాగ్యము గలవారినిగా చేసియున్నావు । యేసునాయకా ॥

## ప్రార్థన స్తోత్రములు

72. కంటికి రెప్పలడ్డముయి గాచినరీతిని యేసునాథ నా,
వెంట భవత్కటాక్షమగు వీక్షణపంక్తుల నంటజేసి యా, కొంటె
పిశాచి బాధ విడగొట్టి సదా నను గాచికొంచు మ, త్కంటక
దుస్స్వభావ దురితంబులణంచవె యేసునాయకా.

### తాత్పర్యము

కనుగుడ్డును రెప్పలు సంరక్షించినట్లు, ఓ యేసునాథా, నీ కృపగల చూపులు నామీదనిలిపి నన్ను వెంబడింపజేసి ద్రోహియయిన ఆ సాతాను

బాధను తప్పించి నన్నెల్లప్పుడు రక్షించుము; నా దుష్టస్వభావమువల్ల పుట్టే పాపాములను తలయెత్తనీయక నశింపజేయుమయ్యా। యేసునాయకా॥

73. ఆఁకలి దీరు బెబ్బులి గుహన్గడు నిద్దురబోయినట్లు
పెం, జీకటితోటి సాటిగొను చెడ్డస్వభావము క్షీణభావమై,
కాఁకలుమాని నిద్రగొనె గావున నింకది లేచి నా పయిం, బ్రాఁ
కకమున్నె దాని బరిమార్చవె వేఁడెద యేసునాయకా.

### తాత్పర్యము

ఆకలితీరిన పెద్దపులి దాని గుహలోపరుండి నిద్రపోవుచున్నట్లున్న నా పాపస్వభావము గాఢాంధకారమును బోలినదైయున్నను, ఇప్పుడు దాని వడి తగ్గి నిద్రపోవుచున్నట్టు ఉన్నది; అది తిరిగిలేచి నామీదపడి నన్ను లోపరచుకొనకముందే దాని సంహరించుమని వేడుకొనుచున్నాను। యేసునాయకా॥

74. అడిగినవారి కియ్యబడు నన్న భవద్వచనంబు నమ్మి నీ,
యడుగులక్రింద మూర్ధ్నమిడి యశ్రుయుతాక్షులు మోడ్చి
భక్తియిం, పడరగ నీకు మ్రొక్కెద కృపాయతదృష్టిని నన్ను జూచి
నా, యిడుమలు బాపి యాత్మ సుఖమియ్యవె యిప్పుడు యేసు
నాయకా.

### తాత్పర్యము

అడిగినవారి కియ్యబడునన్న నీ మాట నమ్మి నీ పాదములక్రింద నా తల నుంచి కన్నీళ్లతోనిండిన కన్నులు మూసికొని భక్తితో నీకు మ్రొక్కెదను; దయతోనిండిన చూపులతో నన్ను చూచి నా శ్రమలు పోగొట్టి ఆత్మానందము దయచేయుమయ్యా। యేసునాయకా॥

75. అందము మీరు నీ పదము లాత్మదలంచి శిరంబువంచి
చె, ల్వొందగ వందనంబిడి యి దొక్కటి వేఁడెదనయ్య నేను నీ,
సుందర దివ్యనామ పరిశుద్ధ కథామృత పానమాన సా, నందము
సర్వదాయొసగి నన్గరుణింపవె యేసునాయకా.

### తాత్పర్యము

నీ దివ్యమయిన పాదములను మనస్సులో తలచుకొని, తలవంచి తగినట్టుగా నమస్కారముచేసి మొక్కి మనవిమాత్రము చేసికొనుచున్నాను; నన్ను కరుణించి దివ్యమగు నీ నామమునుగూర్చిన పరిశుద్ధ కథయనే అమృతపానము చేయుటచేత కలుగు ఆనందము నెల్లప్పుడు అనుభవించునట్లు దయచేయుము। యేసునాయకా ॥

76. నీ కరుణాకటాక్షమను నీడల జాడల జేర్చకున్న హా,
హాకరమైన దుఃఖముల కాస్పదమయ్యెదనయ్య నాకు నీ, వే కద
దిక్కు ఇంకెవరివెన్కను బోతిని చెప్పుమయ్య న, న్నైకొని
బ్రోవుమయ్య నినునమ్మితి బుద్ధిని యేసునాయకా.

### తాత్పర్యము

నీ దయాదాక్షిణ్య అనుభవము నాకు దయచేయనియెడల హాహాయని విలపించు విలాపములు నా పాలగును; నా కాశ్రయమునీవే, మరి యెవరి చాటును చేరితినో చెప్పుమయ్య; నన్ను చేపట్టి రక్షించుము, నిన్నే నమ్మియున్నాను। యేసునాయకా ॥

77. పేదురపొస్తలుండు రిపు బృందము ముందట మూడు
మార్లు ని, న్నేదముచేసి బొంకెమది భీతినినంతట వానితట్టు ప్రే
మోదయమైన చూపొకటి యోరగ జూచితి వట్టిచూపు నా,
మీదను జూడవే యనుచు వేడెద నిప్పుడు యేసునాయకా.

### తాత్పర్యము

నీ శిష్యుడగు పేతురు శత్రుసమూహమునకు భయపడి వారియెదుట నిన్నెరుగనని బొంకెను; అప్పుడతనివైపు ప్రేమతో నిండిన చూపొకటి చూచితివి, అట్టి చూపు నామీదను చూపుమని వేడుకొనుచున్నాను। యేసునాయకా॥

78. నను గన రాగదే దినదినంబు భవత్సముఖంబునందు
నా, కనుగవ నీరధారలివె గారుచునున్నవి నీ పదాబ్జముల్,

మునుగగజేసి స్తోత్రమను పువ్వులపూజలు చేతు నాపయి,
న్కనికరముంచవే యితరకాంక్షలు మానిపి యేసునాయకా.

తాత్పర్యము

ప్రతిదినము నన్ను చూడరమ్ము, యేసునాథా; నీ సన్నిధిని నా రెండు కండ్లనుండి నీరు ధారలుకట్టి కారుచున్నవి; వీటితో నీ పాదపద్మములను కడిగి స్తుతులను పువ్వులతో వాటిని పూజింతును; నామీద దయయుంచి యితర ఆశలు నాలోనుంచి తీసివేయుము। యేసునాయకా॥

ఉ. మా. 79. ముచ్చటలూర నీ చరితమున్ వినగోరెడు వీనులాత్మ
లో, నచ్చున వేసినట్లు భవదంఘ్రులు జూచెడు కన్నుదోయి ని,
ప్పచ్చర దోసముల్ చిదుము పావననామము బల్కు జిహ్వనా,
కిచ్చి కృతార్థుజేసి దయనేలవె యెప్పుడు యేసునాయకా.

తాత్పర్యము

ఆశతీర నీ చరిత్ర వినగోరెడు చెవులును, నా హృదయమునందు అచ్చు వేసియున్నట్టు నీ పాదపద్మములను చూడగల కన్నులును, ఎంతెంత ఘోరపాపములను హరించు నీ పరిశుద్ధ నామము నుచ్చరించు నాలుకయును, నా కనుగ్రహించి నన్ను కృతార్థునిచేయుము, దయతో నన్ను పాలించుము। యేసునాయకా॥

చ. మా. 80. నిరతము నీ పదాబ్జములు నిశ్చలభక్తిని గొల్చు
సాధులం, దరుచుగ జేరనిచ్చి తవ దాసజనావళి తోటి పొందు
ను, స్థిరముగజేసి నాకు పరితృప్తియుతంబగు నెమ్మి నీ పయిన్,
మరువనిబుద్ధి యీ పరమభాగ్యము లియ్యవె యేసునాయకా.

తాత్పర్యము

ఎల్లప్పుడు నీ పాదపద్మములు స్థిరమయిన భక్తిప్రేమతో సేవించు భక్తులతోకూడి, వారితో సహవాసముచేయు భాగ్యమును, సంతుష్టితో నిండిన మనోనెమ్మదియు, నిన్నెన్నడు మరువని మనస్సును నా కనుగ్రహించుమా। యేసునాయకా॥

81. నన్నుగురించి బ్రోచుటకు న్యాయ మొకింతయు లేదు
గాని నా, విన్నప మాలకించుమిదె వేదురునై చెడిపోయినా
డరా, వన్న సహింపవన్న బ్రతిమాలెదనన్న విలంబమేటికో,
యన్న భవత్కటాక్షమణు వంత యొసంగుము యేసునాయకా.

తాత్పర్యము

నన్ను రక్షించవలసిన విధి నీ కెంతమాత్రము లేదుగాని నా మనవి వినుము; నేను వెర్రివాడనై చెడిపోతిని; నన్ను రక్షించుటకు రమ్ము, ఇక నేను తాళలేను, నిన్ను వేడుకొనెదను, ఆలస్యమేల చేసెదవు? ఏ మాత్రమైన సరే నీ కృప చూపుము । యేసునాయకా ॥

82. నేరము లెంచకయ్య యిక నీ పదమే గతియంచు
జేరితిన్, దూరము జూడకయ్య కడు దుఃఖపయోనిధి నీదు
చున్ననన్, పారము జేయుమయ్య యఘ భారమునంతయు
బాపి నన్ను నీ, వారల గూర్చుమయ్య దృఢ భక్తియుతంబుగ
యేసునాయకా.

తాత్పర్యము

నా అపరాధములు లెక్కింపకుము; నీ పాదమె నాకు గతి యని నేను వచ్చియున్నాను, నన్ను దూరముగా నుంచకుము, అపారమయిన దుఃఖసముద్రములో పడి యీదుచున్న నన్ను ఒడ్డెక్కించుము; నా పాపభారమంతా తీసివేసి నీయందు స్థిరమయిన భక్తియుంచి నన్ను నీ జనుల లెక్కలో చేర్చుకొనుము । యేసునాయకా ॥

83. జీవులకెల్ల రాజవయి జీవుల జీవనమిచ్చు దాతవై,
జీవుల పాపముల్ దొలగ జేయను జీవమొసంగు త్రాతవై,
జీవుల మధ్యవర్తివయి సిల్వను మృత్యువు నొందియున్ పున,
ర్జీవము దాల్చి మోక్షనగరిన్ చిరజీవివి యేసునాయకా.

తాత్పర్యము

ప్రాణికోటి కంతటికి రాజవు నీవు, జీవుల కన్నిటికి ఆహారమునిచ్చు దాతవు నీవు, నరుల పాపములను పోగొట్టుటకై నీ ప్రాణమిచ్చిన రక్షకుడవు